అవుట్!

జిల్లాలో సీనియర్ రాజకీయ నాయకులైన ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిలను సీఎం జగన్ పక్కన పెట్టేశారు. అనుకోని పరిణామాలు సంభవిస్తే తప్ప వారికి తిరిగి పార్టీలో ప్రాధాన్యమిచ్చే అవకాశాలు కనిపించడం లేదు. మాగుంటకు అయితే టికెట్ ఇచ్చే ప్రశ్నేలేదని జగన్ తేల్చిచెప్పారు. తనను కలిసేందుకు వేచి ఉన్న బాలినేనికి ఇంటర్వ్యూ కూడా ఇవ్వలేదు. పైగా మాగుంటపై కొన్ని కీలక వ్యాఖ్యలు చేయడంతో ఆయన అనుచరులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. బాలినేని ఇక వేచి ఉండటం వేస్ట్ అంటూ విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. జిల్లాలో కొన్ని నియోజకవర్గాల పార్టీ సమావేశాలకు రావాలని ఆయన్ను విజయసాయి ఆహ్వానించగా నో చెప్పేశారు. దర్శి నుంచి పోటీకి శివప్రసాద్‌రెడ్డికి లైన్‌క్లియర్ చేసిన జగన్.. కందుకూరు నుంచి మహీధరరెడ్డిని పక్కనపెట్టేందుకు సిద్ధమయ్యారు. ఆయన స్థానంలో యాదవ సామాజికవర్గం వారికి అవకాశం ఇచ్చేందుకు కొత్త పేర్లు పరిశీలిస్తున్నారు. మిగిలిన స్థానాలపై ఇప్పటికీ స్పష్టత రాలేదని సమాచారం.



మాగుంటకు నో టికెట్ ■ బాలినేనికి నో ఇంటర్వ్యూ

- అయోమయంలో వైసీపీ
- ఎంపీపై పుల్లను పెట్టి గెలిపిస్తానన్న జగన్
- ఒంగోలు అసెంబ్లీకి కొత్త పేర్ల పరిశీలన
- కందుకూరు నుంచి బీసీని దించే ప్రయత్నం
- దర్శిలో శివప్రసాద్‌రెడ్డికి లైన్ క్లియర్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

తాజా పరిణామాల నేపథ్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని వైసీపీ శ్రేణులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. సీనియర్ నాయకులైన బాలినేని శ్రీనివాసరెడ్డి, మాగుంట శ్రీనివాసులరెడ్డిలను సీఎం జగన్ పక్కనపెట్టడం, ఇతర కొన్ని నియోజకవర్గాల విషయంలో చోటుచేసుకుంటున్న అనూహ్య పరిణామాలు అందుకు కారణమయ్యాయి. ఒంగోలు లోక్‌సభ నుంచి తిరిగి పోటీ చేసేందుకు మాగుంటకు చాన్సే లేదని చెప్పిన సీఎం.. బాలినేనికి తనను కలిసే అవకాశం కూడా ఇవ్వలేదు. దీంతో ఆ ఇద్దరు నాయకులు ప్రత్యామ్నాయంగా భవిష్యత్తు కార్యాచరణపై ఆలోచిస్తున్నట్లు సంకేతాలిచ్చేశారు.

మాగుంటకు నో చాన్స్

ఒంగోలు ఎంపీ మాగుంటను పిలిచి మాట్లాడినందుకు ఎంపీ విజయసాయిరెడ్డి, ఐప్యాక్ ఇన్‌చార్జి రిషిసింగ్‌లపై సీఎం జగన్ తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. చంద్రబాబు, పవన్, లోకేష్‌లను తిట్టడంతోపాటు పెద్దమొత్తంలో డబ్బులు డిపాజిట్ చేయాలని జగన్ విధించిన షరతును మాగుంట తిరస్కరించిన విషయం విదితమే. అయితే అనూహ్యంగా ఐప్యాక్ నుంచి ఆయనకు తాడేపల్లి వచ్చి కలవాలని పిలుపొచ్చింది. సోమవారం రాత్రి మాగుంట, ఆయన కుమారుడు రాఘవరెడ్డి ఐప్యాక్ ప్రతినిధిని కలిశారు. మాగుంటకు విధించిన షరతులను వెనక్కు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. అయితే బుధవారం మధ్యాహ్నం సాయిరెడ్డితోపాటు ఐప్యాక్ ప్రతినిధిని జగన్ పిలిచి మాగుంటతో ఎందుకు మాట్లాడారని తీవ్రంగా మందలించారని తెలిసింది. అంతేగాక షరతులకు ఒప్పుకోని మాగుంట తన గడప తొక్కటానికి వీల్లేదని తీవ్ర ఆంక్ష విధించినట్లు సమాచారం. ఒక దశలో మాగుంట కాకపోతే పుల్లను పెట్టి గెలిపిస్తానని కూడా ఆయన వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఈ విషయం తెలిసి మాగుంట మరింత అసంతృప్తికి లోనైనట్లు సమాచారం. 30ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ ఎదురుకాలేదంటూ ఆవేదన చెందుతున్నట్లు చెప్తున్నారు. అంతేగాక కుటుంబ రాజకీయ భవితవ్యంపై తీవ్రంగా ఆలోచిస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిసింది.

అనుచరులతో సమాలోచనలు

రెండురోజులుగా తన రాజకీయ భవితవ్యంపై జిల్లాలోని అనుచరులు, ప్రత్యేకించి ఒంగోలులోని ముఖ్య నాయకులు, శ్రేయోభిలాషులతో బాలినేని సమాలోచనలు చేసినట్లు తెలుస్తోంది. కొందరిని విజయవాడ పిలిపించుకుని చర్చలు జరిపినట్లు సమాచారం. మంగళవారం రాత్రి అయితే ఒంగోలులోని శ్రేయోభిలాషులకు బాలినేని ఫోన్లు చేసి తన భవిష్యత్తు పయనం గురించి వారి అభిప్రాయం తెలుసుకునేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. అలాగే ఆయన విజయవాడ నుంచి వెళ్లారని తెలిశాక ఫోన్లు చేసిన అనుచరులకు హైదరాబాద్‌లో అందుబాటులో ఉంటానని చెప్పినట్లు తెలిసింది. ఇదే సమయంలో బుధవారం రాత్రి మాగుంట, బాలినేనిలు మాట్లాడుకున్నట్లు సమాచారం. ఎంపీ మాగుంట ఇప్పటికే ముఖ్యమైన ఒకరిద్దరు టీడీపీ నాయకులతో టచ్‌లో ఉన్నట్లు ప్రచారం ఉంది.

మహీధర్‌రెడ్డికి ఝలక్?


ఉమ్మడి జిల్లాలో మరో సీనియర్ నాయకుడైన కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డిని తప్పించే యోచనలో జగన్ ఉన్నారని సమాచారం. ప్రతిపక్ష నాయకులను తిట్టాలన్న షరతును ఆయన కూడా తిరస్కరించిన విషయం తెలిసిందే. దీంతో ఆయన స్థానంలో బలహీనవర్గాలకు చెందిన వ్యక్తిని రంగంలోకి తేవాలని భావిస్తున్నారు. మాజీమంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌ను బుధవారం జగన్ పిలిచి మాట్లాడారు. ఆయన నెల్లూరు సిటీ నుంచే పోటీ చేస్తానని చెప్పటంతో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. అయితే కందుకూరులోని పార్టీశ్రేణుల నుంచి అనిల్‌కుమార్‌తోపాటు పీసీపల్లి మండలంలో డాక్టర్‌గా ఉన్న పెరుగు మురళీకృష్ణయాదవ్, టంగుటూరు మండలానికి చెందిన వైసీపీ బీసీ నాయకుడు బొట్ల రామారావు, కందుకూరుకు చెందిన అప్పనబోయిన నరసింహం పేర్లపై కూడా కార్యకర్తల అభిప్రాయాలను సేకరించినట్లు సమాచారం.

ఒంగోలుకు పలు పేర్ల పరిశీలన

ఒంగోలు లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేసే అభ్యర్థుల విషయంలో వైసీపీ అధిష్ఠానం పలు పేర్లను పరిశీలనలోకి తీసుకొంది. మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డిని రాజ్యసభకు పంపితే ఆయన కుమారుడు విక్రాంత్‌రెడ్డిని ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి పోటీచేయించాలన్న ఆలోచనలో జగన్ ఉన్నట్లు తెలుస్తోంది. ఒంగోలు నుంచి పోటీకి శిద్దా ససేమిరా అనడంతో ఆయన పార్టీలో ఉంటే గిద్దలూరు పంపించి ఒంగోలు నుంచి చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను రంగంలో దింపితే ఎలా ఉంటుందన్న పరిశీలన చేస్తున్నట్లు సమాచారం. ఇలా కొత్తకొత్త ప్రయత్నాల్లో జగన్ ఉండటంతో వైసీపీ కేడర్‌లో అయోమయం నెలకొంది.



ఒంగోలు ఎంపీ మాగుంట



ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని

అలిగి హైదరాబాద్ వెళ్లిన బాలినేని

సాయిరెడ్డి పిలుపుమేరకు సోమవారం సాయంత్రానికి విజయవాడ చేరిన బాలినేనికి బుధవారం మధ్యాహ్నం వరకు కూడా జగన్ ఇంటర్వ్యూ దొరకలేదు. సోమవారం సీఎంను కలవాలని విజయసాయి సూచించగా తాను మంగళవారం కలుస్తానని బాలినేని చెప్పారు. కారణం ఏమైనా ఇక ఆతర్వాత సీఎం ఇంటర్వ్యూ ఇవ్వలేదు. అంతేగాక తిరిగి మాగుంటకు టికెట్ ఇవ్వాలని బాలినేని పట్టుబడుతున్నారు. అయితే మాగుంట తన గడప తొక్కడానికి వీల్లేదంటూ జగన్ హెచ్చరించారు. ఇక ఆ తర్వాత బాలినేని కూడా వేచి ఉండటం వేస్ట్ అన్న నిర్ణయానికి వచ్చి హైదరాబాద్ వెళ్లిపోయినట్లు తెలిసింది. అంతకు ముందు బాలినేనికి సాయిరెడ్డి ఫోన్‌చేసి 'మాగుంట విషయంలో ఆగ్రహంగా ఉన్నది నిజమే. కానీ మీ విషయంలో కాదు కదా' అంటూ విజయవాడలోనే ఉండమని కోరినట్లు తెలిసింది. అంతేగాక కొండపి, ఎస్‌ఎన్‌పాడు నియోజకవర్గాలలో మిమ్మల్ని (బాలినేనిని) తీసుకెళ్లి సమావేశాలు పెట్టాలని సీఎం సూచించారని చెప్పారు. శుక్రవారం ఆ సమావేశాలు పెడదామని ఆయన అనగా.. 'నేను సీఎంను కలిసేది లేదు. ఒంగోలు దాటి ఇతర ప్రాంతాలకు రానని ఎప్పుడో చెప్పాను. ఇక మర్చిపోండి. నేను ఏ మీటింగులకు రాను' అంటూ బాలినేని సీరియస్‌గానే చెప్పినట్లు సమాచారం.

ఏసీబీకి చిక్కిన వీఆర్వో, వీఆర్‌ఏ

- భూమి ఆన్‌లైన్‌కు రూ.20వేల లంచం డిమాండ్
- డబ్బులు తీసుకుంటూ పట్టుబడిన వారి స్నేహితుడు



ఏసీబీ అధికారులకు పట్టుబడిన వీఆర్వో, వీఆర్‌ఏ, వారి స్నేహితుడు

ఎర్రగొండపాలెం, జనవరి 10 : భూమి ఆన్‌లైన్ కోసం రైతు నుంచి లంచం తీసుకుంటూ బుధవారం వీఆర్వో, వీఆర్‌ఏ ఏసీబీకి పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రమైన త్రిపురాంతకానికి చెందిన ఎన్.నాగిరెడ్డి అనే రైతు ఎర్రగొండపాలెం మండలం రామచంద్రాపురం రెవెన్యూలో తన తల్లి నుంచి సంక్రమించిన 1.49 ఎకరాల భూమిని ఆన్‌లైన్ చేయాలంటూ గంగపాలెం వీఆర్వో కుమార్ నాయక్‌ను సంప్రదించారు. అందుకు రూ.25వేల లంచం ఇవ్వాలని వీఆర్వో డిమాండ్ చేశారు. దానికి ఇష్టపడని నాగిరెడ్డి ఈనెల 1న ఒంగోలు ఏసీబీ డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఆమేరకు ఏసీబీ అధికారులు ఈనెల 6న వైపాలెం వచ్చి విచారించారు. అనంతరం వారి సూచన మేరకు నాగిరెడ్డి తిరిగి వీఆర్వోను కలిసి మాట్లాడగా రూ.20వేలకు ఒప్పుకున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో వీఆర్వోకు రైతు నాగిరెడ్డి రూ.20వేలు ఇస్తుండగా పక్కనే ఉన్న గురిజేపల్లి వీఆర్‌ఏ జానీబాషాకు ఇవ్వాలని ఆయన చెప్పారు. వీఆర్‌ఏ బాషా అక్కడే ఉన్న తన స్నేహితుడు చింతలచెర్వు వెంకటేశ్వరరెడ్డిని డబ్బులు తీసుకోవాలని సూచించారు. రూ.20వేలను వెంకటేశ్వరరెడ్డి తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అది చూసిన వీఆర్వో, వీఆర్‌ఏలు అక్కడి నుంచి ఉడాయించేందుకు ప్రయత్నించారు. గమనించిన ఏసీబీ సీఐ, సిబ్బంది వెంటాడి వారిని పట్టుకున్నారు. వారిని తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లి విచారించారు. ముగ్గురినీ అరెస్టు చేశామని, నెల్లూరు ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ డీఎస్పీ వి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ దాడిలో ఏసీబీ సీఐలు ఎన్‌ఎస్‌ఎస్ అపర్ణ, శేషు, ఎస్‌ఐ జేఎన్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



తాగునీటి కోసం సాగర్ జలాలు

- ప్రకాశం, గుంటూరు ఉమ్మడి జిల్లాలకు ఐదు టీఎంసీలు
- రేపు జిల్లాలోకి ప్రవేశించే అవకాశం

ఒంగోలు (కలెక్టరేట్), జనవరి 10: తాగునీటి అవసరాల కోసం ప్రకాశం, గుంటూరు ఉమ్మడి జిల్లాలకు ఐదు టీఎంసీల నీటిని సాగర్ డ్యాం నుంచి విడుదల చేశారని ఇరిగేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ కె.లక్ష్మీరెడ్డి బుధవారం తెలిపారు. దీన్ని జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో ఉన్న 98 గ్రామీణ తాగునీటి చెరువులు, నాలుగు పట్టణ ఎస్‌ఎస్ ట్యాంకులకు సరఫరా చేస్తామన్నారు. జిల్లా సరిహద్దుకు ఈనెల 12వతేదీకి నీరు చేరుతుందన్నారు. పది రోజులపాటు నీటి సరఫరా జరిగే అవకాశం ఉందన్నారు. సాగర్ జలాశయంలో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున తాగునీటి చెరువులు నింపి మూడు, నాలుగు నెలలపాటు జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆయకట్టు రైతులు కూడా వర్షాధార పంటలను మాత్రమే సాగు చేసుకోవాలని సూచించారు. గ్రామీణ నీటి సరఫరా, జలవనరుల శాఖ, ప్రజారోగ్య, మునిసిపల్, రెవెన్యూ, పోలీస్‌శాఖల పర్యవేక్షణలో చెరువులను నింపుతామని ఆయన తెలిపారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు

- పౌరసరఫరాల సంస్థ డీఎం గ్లోరియా

ఒంగోలు (కలెక్టరేట్), జనవరి 10: జిల్లాలో 2023-24 సీజన్‌లో సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ ద్వారా ధాన్యం, కందులను కొనుగోలు చేస్తామని డీఎం గ్లోరియా తెలిపారు. ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. ఈ సీజన్‌లో ,10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం, 30వేల మెట్రిక్ టన్నులు కందులు కొనుగోలు చేస్తామని చెప్పారు. సమావేశంలో డీఎస్‌వో ఉదయభాస్కర్, డీసీవో రాజశేఖర్, డీఏవో శ్రీనివాసరావు, ఏవోలు తదితరులు పాల్గొన్నారు.

అయినా.. తగ్గేదేలే!



ఒంగోలులో అంగన్‌వాడీ కేంద్రం బోర్డుపై ఉంచిననోటీసు



ఒంగోలులో ఉరితాళ్లు బిగించుకొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కొనసాగుతున్న అంగన్‌వాడీల ఆందోళన

- ఎస్మా అమలు దిశగా ప్రభుత్వం అడుగులు
- కేంద్రాలకు నోటీసులు అంటిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ఒంగోలు నగరం, జనవరి 10 : డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం నాటికి 30వరోజుకు చేరింది. ఎస్మాను ప్రయోగిస్తామని ప్రభుత్వం బెదిరించినా ఆయాలు, కార్యకర్తలు ఏమాత్రం వెనకడుగు వేయడం లేదు. జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ వినూత్న రీతిలో ఆందోళనలు చేస్తున్నారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన 24గంటల రిలే దీక్షలు బుధవారం నాటికి 5వ రోజుకు చేరుకున్నాయి. ఒకవైపు దీక్షను కొనసాగిస్తూనే ఉరితాళ్లతో వినూత్న నిరసన తెలిపారు. జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల కేంద్రాల్లో కార్యకర్తలు చెవిలో పువ్వులు, ఒంటికాలిపై నిలబడటం, ఎస్మా ప్రతులను తగలబెట్టడం వంటి కార్యక్రమాలను చేపట్టారు.

కఠిన చర్యలు తప్పవంటూ ప్రభుత్వం నోటీసులు

ఐసీడీఎస్ సేవలను అత్యవసర సేవల కిందచేర్చి రాష్ట్రప్రభుత్వం వారం క్రితం అంగన్‌వాడీలపై ఎస్మాను ప్రయోగించింది. ఈనెల 9వతేదీలోపు సమ్మెను విరమించి విధుల్లో చేరకపోతే చట్ట ప్రకారం చర్యలు తప్పని హెచ్చరించింది. అయినప్పటికీ కార్యకర్తలు వెరవకుండా సమ్మెను కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు బుధవారం నుంచి నోటీసుల ప్రక్రియను ప్రారంభించారు. ఒంగోలు నగరంలో కేంద్రాలకు వాటిని అంటిస్తున్నారు. వెంటనే విధుల్లో చేరాలని లేనిపక్షంలో కఠినచర్యలు తప్పవని వాటిలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో అంగన్‌వాడీలకు నోటీసులు ఇచ్చి వారు విధుల్లో చేరేలా చూడాలని ప్రభుత్వం నుంచి జిల్లా ఐసీడీఎస్ అధికారులకు ఆదేశాలు అందాయి. కొన్ని ప్రాజెక్టుల సీడీపీవోలు నోటీసులను అంగన్‌వాడీలకు పోస్టు ద్వారా పంపించే ఏర్పాట్లు చేస్తునట్లు సమాచారం.

పెరుగుతున్న మద్దతు

అంగన్‌వాడీల ఆందోళనకు రోజురోజుకీ మద్దతు పెరుగుతూనే ఉంది. బుధవారం కలెక్టరేట్ వద్ద దీక్షలను ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజనల్ కార్యదర్శి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శేషయ్య, ఎంఎస్‌ఆర్‌యూ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వినోద్, సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ జిల్లా కార్యదర్శి సుబ్బారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీ.వి.కొండారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, నగర అభివృద్ధి కమిటీ నాయకుడు మారెళ్ల సుబ్బారావు, జీ.వి.కల్పన, మహేష్ సంఘీభావం తెలిపారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్, విద్యార్థి జేఏసీ నాయకుడు ఆర్.జగదీష్ తమ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ, కేవీ.సుబ్బమ్మ, ప్రశాంతి, హెమీమా, నిర్మల పాల్గొన్నారు.


సమగ్ర శిక్ష ఉద్యోగుల వినూత్న నిరసన

- దీక్షా శిబిరం వద్ద పొర్లుదండాలు పెడుతూ వేడుకోలు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 10 : సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రతతోపాటు హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె 22వ రోజైన బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరవధిక దీక్షను కొనసాగించారు. పొర్లుదండాలు పెడుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ప్రభుత్వం మొండివైఖరిని విడనాడాలని నినదించారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిబాబు, కల్యాణి తదితరులు ఉన్నారు.



పొర్లుదండాలతో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు



కర్ణాటకలో పొగాకు మార్కెట్ జోరు

- కిలో రూ.250పైనే పలుకుతున్న ధర
- ఇప్పటికే మూడొంతుల కొనుగోళ్లు పూర్తి
- రూ.249 ఉన్న కిలో సగటు ధర

ఒంగోలు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక పొగాకు మార్కెట్ జోరు మీద ఉంది. రెండేళ్ల క్రితం ఆంధ్ర మార్కెట్లో ఉన్న పరిస్థితి ప్రస్తుతం అక్కడ కనిపిస్తోంది. పొగాకు నాణ్యతను నిర్ధారించే గ్రేడ్‌లతో సంబంధం లేకుండా ఏదైనా ధర ఒక్కటే అన్న రీతిలో కొనుగోళ్లు సాగుతున్నాయి. మేలు రకం, మీడియం, లోగ్రేడ్‌లుగా పొగాకు కొనుగోళ్లలో విభజన ఉంటుంది. అలాగే ఒక్కో గ్రేడ్‌లో రెండు నుంచి ఆరేడు రకాలు ఉంటాయి. మేలురకం పొగాకు ధరకు, లోగ్రేడ్ రకం ధరకు సాధారణంగా కిలోకు రూ.100పైనే తేడా ఉంటుంది. అలాంటిది ప్రస్తుతం కర్ణాటక మార్కెట్‌లో గ్రేడ్ ఏదైనా కాస్తంత నాణ్యత ఉంటే ఇంచుమించు ఒకే ధర పలుకుతోంది. మేలిమి పొగాకు కిలో గరిష్ఠ ధర ఇప్పటి వరకు రూ.274 పలుకగా ఆరకం బేళ్లు ఎక్కువ కిలో రూ.260 నుంచి రూ.270 లోపు కొంటున్నారు. అదే సమయంలో మీడియం గ్రేడ్ కిలో రూ.255 నుంచి రూ.270 వరకూ పలుకుతోంది. లోగ్రేడ్‌గా చూపే పొగాకులో నాణ్యత ఉండే బ్రౌన్, ఇతర రకాలను కూడా కిలో రూ.250పైనే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. సాధారణంగా మేలురకం కిలో రూ.270 ఉంటే మీడియం ధర రూ220 అటుఇటుగా ఉంటుంది. లోగ్రేడ్‌లో బ్రౌన్ వంటివి కిలో రూ.170 నుంచి రూ.190లోపు ఉంటాయి. అలాంటిది ప్రస్తుతం మేలురకం, మీడియం, లోగ్రేడ్ తేడా లేకుండా కిలో రూ.250 నుంచి రూ.270 వరకు ధరలు లభిస్తున్నాయి. బేళ్ల కోసం వ్యాపారులు పోటీపడి మరీ కొనుగోలు చేస్తున్నారు. పంట అనుమతించిన దాని కన్నా తక్కువ ఉత్పత్తి జరగడం, విదేశీ మార్కెట్ బాగా ఉండటంతోపాటు విదేశీ కంపెనీల ఆర్డర్లు సానుకూలంగా ఉండటంతో ఈ పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో 2023-24 సీజన్‌కు 100 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా 83 మిలియన్ కిలోలు ఉత్పత్తిగా అంచనా వేశారు. ఇప్పటివరకు సుమారు 60 మిలియన్ కిలోలు కొనుగోలు జరగ్గా కిలో సగటు ధర రూ.249 మేర లభించింది. మరో నెలలో అక్కడ కొనుగోళ్లు పూర్తి కానుండగా గతంలో ఎన్నడూ లేనంత స్థాయిలో ధరలు పలుకుతున్నాయి. అక్కడి మార్కెట్ తీరును ఆంధ్ర ప్రాంత రైతులు నిశితంగా పరిశీలిస్తున్నారు.

సామాజిక న్యాయం జగన్‌తో సాధ్యం : మంత్రి సురేష్


మాట్లాడుతున్న మంత్రి సురేష్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 10 : సామాజిక న్యాయం సీఎం జగన్మోహన్‌రెడ్డితో సాధ్యమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి, కొండపి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. విజయవాడలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఈనెల 19న తరలివెళ్ళేందుకు నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం బుధవారం ఒండపిలోని ఎంఎస్.ఫంక్షన్ హాలులో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ ఈనెల 19న విజయవాడకు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. నియోజకవర్గం నుంచి వెళ్ళేందుకు అవసరమైన ఏర్పాట్లపై మంత్రి చర్చించారు.


మద్దిపాడులో జరిగిన ధర్నాలో పాల్గొన్న అంగన్‌వాడీలు


నాగులుప్పలపాడులో ..

ప్రభుత్వ బెదిరింపులకు భయపడం!

● ఎస్మా ప్రయోగంపై అంగన్‌వాడీల ధ్వజం


కొండపి అంగన్‌వాడీల శిబిరంలో మాట్లాడుతున్న మస్తాన్

కొండపి, జనవరి 10: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతున్నదని వ్యవసాయ కార్మిక సంఘం కొండపి డివిజన్ కార్యదర్శి కేజీ మస్తాన్ అన్నారు. వీటికి భయపడేది లేదని స్పష్టం చేశారు. సమ్మెలో భాగంగా స్థానిక మండల కార్యాలయాల సముదాయం వద్ద కార్యకర్తలు, ఆయాలు కొనసాగిస్తున్న నిరసన శిబిరాన్ని ఆయన బుధవారం సందర్శించి మాట్లాడారు. అంగన్‌వాడీల పనికి తగిన విధంగా నెలకు రూ.26 వేల జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎస్మా ప్రయోగించినా, నోటీసులు ఇచ్చినా వెనక్కి తగ్గేది లేదన్నారు. ఇలాంటి సర్కారు చర్యల వల్ల ఉద్యమం మరింత బలోపేతమవుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి జి.వందనం, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ నాయకులు పున్నమ్మ, చిన్నమ్మాయి, విజయ, కిరణ్మయి, రజని, రమణమ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాలం సుబ్బారావు పేర్కొన్నారు. గత 30 రోజులుగా అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతుగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, తల్లులు బుధవారం మద్దిపాడులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఇప్పటికైనా తమ మొండివైఖరిని విడిచిపెట్టి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. లేదంటే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. నాతాని ధనలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు నోటీసులు అందించడం సరైన పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో జయప్రద, ఆదిలక్ష్మి, ప్రమీల, మేరీ, పద్మావతి, కోమలి రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్): నాగులుప్పలపాడు బస్టాండ్‌సెంటర్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి 30వ రోజుకు చేరింది. రైతు సంఘం నాయకుడు జె.జయంత్‌బాబు వారికి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు టి.శ్రీకాంత్, బసవపున్నయ్య, వెంకటసుబ్బమ్మ, రమ, దుర్గాభవానీ, అరుణ, రజినీ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఎనీమియాపై ప్రజలకు అవగాహన కల్పించాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 10 : సెకిల్‌సెల్ ఎనిమియా వ్యాధిపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ప్రధానంగా గిరిజనప్రాంతాలలో ఈ వ్యాధి విస్తరించకుండా పూర్తిస్థాయిలో వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో బుధవారం సంబంధిత శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా జిల్లా టీబీ, కుష్టు, ఎయిడ్స్ నివారణాధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ జన్యుపరంగా సెకిల్‌సెల్ ఎనిమియా వ్యాధి వస్తుందన్నారు లక్షణాలు ఏవీ లేని సెకిల్ క్యారియర్ (బాధితుడు) మరో సెకిల్ సెల్ క్యారియర్‌ను(బాధితురాలిని) వివాహమాడితే సంతానికి కూడా వస్తుందని తెలిపారు. జిల్లాలో ముందస్తుగా గిరిజన ప్రాంతంలో 14,623 మందికి రక్త పరీక్షలు చేసేందుకు 12,613 కిట్లు జిల్లాకు వచ్చాయని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ పరీక్షల కోసం 126 మంది ఏఎన్‌ఎంలు, 15 మంది మెడికల్ ఆఫీసర్లకు శిక్షణ కూడా ఇచ్చినట్లు చెప్పారు. ఆయా అంశాలపై కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే నెలాఖరు నాటికి జిల్లాలోని గిరిజనప్రాంతాలలో పూర్తిస్థాయిలో రక్త పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ వ్యాధి లక్షణాలు, వ్యాపించే అవకాశాలపై అన్ని గిరిజన గ్రామాలు, పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో అధికారులు డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి, మాధురి, వీఎస్.సుబ్బారావు, లక్ష్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే లైసెన్సు రెన్యువల్స్..

జిల్లాలో స్కానింగ్ సెంటర్ల నిర్వహణకు అవసరమైన అనుమతులు మంజూరులో నిబంధనలు ఉల్లంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ సమావేశపు హాలులో వైద్యఆరోగ్యశాఖ అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఆయా సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా చూడాలన్నారు అనుమతుల మంజూరుతో పాటు వాటి పునరుద్ధరణ సమయంలో అవసరమైన తనిఖీలను పక్కాగా చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లకు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ భగీరథి, ఎస్ఏఆర్‌డీఎస్ ప్రోగ్రామ్ మేనేజర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి బైపాస్‌రోడ్డుపై ప్రమాదం

టిప్పర్, తుఫాన్ వాహనం ఢీ

మార్కాపురానికి చెందిన నలుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన వాహనాలు, సంఘటనా స్థలంలో క్షతగాత్రులు

చీమకుర్తి, జనవరి 10: చీమకుర్తి ఔటర్ బైపాస్ రహదారిపై బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మార్కాపురంనకు చెందిన నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. మార్కాపురంనకు చెందిన గుమ్మడి శ్రీనివాసరెడ్డి, నాసర్‌రెడ్డి, మంగమూరి శ్రీనివాసులు, గోపాలరెడ్డిలు తుఫాన్ వాహనంలో ఒంగోలుకు వచ్చి తమ పనులు ముగించుకున్న తదుపరి తిరిగి బయలుదేరారు. చీమకుర్తి ఔటర్ బైపాస్ పెట్రోల్‌బంక్ సమీపంలో ముందు వాహనాన్ని క్రాస్ చేసే సమయంలో ప్రమాదవశాత్తు ఎదురుగా వస్తున్న గ్రానైట్ రాళ్లతో రామాయపట్నం వెళ్తున్న టిప్పర్‌ను ఢీకొనటం జరిగింది. ఈ సంఘటనలో వాహనంలో ఉన్న నలుగురికి గాయాలు కాగా వారిని చీమకుర్తి సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్సను అందించారు. అనంతరం క్షతగాత్రులకు మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని సందర్శించిన పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

కిమ్స్ వైద్యశాలలో గుండెకు అత్యాధునిక వైద్యం

● డాక్టర్ లక్ష్మణ్‌రెడ్డి


మాట్లాడుతున్న వైద్యనిపుణులు

ఒంగోలు(రూరల్), జనవరి10: ఒంగోలులోని ప్రముఖ కిమ్స్ వైద్యశాలలో అధునాతన పరికరాలతో నిపుణులైన వైద్యులతో గుండెకు అత్యాధునిక వైద్యసేవలు అందిస్తున్నట్లు గుండె వైద్యనిపుణుడు పొన్నపాటి లక్ష్మణ్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఒంగోలు కిమ్స్ వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒంగోలు నగరం కేశరాజుపేటకు చెందిన పొట్టూరి నాగరాజు అనారోగ్యంతో డిసెంబరులో కిమ్స్ వైద్యశాలకు వచ్చినట్లు చెప్పారు. నడవలేకపోవటం, నడిచే సమయంలోను అలాగే మాట్లాడేటప్పుడు ఆయాసం రావటం, కాళ్ల వాపు లాంటి సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిపారు. అతనికి పలు వైద్య పరీక్షలు జరపగా గుండె నాళాలు దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. డిసెంబరు 18న నాగరాజుకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా గుండె రక్తనాళాలకు బైపాస్ సర్జరీతో పాటు ఎడమ వైపు కవాటం మార్పు, కుడివైపు కవాటంకు విజయవంతంగా ఆపరేషన్ చేసినట్లు తెలిపారు. నాగరాజు మంచి ఆరోగ్యంగా ఉన్నట్లు చెప్పారు. పూర్తిగా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఈ వైద్యసేవలు అందించామన్నారు. గత 8నెలల కాలంలో 220 మందికి గుండె ఆపరేషన్లు విజయవంతంగా చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లాకోఆర్డినేటర్ డాక్టర్ పి.హేమంత్‌కుమార్ అనస్తీయాలజి డాక్టర్ ఎం.రామకృష్ణ, సూపరింటెండెంట్ డాక్టర్ టి.శ్రీహరిరెడ్డి, కిమ్స్ చీఫ్ కోఆపరేటివ్ ప్రతినిధి అంకిరెడ్డి పాల్గొన్నారు.

నిబద్ధతగల నాయకుడు పున్నయ్యచౌదరి


నివాళులర్పిస్తున్న నాయకులు

మద్దిపాడు, జనవరి 10: మాజీ సమితి ప్రెసిడెంట్ మోపర్తి పున్నయ్యచౌదరి నీతికి, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనమని పెదకొత్తపల్లి సొసైటీ అధ్యక్షుడు గట్టినేని అయ్యన్న పేర్కొన్నారు. బుధవారం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో పున్నయ్యచౌదరి వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేవరశెట్టి యలమంద అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరి నాగేశ్వరరావు మాట్లడుతూ రాజకీయాలకు అతీతంగా పున్నయ్యచౌదరి మండల పరిషత్‌కు సేవలందించారని, నిబద్ధత గల రాజకీయ నాయకుడని కొనియాడారు. వైసీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు మాట్లాడుతూ పున్నయ్యచౌదరి విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో గంగిశెట్టి నరసింహారావు, గంటా కోటేశ్వరరావు, నాగరాజు, శివశంకర్‌రావు, వాకా కోటిరెడ్డి,, ఘడియపూడి సర్పంచ్ బొమ్మల రామాంజనేయులు, ఎండీ.అబ్దుల్‌మజీద్, మోరబోయిన సంజీవరావు, బెజవాడ శ్రీరామమూర్తి, మోపర్తి సందీప్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వెల్లంపల్లి సచివాలయంలో పున్నయ్యచౌదరి వర్ధంతి సందర్భంగా సర్పంచ్ చిట్టిబోయిన అనిల్, బీజేపీ మండల అధ్యక్షుడు సీహెచ్.వెంకటరమణ ఘనంగా నివాళులర్పించారు. ఎంపీటీసీ పైనం ప్రభాకర్, తేళ్ల పుల్లారావు, అభిమానులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం

మద్దిపాడు, జనవరి 10: క్రీడలు స్నేహభావానికి దోహదపడతాయని మండల ప్రత్యేకాధికారి వరకుమార్ తెలిపారు. బుధవారం గుండ్లాపల్లి హైస్కూల్‌లో ఆడుకుందాం ఆంధ్ర పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వరకుమార్ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆశాజ్యోతి, ఎంపీడీవో శ్రీనివాసరావు, హెచ్‌ఎం మండవ ప్రభాకరరావు, మద్దిపాడు వీఆర్వో వెంకటరమణారావు, కొప్పోలు అంకమ్మరావు, పల్లకి సత్యనారాయణరెడ్డి, గ్రామ కార్యదర్శి లతీఫ్ పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించాలి : ఎస్పీ

ఒంగోలు(క్రైం), జనవరి 10: రానున్న ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం సన్నద్ధం కావాలని ఎస్పీ మలికగర్గ్ పేర్కొన్నారు. బుధవారం ఒంగోలులోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల వివరాలను సేకరించాలని ఆదేశించారు. మద్యం, నగదు, ఇతర వస్తువులు ఎక్కువ మొత్తంలో తరలింపును అడ్డుకునేందుకు సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఎస్బీ డీఎస్పీ బి.మరియదాసు, ట్రాఫిక్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, జిల్లాలోని డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న మాజీ ఎమ్మెల్యే డేవిడ్‌రాజ్

ఒంగోలు(క్రైం), జనవరి10: జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యంఠాగూరు సమక్షంలో డేవిడ్‌రాజు ఆయన తనయుడు విజేష్‌రాజ్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ మెంబర్ రఘువీరారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ఏకేయూ విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన


జన సంస్థాన్ కార్యాలయాన్ని సందర్శించిన విద్యార్థులు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 10 : ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ వర్క్ విద్యార్థులు తమ క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా బుధవారం ఒంగోలు నగరం సత్యనారాయణపురంలోని జన శిక్షణ సంస్థాన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ శ్యాంసునీల్ జన శిక్షణ సంస్థ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు వెంకటరావు, శ్రీనివాస్, హర్షప్రీతమ్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డి.రాజేంద్రప్రసాద్, ఎం.హరికృష్ణరాజు, ఇన్‌స్పెక్టర్ ఎం.నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్ఎస్ కో ఆర్డినేటర్‌గా హర్షప్రీతమ్


నియామకపత్రం అందుకుంటున్న హర్షప్రీతమ్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 10: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్‌గా డాక్టర్ మండే హర్షప్రీతమ్ దేవ్‌కుమార్‌ను నియమితులయ్యారు. బుధవారం ఒంగోలులోని విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ ఎం.అంజిరెడ్డి చేతుల మీదుగా నియామక ఉత్తర్వులను అందుకున్నారు. గతంలో ఎన్ఎస్ఎస్ విభాగం లైజన్ ఆఫీసర్, జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా పనిచేసి ప్రస్తుతం ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ అసిస్టెంట్ కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. సోషల్ వర్క్ విభాగంలో సహాయక ఆచార్యునిగా ఒక వైపు బాధ్యతలు నిర్వహిస్తూ మరో వైపు విద్యార్థులను ఉత్తమ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడమే కాకుండా అనేక పదవులను నిర్వహించారు. హర్షప్రీతమ్ నియామకం పట్ల రిజిస్ట్రార్ బి.హరిబాబు, యూనివర్శిటీ ప్రిన్సిపాల్ జి.రాజమోహన్, వైస్ ప్రిన్సిపాల్ ఎన్.నిర్మలామణి, సహాయక ఆచార్యులు పి.వెంకటరావు, ఆర్.శ్రీనివాసులు, ఎన్.సురేష్ తదితరులు అభినందించారు.

ఉచిత వైద్య పరీక్షలు


వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

ఒంగోలు(విద్య), జనవరి 10: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలోని సిబ్బందికి కోనాక్ డయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని వంద మందికి పైగా సిబ్బందికి షుగర్, బీపీ, హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రతిరోజు వ్యాయామం చేసి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సిబ్బందికి సూచించారు కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ వీరాంజనేయులు, ఏవో రమణబాబు, కళాశాల హెల్త్ కమిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

19న విజయవాడలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

● ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 10 : విజయవాడలో ఈనెల 19వ తేదీన జరగనున్న డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహావిష్కరణలో జిల్లా నలుమూలల నుంచి ప్రజానీకం తరలిరావాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. ఒంగోలులోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి సుమారు రూ.400 కోట్లకు పైగా ఖర్చు చేసి విజయవాడలో 20 ఎకరాల విస్తీర్ణంలో అంబేద్కర్ విగ్రహంతో పాటు ఆడిటోరియం నిర్మించారన్నారు. దళిత నాయకులు చైర్మన్‌ను కలిసి పలు సమస్యలను వివరించారు.

రేపు పేస్‌లో ప్రాంగణ ఎంపికలు

ఒంగోలు(విద్య), జనవరి 10 : ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 12న లనార్స్ కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023-24 బ్యాచ్ బీటెక్ సివిల్, మెకానికల్ విభాగాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ ప్రాంగణ ఎంపికలకు హాజరుకావచ్చన్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూలకు జిల్లాలో ఏ ఇంజనీరింగ్ కళాశాలలో చదివిన విద్యార్థులైనా హాజరుకావచ్చని తెలిపారు. విద్యార్థులు రెజ్యూమ్, విద్యార్హతల సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలు, పాస్‌పోర్టుసైజు ఫొటోలు, ఆధార్ జెరాక్స్ కాపీలు తమ వెంట తీసుకొని రావాలని ప్లేస్‌మెంట్ డీన్ రూపఅన్వేష్ తెలిపారు. వివరాలకు 9966945242 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

ఒంగోలు(క్రైం), జనవరి 10: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మధ్యాహ్నం కరవది రైల్వేస్టేషన్‌లో జరిగింది. సుమారు 35 ఏళ్ళ యువకుడు ఒంగోలు వైపు వెళ్లే రైలు కింద పడి బలవన్మరణం చెందాడు. ఎరుపు, బిస్కెట్ కలర్ నిండు చేతుల టీషర్ట్, బులుగురంగు జీన్స్‌ప్యాంటు ధరించి ఉన్నాడు. సుమారు 5.5 అడుగులు ఎత్తు, చామన ఛాయ రంగులో ఉన్న యువకుడు గోధుమ రంగు బెల్టు చెప్పులు ధరించి ఉన్నట్లు రైల్వే ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440627646, 7013915467, 9949761057 సెల్‌నంబరులో తెలియజేయాలని ఆయన కోరారు.

మిరప పంటను ప్రతిరోజూ పరిశీలించాలి


మిరపపంటను పరిశీలిస్తున్న ప్రత్యూష

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), జనవరి10: సాగు చేసిన మిరపపంట రైతులు ప్రతిరోజు పరిశీలిస్తూ ఉండాలని ఉద్యానవనశాఖ అధికారి డి.ప్రత్యూష సూచించారు. మండలంలోని పోతవరం గ్రామంలో సాగు చేసిన మిరప పంటను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిరప పంటలో పూత రాలిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నిరాధార ఆరోపణలు చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

కొండపి, జనవరి 10 : తనతోపాటు వీఆర్వోపై నిరాధార ఆరోపణలు చేసిన కె.ఉప్పలపాడు గ్రామానికి చెందిన పాలవెల్లి సంజీవరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కొండపి తహసీల్దార్ పోపూరి శింగారావు బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కె.ఉప్పలపాడుకుచెందిన సర్వే నంబర్ 342/1లో 2.26 ఎకరాల పొలాన్ని పాలవెల్లి నరసింహారెడ్డి ఏకైక కుమారుడైన వేణుగోపాల్‌రెడ్డికి వారసత్వంగా వచ్చినట్లు వీఆర్వో ఇచ్చిన రిపోర్టు మేరకు తాను మ్యూటేషన్ చేశానని వివరించారు. అంతా రికార్డుల ప్రకారమే జరిగిందన్నారు. కానీ వీఆర్వోనే సంతకం పెట్టినట్లు చెప్తున్నప్పటికీ సంజీవరెడ్డి మాత్రం ఫోర్జరీ జరిగిందంటూ అటు వీఆర్వోపై, ఇటు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమను ఇబ్బందులకు గురిచేస్తున్న ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న 10 కుటుంబాలు

● ఎమ్మెల్యే స్వామి సమక్షంలో పార్టీలో చేరిక



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, జనవరి 10 : సింగరాయకొండ పంచాయతీ పరిధి డ్రైవర్ పేటకు చెందిన వైసీపీ నేత, వార్డు మాజీసభ్యుడు పల్లవరపు మోహన్‌రావు 10 కుటుంబాలతోసహా టీడీపీలో చేరారు. టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెంలోని ఎమ్మెల్యే స్వగృహంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే స్వామి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కూనపరెడ్డి సుబ్బారావు, మించల బ్రహ్మయ్య, నక్కా బ్రహ్మేశ్వరరావు, యస్దాని, కళ్లగుంట నరసింహ, అంకమరావు, రవిశంకర్‌రెడ్డి, జమ్ముశంకర్ పాల్గొన్నారు.

పక్వానికి వచ్చిన ఆకులను రెల్చాలి



పొగాకు తోటను పరిశీలిస్తున్నఅధికారులు

పొన్నలూరు (కొండపి), జనవరి 10 : పొగాకు తోటల్లో పక్వానికి వచ్చిన ఆకులను మాత్రమే రెల్చాలని బోర్డు ఒంగోలు ఆర్ఎం ఎం.లక్ష్మణరావు రైతుకు సూచించారు. పొన్నలూరు, సింగరబొట్ల పాలెం, ముప్పాళ్ల, వెల్లటూరు గ్రామాల్లో బుధవారం ఆయన రైతుమిత్ర బృందంలో కలిసి పర్యటించారు. పొగాకు తోటలను, బ్యారన్‌లలో క్యూరింగ్‌ను పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పొగాకు మండెలు దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కందుకూరు పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి చైన్‌రామ్‌మీనా, ఎస్‌జీవో సిద్ధరాజు, వివిధ కంపెనీల ప్రతినిధులు జి.వెంకటేష్, ఎ.రామాంజనేయులు, ఉన్నం శ్రీనివాస్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ ఉష, అధికారులు

సింగరాయకొండ, జనవరి 10 : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ ఉష సూచించారు. గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ నమోదైన పంచాయతీ పరిధి బుంగబావి సెంటర్‌లోని 257, 259 పోలింగ్ బూత్‌లలోని ఓటర్లతో బుధవారం ఆమె సమావేశమయ్యారు. ఓటు వినియోగంపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ తస్నీరు వెంకటేశ్వరరావు, ఏఎస్సై బేగ్, వార్డు సభ్యుడు రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



భోగిమంటను వెలిగిస్తున్న విద్యార్థినులు

మద్దిపాడు, జనవరి 10: ప్రతి వ్యక్తి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ ఉండాలని ప్రిన్సిపాల్ అడ్డాల అశోక్ పేర్కొన్నారు. గుండ్లాపల్లిలో గల భరత్‌స్కూల్‌లో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల తల్లులకు బహుమతులు ప్రదానం చేశారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

● సమస్యలను పరిష్కరించాలని డిమాండ్



నిరసన ర్యాలీని నిర్వహిస్తున్న కార్మికులు

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 10: ఏపీ మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం 16వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు ఒంగోలులోని నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నుంచి కార్మికులు అర్ధ నగ్నప్రదర్శనతోపాటు కార్పొరేషన్ వద్ద నుంచి ప్రకాశం భవనం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వం తమ గోడు ఆలకించడం లేదన్నారు. అబద్దాలతో హామీలు ఇచ్చి కార్మికులను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి ముఖ్యమంత్రిని గతంలో ఎన్నడూ చూడలేదని, వైసీపీ ప్రభుత్వం అంతా అబద్దపు హామీలు, ఆచరణ చేయలేని ప్రచారాలు చేస్తుందన్నారు. గత కొద్ది రోజులుగా అంగన్‌వాడీలు, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు, మునిసపల్ ఉద్యోగులు సమ్మెలు చేస్తుంటే ప్రజా ప్రతినిధులు గాని, ప్రభుత్వం కానీ తమపై కనికరం చూపడం లేదని మండిపడ్డారు. ఇలాంటి దౌర్భాగ్యపు ప్రభుత్వానికి త్వరలోనే గుణపాఠం చెబుతామన్నారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఆందోళన విరమించేది లేదని, పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తంబి శ్రీనివాసరావు, కొర్నెపాటి శ్రీనివాసరావు, గోపి, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, యు.కుమారి, కె.సామ్రాజ్యం, వెంకటేశ్వర్లు, కార్మికులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 10 : గణతంత్ర దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఈ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం పలు శాఖల అధికారులతో స్థానిక కలెక్టర్ సమావేశపు హాలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేడుకల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలన్నారు. అతిథులను ఆహ్వానించడంలో ప్రొటోకాల్ ఉల్లంఘించకూడదని స్పష్టం చేశారు. స్వాతంత్ర సమరయోధులను, వారి కుటుంబసభ్యులను ఈ కార్యక్రమాలను వీక్షించేందుకు ప్రత్యేకంగా ఆహ్వానించాలన్నారు. ఆయా శాఖలలో సాధించిన విజయాలను తెలియజేసేలా శకటాలను రూపొందించాలని ఆదేశించారు. పెరేడ్‌గ్రౌండ్‌లో ప్రదర్శన అనంతరం శకటాలు నగరంలో ప్రదర్శించేలా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలలో జిల్లాలోని దూర ప్రాంత విద్యార్థులు కూడా పాల్గొనేలా చూడాలని సూచించారు. అనంతరం అంశాల వారీగా సమీక్షించారు. కార్యక్రమంలో ఏఎస్పీ అశోక్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవిత చరిత్రను ప్రజలకు తెలియజేయాలి

ఒంగోలు(రూరల్): సామాజిక న్యాయం కోసం కృషి చేసిన డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సేవలను, ఆయన జీవితచరిత్రను ప్రజలందరికీ తెలియజేయాలని, ఇందుకోసం ఈనెల 9నుంచి 18వతేదీ వరకు ప్రచారం చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరెట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన అంబేడ్కర్ ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించి తిలకించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకేంద్రం, మండలాలు, గ్రామాల్లో అంబేడ్కర్ జీవితచరిత్రను పదిరోజుల పాటు ప్రచారం చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వసుంధర, డీపీవో నారాయణరెడ్డి, డీఈవో వీఎస్.సుబ్బారావు, సాంఘిక సంక్షేమాధికారి లక్ష్మానాయక్ పాల్గొన్నారు.

గుండ్లకమ్మ ప్రాజెక్టును సాగర్ నీటితో నింపాలి

● రైతు సంఘం నాయకుల వినతి



మాట్లాడుతున్న చీఫ్ ఇంజినీర్ మురళీనాథ్‌రెడ్డి

ఒంగోలు(రూరల్), జనవరి10: గుండ్లకమ్మ ప్రాజెక్టును సాగర్ నీటితో నింపాలని నాగార్జున సాగర్ చీఫ్ ఇంజినీర్ ఆర్.మురళీనాథ్‌రెడ్డిని రైతు సంఘం నాయకులు కోరారు. బుధవారం ఒంగోలులో ఆయనను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా నాయకుడు జుజ్జూరి జయంత్‌బాబు మాట్లాడుతూ గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు కొట్టుకుపోవటంతో నీరు పూర్తిగా సముద్రపాలైందని చెప్పారు. దీంతో ప్రాజెక్టు పూర్తిగా ఖాళీ అయ్యిందన్నారు. అయితే దీని పరిధిలోని ఆయకట్టులో రైతులు మిరప, పొగతోటలు, వరిపంట, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేశారని తెలిపారు. మిరప సాగుకు రైతులు ఇప్పటికి ప్రతి ఎకరానికి రూ.లక్షకు పైగా ఖర్చు చేశారని, ఇప్పుడు నీరు లేక దిక్కుతోచని దుస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ఆయా పంటలను కాపాడేందుకు సాగర్ నుంచి 2టీఎంసీ నీటిని గుండ్లకమ్మ ప్రాజెక్టులకు విడుదల చేయాలని కోరారు. అనంతరం చీఫ్ ఇంజనీర్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాకు 5టీఎంసీల సాగర్ నీరు వస్తుందని, అదనంగా నీటి విడుదల కోసం ఉన్నతాధికారులతో మాట్లాడి గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు నీరు విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పమిడి వెంకట్రావు, మాబు, వి.బాలకోటయ్య, టి.శ్రీకాంత్, మారెళ్ల వెంకట్రావు, చెన్నారెడ్డి శ్రీను, ఒమ్మెవరం సర్పంచ్ బాలకోటి, చుండూరి శ్రీరామూర్తి, చలమయ్య, మారెళ్ల అనిల్, కొమ్మాలపాటి సురేష్, కొమ్మాలపాటి శ్రీను పాల్గొన్నారు. కాగా నాగులుప్పలపాడు నుంచి ఒంగోలులోని నాగార్జునసాగర్ చీఫ్ ఇంజినీర్ కార్యాలయం వరకు బైక్‌లతో రైతు సంఘ నాయకులు ర్యాలీ నిర్వహించారు.

సగరపుత్రులచే శ్రీరామ అక్షతల పంపిణీ



అక్షతల కలశాన్ని తీసుకువస్తున్న భక్తులు

ఒంగోలు(కల్చరల్), జనవరి 10: ఒంగోలు నగరం కేశవస్వామిపేట ఉప్పరపాలెంలో శ్రీభగీరథ సగర పుత్రుల సంఘం ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరాముని అక్షతల పంపిణీ కార్యక్రమం జరిగింది. విశ్వహిందూ పరిషత్ ద్వారా వచ్చిన శ్రీరామ శిలా పూజిత అక్షతల కలశాలను శ్రీ భగీరథ విగ్రహం దగ్గర నుంచి రామనామ నినాదాలతో బయల్దేరి దాదాపు 2 వేల ఇళ్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్షతలతో పాటు శ్రీరాముని చిత్రపటం, కరపత్రాల పంపిణీ జరిగింది. ఈ నెల 22వరకు అక్షతలను ఇంటిలో భద్రపరిచి అనంతరం కుటుంబసభ్యులు తలపై వాటిని ధరించాలని సంఘ సభ్యులు కోరారు. కార్యక్రమంలో రెడ్డి పరమేశ్వరరావు, జూటూరి శ్రీనివాసరావు, కుంచాల నారాయణ, జమ్మిశెట్టి శ్రీనివాసులు, దుంపల వెంకటకృష్ణారావు, లంకపల్లి రాఘవేంద్రరావు, ధనిశెట్టి రామునాయుడు, రాధా రమణగుప్తా జంధ్యం పాల్గొన్నారు.

మహిళల రక్తదానం



రక్తదానం చేస్తున్న మహిళలు

ఒంగోలు(కల్చరల్), జనవరి 10: ఇన్నర్ వీల్ క్లబ్ ఒంగోలు సెంట్రల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పలువురు మహిళలు రక్తదానం చేశారు. స్థానిక కొత్త కూరగాయల మార్కెట్ దగ్గర ఉన్న రెడ్‌క్రాస్ భవన్‌లో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.ప్రకాష్‌బాబు ప్రారంభించారు. అనంతరం మహిళా క్లబ్ ప్రెసిడెంట్ ఓరుగంటి సీత మాట్లాడుతూ క్లబ్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రక్తదాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కారక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షురాలు గొర్రెపాటి సునీత, క్లబ్ సెక్రటరీ బత్తినేని అనూషా రాణి, రెడ్‌క్రాస్ మహిళా విభాగం ప్రెసిడెంట్ కోటేశ్వరమ్మ, కోసూరి శ్రీదేవి, రాజేంద్ర పాల్గొన్నారు.

పేస్ విద్యార్థిని ప్రతిభ



సుష్మాకిరణ్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

ఒంగోలు(విద్య), జనవరి 10 : నెహ్రూ యువకేంద్రం ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం వికసిత్ భారత్-2047 అనే అంశంపై జిల్లా స్థాయిలో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పేస్ ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన పి.సుష్మాకిరణ్ ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీకి ఎంపికయ్యారు. సుష్మాకిరణ్‌ను యువకేంద్ర యూత్ ఆఫీసర్ కమల్, కాలేజీ ప్రిన్సిపాల్ జీవీఏ.మూర్తి, న్యాయనిర్ణేతలు ప్రసాద్, మనోజ్‌లు అభినందించారు.

ఏపీటీఎఫ్ సీనియర్ నేత వీరయ్య మృతి

ఒంగోలు(విద్య), జనవరి 10 : ఏపీటీఎఫ్ సీనియర్ నాయకుడు, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఎన్.వీరయ్య ఒంగోలులో బుధవారం సాయంత్రం మరణించారు. స్నేహితుల ఇంటికి వెళ్ళి అక్కడ మాట్లాడుతూ హఠాత్తుగా కుప్పకూలి ప్రాణాలు వదిలారు. వీరయ్య అకాలమరణం పట్ల సంఘ నాయకులు సంతాపం ప్రకటించారు.

విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ వరుణ్‌మిత్ర

ఒంగోలు (కల్చరల్), జనవరి 10: జిల్లా విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సేవా సంఘం క్యాలెండర్‌ను ప్రముఖ వైద్యులు వరుణ్‌మిత్ర బుధవారం ఆవిష్కరించారు. సంఘ అధ్యక్షులు రావూరి లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఒంగోలులోని అమృతహార్ట్ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో వరుణ్‌మిత్ర మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు బండికట్ల వీరబ్రహ్మాచార్యులు, ప్రధానకార్యదర్శి నూతక్కి మల్లేశ్వరరావు, రంగు రంగ నాయకులు, వడ్లమాని వీరయ్య, హరినాథ్, డోలానందప్రసాద్ పాల్గొన్నారు.





గిద్దలూరులో సచివాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు... మార్కాపురంలో 30 అంకెలో కూర్చొని నిరసన... గిద్దలూరులో ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

30 రోజుల ఆందోళన

» కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

» సమస్యలు పరిష్కరించాలని అర్జీలు » వినూత్న నిరసనలు

గిద్దలూరు, జనవరి 10 : వైసీపీ ఎస్మా చట్టాన్ని ప్రయోగించినప్పటికీ అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతూనే ఉన్నది. ఎస్మా చట్టాన్ని ప్రయోగించి తొలగిస్తామని నోటీసులు ఇవ్వడం శోచనీయమని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు స్వర్ణ, మున్న అన్నారు. సమస్యలు పరిష్కరించకుండా అంగన్‌వాడీలను భయభ్రాంతులకు గురిచేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు విజయలక్ష్మి, మల్లీశ్వరి, కొండమ్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మద్దతు

గిద్దలూరు టౌన్ : గత కొన్ని రోజుల నుంచి న్యాయబద్ధంగా ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు మద్దతు ప్రకటిస్తున్నట్లు రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ పగడాల రంగస్వామి తెలిపారు. ఆ మేరకు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. రంగస్వామి మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా న్యాయబద్ధంగా ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మా వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ వారికి సంఘీభావం తెలుపుతూ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జానకి రంగనాయకులు, పోతంశెట్టి తిరుపాలయ్య, షేక్ జమాల్, శింగంశెట్టి నాగరాజు, నాగేశ్వరరావు, రమణ పాల్గొన్నారు.

కంభం : అంగన్‌వాడీల సమ్మె బుధవారంతో 30 రోజులు కావస్తున్నప్పటికీ ప్రభుత్వం మొండి వైఖరితో సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నదని, తక్షణమే పరిష్కరించాలని అంగన్‌వాడీలు ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందచేశారు. బేస్తవారపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు సమ్మె, నిరాహార దీక్షలను కందులాపురం సెంటర్‌లో డిసెంబరు 12 నుంచి దీక్షలు చేస్తున్నామని, జగనన్న మాట ఇచ్చావు, మాట తప్పావు, సమస్యలను పరిష్కరించాలని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం న్యాయమైన కోర్కెలు తీర్చాలంటూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ ఇబ్రహీం, సీపీఎం నాయకులు అన్వర్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు.

పెద్ద దోర్నాల : అంగన్‌వాడీలకు న్యాయం చేయాలని డీ సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద నెల రోజులుగా అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సమ్మె బుధవారం కొనసాగింది. ఈ క్రమంలో సీపీఎం డివిజన్ నాయకులు డీ సోమయ్య సంఘీభావం తెలియ జేస్తూ మాట్లాడారు. పెద్ద ఎత్తున న్యాయమైన సమస్యలు ఉద్యోగభద్రత కల్పించాలని, గ్రాట్యూటీ సౌకర్యం, వేతనాల పెంపు తదితర సమస్యల పరిష్కారం కోసం వీధుల్లో ఆందోళన చేస్తుంటే జగన్‌రెడ్డి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పైగా మహిళలపై ఎస్మా ప్రయోగించడం కిరాతక చర్యగా పేర్కొన్నారు. ఎన్నికల ముందు హామీలిచ్చిన జగన్‌రెడ్డి గద్దెనెక్కిన తర్వాత బెదిరింపులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా స్పందించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటలక్ష్మి, ముంతాజ్‌బేగం, వెంకటరత్నం, సుబ్బమ్మ, పద్మ, సుహాసిని, రాణి, కుమారి పాల్గొన్నారు.

30 అంకె ఆకారంలో నిరసన

మార్కాపురం వన్‌టౌన్ : సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురు చేస్తున్న సమ్మె, నిరసన దీక్షలు బుధవారం 30వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు 30 అంకె ఆకారంలో కూర్చొని నిరసన తెలిపారు. నెల రోజులైనా జగన్‌రెడ్డికి సమస్య పట్టకపోవడం అహంకారానికి నిదర్శనమని అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వైసీపీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు.

పొదిలి : ఎస్మాకు బెదిరేది లేదని అంగన్‌వాడీలు తేల్చిచెప్పారు. పాదయాత్రలో మాటిచ్చి నెరవేర్చడం చేతగాని జగన్‌రెడ్డి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై బెదిరింపులకు పాల్పడడం దారుణమన్నారు. బుధవారం ఎంపీడీవో ఆఫీస్ ఆవరణలో ఎస్మాను రద్దు చేసి, సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కొనసాగించారు.

ఎర్రగొండపాలెం : ఎస్మా ప్రయోగించి ఉద్యమాన్ని నీరుగార్చేందుకు వైసీపీ ప్రభుత్వం చూస్తోందని, డిమాండ్లు పరిష్కరించేవరకూ ఉద్యమం ఆపేది లేదని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. ధర్నా శిబిరం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దారు కార్యాలయం ఎదుట బుధవారం మానవహారం నిర్వహిం నిరసన తెలిపారు. 30 రోజులు కావడంతో 30 నెంబర్ అంకెలో కూర్చొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు షేక్ రఫీ, అమీర్, అంగన్‌వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ నాయకులు జీ మల్లేశ్వరి, పీ సుబాషిణి, నాగరాజకుమారి, రామసుబ్బమ్మ, అరుణ, సునీత, తలపాటి సుబ్బమ్మ, సుజాత, విజయలక్ష్మి, రూత్‌మేరి, రామకుమారి, తిరుపాలమ్మ, పాల్గొన్నారు. మూడు మండలాల నుంచి 250 మందికిపైగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

గిద్దలూరు : సమాన పనికి సమాన వేతనం ఇచ్చి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని 16 రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు బుధవారం ధర్నా చేశారు. సమ్మెను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు నాగయ్య, మురళి, రవి, బాలయ్య, సీఐటీయూ నాయకులు ఆవులయ్య ప్రసంగించారు.

పొదిలి : కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా జగన్‌రెడ్డి ఒంటెద్దుపోకడతో ముందుకెళ్లడం మంచిదికాదని కార్మిక సంఘాల నేతలు విమర్శించారు. పారిశుధ్య కార్మికులు లేకుంటే పట్టణాలు చెత్తమయమవుతాయని జగన్ చూడాలన్నారు. సమస్యలు పరిష్కరించాలని బుధవారం పంచాయతీ కార్యాలయం ముందు కార్మికులు చేపట్టిన నిరసనలో నేతలు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికుల భిక్షాటన

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 10: మున్సిపల్ కాంట్రాక్ట్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె 16వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు బుధవారం పురవీధులలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రూబెన్, సుబ్బరాయుడు, హరి, రమణ, నాసరయ్య, రషీద్, ఇమామ్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పొదిలి, జనవరి 10 : పొదిలి ఆర్టీసీ డిపో పరిధిలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ సుందరరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ప్రయాణికులు తమ సమస్యలను, విలువైన సలహాలను తెలియజేయాలని కోరారు. ఎలాంటి సమస్యలున్నా 9959225700 నెంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు, సమస్యలు తెలియజేయాలన్నారు.



బాబు ష్యూరిటీ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కందుల

బాబుతోనే రాష్ట్రానికీ, యువతకు భవిష్యత్

మాజీ ఎమ్మెల్యే కందుల

పొదిలి, జనవరి 10 : చంద్రబాబుతోనే ఆంధ్రాకు, యువతకు భవిష్యత్ అని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని పట్టణంలోని 10వ వార్డులో జరిగిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంబాగై, ప్రజలు సంతోషంతో ఉంటారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రజలు సహకరించాలన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలంతా సరిచూసుకోవాలని కందుల సూచించారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను విస్మరించిన జగన్‌రెడ్డిని పాతాళంలోకి నెట్టాలన్నారు. కరెంట్, ఆర్టీసీ, గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యవసరాల ధరలు పెంచనని చెప్పిన జగన్‌రెడ్డి చెత్తపై కూడా పన్ను వేసి పేదలను గుంజుతున్నారని అన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అంగన్‌వాడీలు రెడ్డెక్కితే పరిష్కరించకుండా ఎస్మాతో భయపెడుతున్నారని ధ్వజమెత్తారు. మాటిచ్చి.. మడమ తిప్పిన వారిని ఇంటికి పంపించాలని ప్రజలకు కందుల విజ్ఞప్తి చేశారు. వైసీపీ పాలకుల అవినీతిని ప్రశ్నించేవారిపై అక్రమ కేసులతో నిర్బంధిస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబును ప్రజాక్షేత్రంలో ఢీకొట్టలేని జగన్‌రెడ్డి అక్రమ కేసులతో వేధించారన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసి పథకాలపై అవగాహన కల్పించారు. తండ్రితో కుమారుడు విఘ్నేష్‌రెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మీగడ ఓబులరెడ్డి, పట్టణాధ్యక్షుడు ముల్లా ఖుద్దూస్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కాటూరి నారాయణబాబు, మాజీ సర్పంచ్‌లు డాక్టర్ స్వర్ణగీత, కాటూరి చినబాబు, రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి వరికుంట్ల అనిల్, జిల్లా కార్యదర్శి యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు రసూల్, మాజీ శివాలయం చైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, రాష్ట్ర తెలుగురైతు కార్యదర్శి ఆవులూరి యలమంద, లాయర్ ఎస్ఎం భాష, టీఎన్ఎస్ఎఫ్ గౌస్, మండల కార్యదర్శి కాటూరి శ్రీను, తెలుగు యువత నాయకులు పోపూరి నరేష్, టీడీపీ నాయకులు ముని శ్రీనివాసులు, గోగినేని వెంకట్రావు, మహమ్మద్ ఆలి, నాయకులు పాల్గొన్నారు.



కొండపేటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



ముస్లిం కుటుంబాలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న అశోక్‌రెడ్డి

జగన్ పాలనలో సంక్షోభంలో రాష్ట్రం

» మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

» టీడీపీ, జనసేన ప్రభుత్వాన్ని గెలిపించాలని పిలుపు

గిద్దలూరు టౌన్, జనవరి 10 : జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో సంక్షోభం నెలకొన్నదని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. బుధవారం నగర పంచాయతీ పరిధిలోని కొండపేట గ్రామంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ అశోక్‌రెడ్డి వెళ్లి టీడీపీ, జనసేనల ఉమ్మడి మేనిఫెస్టోలో అంశాలను ప్రజలకు వివరించారు. మహిళలు స్వాగతం పలికారు. అనంతరం అశోక్‌రెడ్డి మాట్లాడుతూ నాడు తెలుగుదేశం హయాంలో చంద్రబాబు సంక్షేమాన్ని అందిస్తే నేడు జగన్ రెడ్డి సంక్షోభ ఆంధ్రగా మార్చారన్నారు. టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రజలంతా వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మద్దతుగా నిలవాలని ప్రజలకు అశోక్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు సయ్యద్ షహన్షావలి, మాజీ కౌన్సిలర్ మండ్ల శ్రీనివాసులు, ఎ. వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు పాముల వెంకటరమణయాదవ్, మహబూబ్‌భాషా, న డిపి లింగయ్య, ఆటో శ్రీను, పెద్దలింగయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిన మైనారిటీ కుటుంబాలు

తెలుగుదేశం పార్టీ హయాంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ముస్లిం మైనారిటీలకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమల చేస్తే వైసీపీ వచ్చాక ముస్లింలను విస్మరించిందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కంభం పట్టణానికి చెందిన షేక్ అల్లాబకాస్ ఆధ్వర్యంలో కోనేటివీధికి చెందిన అనేక మంది ముస్లిం కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి అశోక్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీ పటిష్టతకు అందరూ కృషి చేస్తామని, వచ్చే ఎన్నికల్లో అశోక్‌రెడ్డి విజయానికి శ్రమిస్తామని అల్లాబకాస్ అన్నారు. పార్టీలో చేరిన వారిలో షేక్ రసూల్, షేక్ అబ్దుల్‌రెహమాన్, షేక్ అబ్దుల్‌కలామ్, షేక్ బాషా, షేక్ గఫార్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కంభం మండల పార్టీ అధ్యక్షులు తోట శ్రీను, ప్రధాన కార్యదర్శి ఆరేపల్లి మల్లికార్జున, షేక్ జిలాని, షేక్ అబ్దుల్‌ఫజిల్ పాల్గొన్నారు.

పేకాట, కోడి పందాలు ఆడితే చర్యలు

మార్కాపురం రూరల్ జనవరి 10 : సంక్రాంతి పండుగ సందర్భంగా ఎవరైనా, ఎక్కడైనా కోడి పందాలు, పేకాట ఆడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు బుధవారం ప్రకటనలో హెచ్చరించారు. సంక్రాంతి పండుగను ప్రజలు సంప్రదాయాలతో సరదాగా గడుపుకోవాలని ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదని అన్నారు. అక్రమంగా మద్యంను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మఫ్టీలో ప్రజల మధ్య పోలీసుల నిఘా ఉంటుందని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, పేకాట, కోడిపంచాలు ఆడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు చెప్పండి : ఎరిక్షన్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జనవరి 10 : వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజల సంక్షేమ కోసం టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి చైతన్యం చేయాలని క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలను టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు సూచించారు. ఎర్రగొండపాలెం టీడీపీ కార్యాలయంలో బుధవారం క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. గ్రామ, వార్డు నాయకులు టీంలుగా ఏర్పడి టీడీపీ మేనిఫెస్టోలోని ఆరు గ్యారెంటీ పథకాలను, వాటి ప్రయోజనాలను ప్రజలకు ముఖ్యంగా మహిళలకు చెప్పాలన్నారు. ఓటర్ల జాబితాను పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. టీడీపీ విజయానికి అందరూ కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టీడీపీ అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, మండల నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, కంచర్ల సత్యనారాయణగౌడ్, తోట మహేష్, షేక్ మస్తాన్ వలి, కొత్తమాస్ సుబ్రమణ్యం, పాలడుగు వెంకటకోటయ్య నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, షేక్ రఫీ, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడాలి

మార్కాపురం వన్‌టౌన్ : వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంత లక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని 13వ వార్డులో భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి టీడీపీ పథకాలను ప్రజలకు వివరించారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం తదితర పథకాలపై అవగాహన కల్పించారు. చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమమని ప్రజలు గుర్తెరిగి టీడీపీకి పట్టం కట్టాలని వసంతలక్ష్మి విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని సాగనంపాలని కోరారు.



ప్రచారం నిర్వహిస్తున్న కందుల వసంతలక్ష్మి

సోమేపల్లిలో ఓటర్లకు అవగాహన

త్రిపురాంతకం, జనవరి 10: సార్వత్రిక ఎన్నికలలో ఓటు హక్కు, ఓటు ప్రాధాన్యత, ఈవీఎంల వినియోగం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని తహసీల్దారు వి.కిరణ్ ఆధ్వర్యంలో మండలంలోని సోమేపల్లిలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఓటు ఎలా వేయాలో ఓటర్లకు వివరించారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేశారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ గురవయ్య రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



భూముల రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

పాఠశాల భూముల పరిశీలన

మార్కాపురం రూరల్ జనవరి 10: మండలంలోని పెద్ద యాచవరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి 61వ సర్వే నెంబరులో గల ఐదు ఎకరాల యాభై మూడు సెంట్లు ప్రభుత్వ భూమిని సబ్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి కేటాయించిన భూమికి సమీపంలో ఉన్న రైతులు తమ భూములకు వెళ్లేందుకు దారి మార్గం ఆ స్థలంలో నుంచి అనుమతి ఇప్పించాలని కోరారు. స్పందించిన సబ్ కలెక్టర్ మీనా సంబంధిత అధికారులకు సమస్యను పరిష్కరించేందుకు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే పట్టణ ఇలాకాలో దళితుల భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమిస్తున్నారన్న ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలో ఆ భూమిని కూడా పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజునాథరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, వీఆర్‌వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి

మార్కాపురం రూరల్ జనవరి 10: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని యువత క్రీడల్లోనూ రాణించాలని సబ్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. పట్టణంలోని ఎస్‌వీకేపీ కళాశాల మైదానంలో బుధవారం ప్రారంభమైన మండల స్థాయి క్రికెట్ పోటీల ప్రారంభ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజునాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, క్రికెట్ నోడల్ ఆఫీసర్ రాములు నాయక్, అధికారులు పాల్గొన్నారు.

గిద్దలూరు : గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని పలువురు పేర్కొన్నారు. పట్టణ శివార్లలోని ఆదర్శ బీఈడీ కళాశాల ఆవరణలో ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య పోటీలను ప్రారంభించగా క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి.కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆర్డీ రామకృష్ణ, కమిషనర్ రామకృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాలీబాల్, చెస్ విభాగాలలో ప్రథమ స్థానం

గిద్దలూరు, జనవరి 10 : నాగార్జున టైగర్ ప్రాజెక్టు పరిధిలోని గిద్దలూరు, నంద్యాల, మార్కాపురం, ఆత్మకూరు అటవీ డివిజన్లలో పని చేస్తున్న అటవీ ఉద్యోగులకు నంద్యాలలో ఆటల పోటీలు నిర్వహించారు. గిద్దలూరు అటవీశాఖకు చెందిన ఉద్యోగులు వాలీబాల్, చెస్ విభాగాలలో ప్రథమ స్థానం సాధించగా ప్రాజెక్టు డైరెక్టర్ నరసింహారావు అభినందించారు.

పలువురికి వైద్య పరీక్షలు

గిద్దలూరు, జనవరి 10 : పట్టణంలోని గణేష్‌నగర్‌లో గల సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద రోగులను పరీక్షించారు. మున్సిపల్ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, వైస్ చైర్మన్లు ఆర్డీ రామకృష్ణ, కె.దీపిక, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వైద్యాధికారులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో జరిగిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ పద్మజ పరిశీలించారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుమయ, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ భార్గవ రంగారెడ్డి, డాక్టర్ మహబూబ్ షరీఫ్ రోగులను పరీక్షించారు.

మండల పాస్టర్ల సంఘం ఎన్నిక

పెద్ద దోర్నాల, జనవరి 10: మండల క్రిస్టియన్ పాస్టర్ అండ్ ఇవాంజలిస్టు వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీ బుధవారం ఎన్నికయింది. మండలంలోని రామచంద్రకోట గ్రామం క్రీస్తు సంఘం ఆవరణలో డీపీ ఏసయ్య, యోహాన్, యాకోబ్ ఆధ్వర్యంలో ఎన్నికయిన సంఘం అధ్యక్షుడుగా ప్రభుదాస్, గౌరవాధ్యక్షుడిగా డేవిడ్, ఉపాధ్యక్షుడిగా దేవయ్య, కార్యదర్శి డీ సుధీర్‌బాబు, ఉప కార్యదర్శి అబ్రహం నాయక్, కోశాధికారి శాంతవర్ధన్ తదితరులు ఎన్నికయినట్లు కమిటీ తెలిపింది.

రైలు ప్రమాదంలో పారిశుధ్య కార్మికుడు మృతి

గిద్దలూరు టౌన్, జనవరి 10 : పట్టణ సమీపంలోని రైలు గేటు వద్ద మున్సిపల్ ఆఫీసులో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుడు మృతి చెందిన సంఘటన జరిగింది. అందిన సమాచారం మేరకు పట్టణంలోని ఏబీఎంపాలెంకు చెందిన పందీటి రమేష్ (32) మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికునిగా పని చేస్తున్నాడు. పట్టణ సమీపంలోని జగనన్న కాలనీ ఎదురుగా రైల్వే ట్రాక్‌పై మృతి చెంది ఉన్నాడు. ప్రమాద వశాత్తు రైలు కింద పడి చనిపోయాడా లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయంపై రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదం తెల్లవారుజామున రైలు ఢీకుని మృతి చెందినట్లుగా గుర్తించారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

తర్లుపాడు, జనవరి 10: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని సీతానాగులవరం పొలిమేర వద్ద జరిగింది. ఈ ఘటనలో గన్నారపు శ్రీనివాసరావు(48) అక్కడికక్కడే మృతి చెందారు. కంభం మండలం తురిమెల్ల గ్రామానికి చెందిన శ్రీనివాసులు మార్కాపురం నుంచి ద్విచక్ర వాహనంపై తురిమెళ్ల వెళ్తుండగా సీతానాగులవరం చప్టా వద్ద తర్లుపాడు నుంచి మార్కాపురం వెళ్తున్న వాహనం ఢీకొట్టి వెళ్లింది. ప్రమాదంలో శ్రీనివాసరావు మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఘటనా స్థలాన్ని ఏఎస్ఐ రామకృష్ణారెడ్డి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఢీకొట్టిన వాహనం పరారుకావడంతో సీసీ కెమెరాల ద్వారా గాలిస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

టిప్పర్, కారు ఢీ.. నలుగురికి గాయాలు

చీమకుర్తి, జనవరి 10 : చీమకుర్తి ఔటర్ బైపాస్ రహదారిపై బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మార్కాపురానికి చెందిన నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. మార్కాపురంనకు చెందిన గుమ్మడి శ్రీనివాసరెడ్డి, నాసర్‌రెడ్డి, మంగమూరి శ్రీనివాసులు, గోపాలరెడ్డిలు తుఫాన్ వాహనంలో ఒంగోలుకు వచ్చి తమ పనులు ముగించుకున్న తదుపరి తిరిగి బయలుదేరారు. చీమకుర్తి ఔటర్ బైపాస్ పెట్రోల్‌బంక్ సమీపంలో ముందు వాహనాన్ని క్రాస్ చేసే సమయంలో ప్రమాదవశాత్తు ఎదురుగా వస్తున్న గ్రానైట్ రాళ్లతో రామాయపట్నం వెళ్తున్న టిప్పర్‌ను ఢీకొనటం జరిగింది. ఈ సంఘటనలో వాహనంలో ఉన్న నలుగురికి గాయాలు కాగా వారిని చీమకుర్తి సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్సను అందించారు. అనంతరం క్షతగాత్రులకు మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని సందర్శించిన పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

44 మందికి జరిమానా

గిద్దలూరు, జనవరి 10 : మండలంలోని ముండ్లపాడు సెక్షన్ పరిధిలో అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 44 మందిపై విజిలెన్స్ అధికారులు కేసులు నమోదు చేశారు. వీరికి రూ.2.61లక్షల జరిమానాను విధించారు. విద్యుత్ విజిలెన్స్ డీఈ శ్రీనివాసులు, ఏఈ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 70 మంది అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించారు. అనధికారికంగా విద్యుత్ వాడుతున్న, అనుమతికి మించి ఎక్కువ లోడు విద్యుత్ వాడుతున్న వినియోగదారులపై కేసులు నమోదు చేసి జరిమానా విధించారు.

పొదిలి : అక్రమ విద్యుత్ వినియోగిస్తే చర్యలు తప్పవని ఈఈ ఎస్డీ అబ్దుల్ కరీం అన్నారు. బుధవారం పట్టణంలో విజిలెన్స్ ఈఈ తోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో మొత్తం 3621 గృహ వినియోగ సర్వీసులు, 113 వాణిజ్య సర్వీసులపై తనిఖీలు నిర్వహించామన్నారు. 33 సర్వీసుల్లో అధికలోడు వినియోగిస్తున్నట్లు గుర్తించి రూ.లక్షా77వేలు జరిమానా విధించామన్నారు. మరో 9 సర్వీసులు అక్రమంగా వాడుతున్నట్లు గుర్తించి రూ.లక్ష జరిమానా విధించినట్లు తెలిపారు. తనిఖీల్లో పొదిలి డీఈ శ్రీనివాసరెడ్డి, దర్శి డివిజన్ డీఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి తిరుమలనాయుడు

గిద్దలూరు టౌన్, జనవరి 10 : బీఆర్ఎస్ పార్టీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న నారు తిరుమలనాయుడు ఆపార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, ఏపీ స్టేట్ ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ సమక్షంలో ఆయన చేరగా కండువా కప్పి ఆహ్వానించారు.

విరాట్‌నగర్ దేవస్థానం హుండీలో నగదు చోరీ

సీసీ కెమెరాలు ధ్వంసం

దొంగలు దాదాపు రూ.30వేలను ఎత్తుకెళ్లి ఉంటారని సమాచారం


హుండీ తాళాన్ని పగులకొట్టిన దొంగలు

పామూరు, జనవరి 10 : స్థానిక విరాట్ నగర్‌కాలనీలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం లో మంగళ వారం రాత్రి దొంగలు పడ్డారు. గుర్తుతెలి యని దుండగులు దేవస్థానం గేటు తాళా లను తీసి హుండి తాళాలను పగలకొట్టి సుమారు రూ.10 వేల నగదును దోచుకె ళ్లారు. అదేవిధంగా దేవస్థానంలో గల సీసీ కెమెరాల పరికరాలను ధ్వంసం చేశారు. వాటి విలువ రూ. 20 వేల వరకు ఉంటుందని దేవస్థాన కమిటీ చైర్మన్ ఎం దొరసానయ్యాచారి తెలిపారు. దీనికి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

13న ఉగ్ర యూత్ ఆధ్వర్యంలో మెగా క్రికెట్ పోటీలు

పామూరు, జనవరి 10 : సంక్రాంతి పండుగ సందర్భంగా డాక్టర్ ఉగ్రన్న యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ శాసనసభ్యులు, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ప్రారంభి స్తారని పేర్కొన్నారు. విజేతలకు కేఆర్‌కే ఫౌండేషన్ అధినేత టీడీపీ నాయ కులు కోటపాటి జనార్ధనరావు ఆర్థిక సహకారంతో రూ.30,116, ద్వితీయ బహు మతి టీడీపీ నాయకులు, పారిశ్రామికవేత్త యారవ శ్రీనుచే రూ.20,116, తృతీయ బహుమతి రియల్టర్ దారపనేని సుబ్బారావుచే రూ.10,116, టీడీపీ ఒంగోలు పార్లమెంట్ మైనార్టీసెల్ కార్యదర్శి ఆర్‌ఆర్‌రఫి చే మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్, షీల్డ్ బహూకరణ, మ్యాన్‌ఆఫ్‌ది సిరీస్‌ను టీడీపీ నాయకులు చినహ జరత్, మంచినీటి దాత ఐటీడీపీ కోఆర్డినేటర్ షేక్ ఫత్తుమస్తాన్‌లు అందజేస్తా రని వివరించారు. క్రీడకారులు ఈ నెల 12వ తేదీలోపు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి టీంపేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. 8333095978, 8897205686 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

పక్కా గృహాలు త్వరితగతిన పూర్తి చేస్తే బిల్లులు

ముండ్లమూరు, జనవరి 10 : పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులు ఈ నెలాఖరులోపు పూర్తి చేసుకుంటే వెంటనే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తా మని హౌసింగ్ పీడీ పేరయ్య చెప్పారు. ఆయన బుధవారం మండలంలోని పూరిమెట్లలో ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాలు నిర్మించిన లబ్ధిదా రుల ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ది దారులతో మాట్లా డుతూ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే లోపే పక్కా గృహాలు నిర్మించుకున్నట్ల యితే వారికి పూర్తిస్థాయిలో బిల్లులు జమ చేస్తామని చెప్పారు. అనంతరం గ్రామసభ నిర్వహించారు. ఆ తర్వాత ముండ్లమూరులోని హౌసింగ్ కార్యాల యంలో సిబ్బందితో సమావేశం అయ్యారు. ఈ కార్యక్రమంలో ఈఈ ప్రసాదు, డీఈ నిరీక్షణరావు, ఏఈ హనుమంతరావు, సర్పంచ్ ఓగులూరి రామాంజీ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి విగ్రహ బంగారు తొడుగుకు విరాళం

పామూరు, జనవరి 10 : స్థానిక అయ్యప్పస్వామి దేవస్థానంలోని మూలవి రాట్‌కు బంగారు తొడుగు అవసరమైన విరాళాన్ని మండలంలోని చిలంకూరు గ్రామానికి చెందిన మిరియం రామారావు, మిరియం పరమేశ్వరరావులు గురు వారం అందజేశారు. రామారావు 2 గ్రాముల బంగారం, పరమేశ్వరరావు ఒక గ్రామం బంగారానికి సరిపడా నగదును దేవస్థాన కమిటీ అధ్యక్షుడు కావిటి సుబ్బయ్య, గుత్తి రాజలకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కంబాలరోశయ్య, రాచూరి సురేష్ పాల్గొన్నారు.

పామూరు కాలేజీలో ముగ్గుల పోటీలు

పామూరు, జనవరి 10 : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం కళాశాల ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ, హైస్కూల్ విద్యార్థులు రంగురంగుల ముగ్గులు వేశారు. ఈ ముగ్గులను ప్రిన్సిపాల్ సురేష్ పరిశీలించారు. విజేతలకు ఈ నెల 26వ తేదీన బహుమతులు అందజేస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, గుత్తి రమణయ్య రవికాంత్, కృష్ణారెడ్డి, ఇసాక్, ప్రభాకర్, రాధిక, హసన్, బ్రహ్మయ్య, నాగభూషణం పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన ఎల్లమ్మతల్లి కొలుపులు

పామూరు, జనవరి 10 : మండలంలోని వీరభద్రాపురంలోని శ్రీఎల్లమ్మతల్లి ఆవు దేవర దేవస్థానంలో 5 రోజుల నుంచి అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగు తున్న కొలుపులు బుధవారం ఘనంగా ముగిశాయి. భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి ముడుపులు చెల్లించుకొన్నారు. ఈ సందర్భంగా 5 రోజుల పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించినట్లు దేవస్థాన నిర్వాహకులు తెలి పారు. కొలుపుల కార్యక్రమాలకు పెద్దలుగా వ్యవహరించిన పూనాటి పెదపు ల్లయ్య, చినపుల్లయ్య దంపతులు, సమయ సహకారాలు అందించిన సింగిల్ విండో అధ్యక్షుడు పువ్వాడి వెంకటసుజాత, మండల మాజీ వైస్‌ఎంపీపీ పువ్వాడి రాంబాబు, వంకాయలపాటి అనంతరావు, పూనాటి ప్రభాకర్, మహా నంద, ఆదినారాయణ, బాలకృష్ణ, లక్ష్మీనారాయణ, రమేష్, నగేష్, జె గోవిం దయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఇరుముడి కార్యక్రమం

దొనకొండ, జనవరి 10 : స్థానిక నాలుగురోడ్ల కూడలిలోని శ్రీ విజయాం జనేయస్వామి దేవాలయంలో అయ్యప్ప మాలధారణ స్వాముల ఇరుము డి మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన దాదాపు 26 మంది మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప భజనలతో విజయాంజనేయస్వామి దేవాలయం పరిసర ప్రాంతం మార్మోగింది. ఆలయ ధర్మకర్త సిరిగిరెడ్డి బాలిరెడ్డి అయ్యప్పలకు, భక్తులకు అన్నీ సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

అట్టహాసంగా జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు

దర్శి, జనవరి 10 : బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు, వైసీపీ ఆధ్వర్యంలో దర్శిలో బుధవారం జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఆరంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే డాక్ట ర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఈ పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్ర మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగ నాగా ర్జునలు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొని పోటీలను ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, మాజీ ఎంపీ పీలు వీరగంధం కోటయ్య, ఇత్తడి దేవదానం, వీ మధుసూదన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు కేవీ రెడ్డి, వీ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయి

పీసీపల్లి, జనవరి 10 : క్రీడలు శరీర ధారుడ్యంతోపాటు మానసిక ఉల్లా సాన్ని పెంపొందిస్తాయని ఆర్డీవో జాన్‌ఇర్విన్ చెప్పారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పీసీపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన మండలస్థాయి క్రీడా పోటీలను అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. మండలస్థాయి క్రీడలు ఈనెల 20వ తేదీ వరకు నిర్వహిస్తామని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. తొలిరోజు కబడ్డీ, క్రికెట్ తదితర పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహ సీల్దార్ ప్రవీణ్‌కుమార్, డీటీ శ్రీనివాసులు, ఎంఈవోలు సంజీవి, ఆర్.శ్రీని వాసులు, పీటీలు ఉన్నారు.

పామూరులో...

పామూరు, జనవరి 10 : ప్రతిరోజూ క్రమం తప్పకుండా క్రీడలు ఆడటం ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎంపీపీ గంగ సాని లక్ష్మీ చెప్పారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా క్రీడాకారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మండలం లోని మార్కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయిలో కంభాలదిన్నె, బొట్లగూడూరు, బోడవాడ, బలిజపాలెం, తూర్పుకట్టకిందపల్లి, లక్ష్మీనరసాపురం, గ్రామ సచివాలయ పరిధిలో ఉత్తమ టీంగా ఎంపిక చేసిన వారితో క్రికెట్, కోకో, కబాడి, వాలీబాల్, క్రీడల పోటీలు నిర్వహించారు. పామూరు ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింట న్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సీహెచ్ సుబ్బయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్ చాంద్‌బాషా, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోఆర్డీ కేఎల్ శ్రీనివాస రావు, ఎంఈవో అరుణకుమారి పాల్గొన్నారు.

ముండ్లమూరులో...

ముండ్లమూరు, జనవరి 10 : క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికిగా ఎంతగానో దోహదపడతాయని ఎంపీడీవో బీ శంకరరావు చెప్పారు. బుధ వారం ముండ్లమూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి ఆటల పోటీలు జరి గాయి. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర బ్రహ్మా నందరెడ్డి, ఎంఈవోలు సుబ్బారావు, వెంకటేశ్వర్లు, పీడీ భావన్నారాయణ, హెచ్‌ఎం మాధవీలత, ఈవోఆర్‌డీ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శులు, సచి వాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో వైసీపీ విఫలం

చెవిలో పూలు పెట్టుకుని వినూత్న నిరసన చేపట్టిన అంగన్వాడీలు


చెవిలో పూలు పెట్టుకుని వినూత్న నిరసన చేస్తున్న అంగన్వాడీలు

కనిగిరి, జనవరి 10 : ఇచ్చిన హామీలను అమలు చేయటంలో సీఎం జగన్‌రెడ్డి పూర్తిగా వైఫల్యం చెందారని సీఐటీయూ జిల్లా ఉపాధ్య క్షుడు పీసీ కేశవరావు చెప్పారు. స్థానిక ఐసీడీ ఎస్ కార్యాలయం ఎదుట బుధవారం అంగన్వా డీలు చెవిలో పూలు పెట్టుకుని ప్రభుత్వ వైఖరిపై వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేశ వరావు మాట్లాడుతూ అంగన్వాడీలపై ఇంత కక్ష పూరితంగా వ్యవహరిస్తున్న సీఎం జగన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో పుట్టగ తులుండవని హెచ్చరించారు. జగన్‌కు ఓటమి బాట పట్టారన్నారు. ఇప్పటికైనా అంగన్వాడీల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరిస్తే బాగుంటుం దని, లేకపోతే నిరవధిక దీక్షలు, చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజ్యలక్ష్మీ, రాజేశ్వరి, రామసుబ్బులు, సుజాత, రజని, సీత, భాగ్యలక్ష్మీ, డీవైఎఫ్‌ఐ, ఐద్వా సంఘాల నాయ కులు పాల్గొన్నారు.

ఒంటి కాలిపై నిరసన


ఒంటికాలిపై నిల్చుని నిరసన తెలుపుతున్న కార్యకర్తలు

దర్శి, జనవరి 10 : డిమాండ్ల సాధన కోసం చేస్తున్న ఆందోళనలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు బుధవారం ఒంటికాలిపై నిల్చుని నిర సన తెలిపారు. తొలుత స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం మహిళలు ఒంటి కాలిపై నిల్చుని వైసీపీ ప్రభు త్వంపై తమ అసంతృప్తిని తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు తిరుపతమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం బెదిరింపులకు భయపడే ప్రసక్తి లేదని, వేతనాలు పెంచే వరకు ఆందోళనలు కొనసాగు తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు సుజాత, బాలమ్మ, నాగమణి, నాగజ్యోతి, చైతన్య, భారతి, ప్రశాంతి, మేరి కుమారి, మల్లేశ్వరీ, సీఐటీయూ నాయకులు సందు వెంకటేశ్వరరావు, టీ రంగారావు, ఈ నాగేశ్వరరావు, ఏడుకొండలు పాల్గొన్నారు.

డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలి

దర్శి, జనవరి 10 : డిమాండ్ల సాధనలో భాగంగా పారిశుధ్య కార్మికులు బుధవారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఏడో రోజు ధర్నాను కొనసా గించారు. కార్మికులు చేస్తున్న ఆందోళన శిబిరం వద్దకు వచ్చి జనసేన పార్టీ జిల్లా నాయకులు ఇర్షాద్, వరికూటి నాగరాజు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఏఐటీయూసీ నాయకులు కే జీవరత్నం, హనుమంతరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్ కరుణానిధి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఇత్తడి ఇర్మియా, ప్రభాకర్, పుల్లయ్య, మరియమ్మ, సారమ్మ పాల్గొన్నారు.

పొర్లు దండాలతో మున్సిపల్ కార్మికులు నిరసన

కనిగిరి, జనవరి 10 : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కనిగిరిలో మున్సిపల్ కార్మికులు రోడ్లపై పొర్లు దండాల పెడుతూ వినూత్న నిరసన చేపట్టారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్‌కే ఖాదర్‌వలి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సీఎం జగన్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 10వ పీఆర్‌సీ ప్రకారం రూ.20వేల వేతనంతో పాటు విధి నిర్వహణలో మృతి చెందిన కార్మి కుల కుటుంబాలకు రూ.10లక్షలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయ కులు చార్లెస్, వీ మార్క్, గరటయ్య, దస్తగిరి, రమణమ్మ పాల్గొన్నారు.


కనిగిరిలో పొర్లుదండాలు పెడుతున్న నగర పంచాయతీ కార్మికులు

నిరుద్యోగులను నిండా ముంచిన జగన్

మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించాలి

యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వరరెడ్డి

కనిగిరి, జనవరి 10 : సీఎం జగన్‌రెడ్డి నిరుద్యోగులను నిండా మోసం చేశాడని యూటీఎఫ్ రాష్ట్ర మీగడ వెంకటేశ్వరరెడ్డి విమర్శించారు. డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీని విడుదల చేయాలని కోరుతూ బుధవారం కనిగి రిలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధి కారంలోకి రాకముందు జగన్ మెగా డీఎస్సీని నిర్వహిస్తామని, ఏటా జాబ్ క్యాలెండర్ విడు దల చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీ లను మరిచిపోయాడని విమర్శించారు. జగన్‌రెడ్డి ని నమ్మిన నిరుద్యోగులు ఓట్లేసి పట్టం కడితే గద్దెనెక్కాక ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి వారి ఆశలపై నీళ్లు చల్లా డని చెప్పారు. ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే డీఎస్సీ నిర్వహించక పోతే రాష్ట్ర ప్రభుత్వానికి నిరుద్యోగులు గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. అనంతరం ఆర్డీవో జాన్‌ఇర్విన్‌కు వినతిపత్రం అందజేశారు. 'డీవైఎఫ్‌ఐ నాయకులు నరేంద్ర, శ్రీను, నారాయణ, వలి, శివ, రమణయ్య, బాలకాశయ్య డీఎస్సీ అభ్యర్థులు రవి, కళ్యాణ్, రఫీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వరరెడ్డి

టీడీపీ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలి

వైసీపీని వీడిన దాసరిపల్లికి చెందిన 10 కుటుంబాలు

టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిక


పార్టీలో చేరిన వారికి కండువా వేసి ఆహ్వానిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జనవరి 10 : టీడీపీ కార్యక్రమా లను ప్రజల్లోకి విస్తృ తంగా తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహా రెడ్డి చెప్పారు. స్థానిక తెలుగుమహిళాశక్తి కార్యాలయంలో బుధ వారం హెచ్‌ఎంపాడు మండలంలోని దాసరి పల్లికి చెందిన 10కుటుంబాల వారు మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, రెడ్డెం తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంపాడు మండల నాయకులు గాయం రామి రెడ్డి, మురహరి నరసయ్య, కాటేపల్లి చినావులయ్యతో పాటు పార్టీలో చేరిన అంబటి అనీల్‌కుమార్, అంబటి ఆంజనేయులు, మోరబోయిన చిన్నశేఖర్, ఉస్తేల, రోశయ్య, ఉస్తేల గురు నారాయణ, మోరబోయిన పెద్ద శేఖర్, సన్నెపోగు రాజేష్, చిరుగూరి రోశయ్య తది తరులు పాల్గొన్నారు.

పామూరు హజరత్‌కు ప్రత్యేక జండా అందజేత

పామూరు, జనవరి 10 : మన టీడీపీ యాప్‌ను యాక్టివ్‌గా వినియోగిస్తూ పార్టీకి సంబంధించిన సమాచారాన్ని, రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలను, ప్రజలకు చేరువయ్యేలా చేస్తున్న పామూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా, బూత్ కమిటి ఇన్‌చార్జులు, షేక్ చినహజరత్, చలపతి,ఎం దొర బాబులకు రాష్ట్ర టీడీపీ కార్యాలయం నుంచి వచ్చిన ప్రత్యేక టీడీపీ జండా జ్ఞాపిక లను నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చేతులమీదుగా బుధవారం కనిగిరిలో అందజేశారు.

ఎడ్లపోటీల విజేతలకు బహుమతులు ప్రదానం



వెంకట్ చేతులమీదుగా ప్రథమ బహుమతి అందుకుంటున్న విజేత

దర్శి, జనవరి 10 : జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు గరికపాటి వెంకట్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో సీనియర్ కేటగిరీ ఎడ్ల పందాల్లో విజే తలకు మంగళవారం రాత్రి బహుమ తులు ప్రదానం చేశారు. హైదరాబా ద్‌కు చెందిన సజ్జా హస్యాచౌదరి ఎడ్లు 2875.3 అడుగుల దూరం బండను లాగి ప్రథమస్థానం సాధించి మహేంద్ర ట్రాక్టర్‌ను దక్కిం చుకుంది. కృష్ణా జిల్లా కానూరుకు చెందిన దేవభక్తుని సుబ్బారావు, నంద్యాల జిల్లా, డోన్ టీడీపీ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డిల ఎడ్లు 2858.3 అడుగల దూరం బండను లాగి ద్వితీయస్థానాన్ని కైవసం చేసుకున్నాయి. గుంటూరు జిల్లా, కుంచనపల్లికి చెందిన పులగం దిశ గ్నరెడ్డి, జశ్వంతారెడ్డిల ఎడ్లు 2603.2 అడుగుల దూరం బండను లాగి మూడవస్థానం సాధించాయి. నంద్యాల జిల్లా, కొత్తకోటకు చెందిన డాక్టర్ గురునాథ్ ఎడ్లు 2323.10 అడుగుల దూరం లాగి నాల్గో స్థానం, ప్రకాశం జిల్లా, టంగుటూరుకు చెందిన మక్కెన కోటేశ్వర రావు ఎడ్లు 2242.4 అడుగల దూరం లాగి ఐదో స్థానం, కడప జిల్లా, బాలుగారుపల్లికి చెందిన ఇంద్రిరెడ్డి రమణారెడ్డి ఎడ్లు 2163.11 అడు గుల దూరం లాగి ఆరో స్థానం, హైదరాబాద్‌కు చెందిన డీ రోహన్ బాబు, గుంటూరు జిల్లాకు చెందిన పులగం దిశగ్నారెడ్డి, జశ్వంతారెడ్డి ఎడ్లు 2146 అడుగలు దూరం లాగి ఏడో స్థానం, తెలంగాణలోని హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేంద్రరెడ్డి(ఏఎస్పీ), సుంకి సాకేత్ రెడ్డి, సారికారెడ్డిల ఎడ్లు 1927.9 అడుగుల దూరం లాగి ఎనిమి దోస్థానం, హైదరాబాద్‌కు చెందిన మేకా రామకృష్ణ ఎడ్లు 1894.5 అడుగుల దూరం లాగి తొమ్మిదో స్థానం సాధించాయి. విజేతలకు ప్రథమ బహుమతి కింద మహేంద్రా 474 డీఏ ట్రాక్టర్, రెండో బహుమతి రూ.1.50 లక్షలు, మూడో బహు మతి రూ.1.20 లక్షలు, నాల్గో బహుమతి లక్ష రూపాయలు, ఐదో బహుమతి రూ.80 వేలు, ఆరో బహుమతి రూ.70 వేలు, ఏడో బహుమతి రూ.60 వేలు, ఎనిమిదో బహుమతి రూ.50 వేలు, తొమ్మిదో బహుమతి రూ.40 వేల రూపా యలను గరికపాటి వెంకట్ అందజేశారు. బహుమతుల ప్రదానం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నగర పంచాయితీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బొటుకు రమేష్, జనసేన పార్టీ జిల్లా మహిళా నాయకు రాలు రాయపాటి సుజాత పాల్గొన్నారు.

పోటీలను విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు

దర్శిలో నిర్వహించిన జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రద ర్శన పోటీలను విజయవంతం చేసిన నియోజకవర్గ ప్రజలకు, రైతు లకు, జనసేన, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు జన సేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ బుధవారం ఒక ప్రకట నలో ధన్యవాదాలు తెలిపారు.

మారుమోగిన రామనామం

ఉత్సవంలా రాములవారి అక్షతల ఊరేగింపు


అక్షతలతో సీతారాములను ఊరేగిస్తున్న ప్రజలు

కనిగిరి, జనవరి 10 : అయోధ్య రామమందిరంలోని శ్రీసీతారా ముల విగ్రహాల ప్రతిష్టా మహోత్సవంలో బాలరాముని పాదాల చెంత ప్రత్యేక పూజలు నిర్వహించిన అక్షతలు కనిగిరిలోని రామాల యానికి చేరుకున్నాయి. వాటిని బుధవారం పట్టణంలో ప్రత్యేక పల్ల కిలో సీతారాముల ఉత్సవ విగ్రహాలతో కనక తప్పెట్లు, తాళాలు, వేద మంత్రాల నడుమ ఊరేగించారు. మహిళలు, ప్రజలు, ప్రముఖులు కాషాయ వస్త్రాలు ధరించి పవిత్ర జల కలశాలను మహిళలు నెత్తిపై ధరించి ఊరేగింపులో పాల్గొన్నారు. రాములవారి కీర్తనలతో పట్టణం మారుమోగింది. జాతీయ వాసవీ సత్రసముదాయాల చైర్మ న్ స్వామికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో రామాలయం కమిటీ శ్రీరామభక్త సమాజం అధ్యక్షుడు బచ్చు వెంకయ్య, అయితా శ్రీరాములు, శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానం అధ్యక్షులు శ్రీరామకృష్ణ, మునగా ప్రసాద్, మామిడి శేఖర్, పైడిమర్రి ప్రసన్న, దేవకి సాయిరాం, అద్దంకి సుబ్రమణ్యం, కొలిపాకుల దుర్గా శ్రీనివాసరావు, అద్దంకి వెంకటేశ్వర్లు, చెన్నయ్య, బీ వెంగళరావుగుప్తా, తాళ్లూరి రామసుబ్బయ్య, మాదాల సుబ్బారావు, పైడిమర్రి బాజీరావు, కొలిపకుల సురేష్, గోనుగుంట్ల సుమన్, మురళి, చొప్పరపు సత్యనా రాయణ, గురుస్వామి, మాల్యాద్రి, ఏవీ అనిల్‌కుమార్, కొలిపర్తి వెంక టస్వామి, వెచ్చ చినకోటేశ్వరరావు, వనమా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంప్రదాయ పండుగలు నేటి యువతకు చేరువకావాలి

ఏఎల్ఎన్ఎం వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాల డైరెక్టర్ విజయావెంకటేశ్వరరెడ్డి



కనిగిరి, జనవరి 10 : సంప్రదాయ పండుగలకు నేటి యువత చేరువ కావాలని ఏఎల్ఎన్ఎం వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాల డైరె క్టర్, కరస్పాండెంట్ విజయావెంకటేశ్వరరెడ్డి చెప్పారు. కంబం రోడ్డు లోని కళాశాలలో బుధవారం ఇంటర్, డిగ్రీ కళాశాలలకు చెందిన విదార్థినులకు సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి చిరితోటి భార్గవి రూ.5,116, రెండో బహుమతి ఇర్లా స్పందన రూ.3,116, మూడవ బహుమతిని చండాల విజయలక్ష్మీ మిక్సీని గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న కళాశాల డైరెక్టర్ విజయా వెంకటేశ్వరరెడ్డి





వైరస్ సోకిన మిర్చి మొక్క

మిర్చిపై.. తెగుళ్ల దాడి

- భారీగా తగ్గనున్న దిగుబడులు
- పూతతో పాటు రాలిపోతున్న కాయలు
- చలికాలం ఆరంభం నుంచి పెరిగిన ఉధృతి
- పెట్టుబడులూ తిరిగిరావని రైతుల్లో ఆందోళన
- మూడు జిల్లాలో రెండు లక్షల ఎకరాల పంటపై ప్రభావం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పంటల సాగుకు ప్రకృతి సహకరించడంలేదు. అతి వృష్టి. అనావృష్టితో ఇప్పటికే మిరప పంటపై తీవ్ర ప్రభావం చూపించగా ప్రస్తుతం తెగుళ్ల దాడితో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఒకటి రెండు కాదు ఏకంగా నాలుగైదు రకాల తెగుళ్ల సోకడంతో రైతులు విలవిలాడుతున్నారు. ఈ ఏడాది తీవ్ర వర్షా భావంతో నీటి తడి ఖర్చు చాలదనట్లుగా తెగుళ్ల ఆ శించాయి. దీంతో పంటను కాపాడు కునేందుకు ఖరీదైన మందులను పిచికారి చేస్తూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
తెగుళ్ల కార

కొనుగోలు చేసి తడులిచ్చి పంటను కాపాడుకున్నారు. డిసెంబరులో కురిసిన భారీ వర్షాలకు పంట దెబ్బ తిన్నది. మళ్లీ నెలరోజులుగా తీవ్ర వర్షాభావం నెల కొంది. పంటను కాపాడు కునేందుకు రైతులు భగీరథ యత్నం చేస్తున్నారు. ఎకరాకు రూ.10 నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేసి పంటను కాపాడుకుంటున్న తరుణంలో తెగుళ్ల దాడి చేశాయి. అటు వర్షా భావం, ఇటు తెగుళ్ల నుంచి మిరపను కాపా
డుకునేందుకు



అకుమడత తెగులు సోకిన మొక్క తెగులు సోకి కుళ్లి పోతున్న కాయ

ఐంగా పెట్టుబడులూ తిరిగిరావన్న ఆందోళన రైతుల్లో నెల కొంది. నల్ల తామర, కొమ్మ ఎండు, నల్ల, తెల్ల, పచ్చ నల్లి, ఆకు ముడత, కాయకుళ్లు, వేరు కుళ్లు తెగుళ్లు సో కాయి. చలికాలం ఆరంభం నుంచి తెగుళ్ల ఉధృతి పెరిగింది. తెగుళ్ల వల్ల పూతతో పాటు కాయలు రాలిపోతున్నాయి. మొక్కలు ఎండిపోతున్నాయి.

నాడు ఆసక్తి.. నేడు నిరాశ

మిరపకు మంచి ధర ఉండటంతో పంట సాగుపై రైతులు ఆసక్తి చూపారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 1,89,770 ఎకరాల్లో మిరప సాగైంది. పల్నాడు జిల్లాలో అత్యధికంగా రైతులు ఈ ఏడాది మిర్చి సాగు చేపట్టారు. తేజ, బాడిగ, వండర్‌హాట్, చపాటా వంటి రకాలను ఎక్కువగా సాగు చేశారు. మొక్కలు నాటినప్పటి నుంచి తీవ్ర వర్షాభావం నెలకొంది. నీటిని

రైతులు పడు తున్న కష్టాలు చెప్పనల వికావు. పంట పూత, కాపు దశలో తెగుళ్ల బెదడ మొద లైంది. చలితో పాటు మంచు ఎక్కువగా కురుస్తుం డటంతో తెగుళ్ల తీవ్రత పెరి గింది. కొన్ని చోట్ల ఆకు ముడత, మచ్చ తెగుళ్ల వల్ల పంటలో ఎదుగుదల లేదు. మొక్కకున్న ఆకులు రాలి పోవడంతో పాటు మొక్కలు ఎండిపోతున్నాయి. కాయలు కుళ్లి ఎండి రాలిపోతు న్నాయి. నల్ల తామరతో పూత రాలిపోతున్నది. వైరస్, నల్ల, పచ్చ, తెల్ల నల్లి సోకడంతో కాయ రాలిపోతున్నది. తెగుళ్లతో దిగుబ డులు భారీగా తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు లక్షన్నర ఎకరాల్లో పంటపై తెగుళ్ల ప్రభావం ఉంది. ఈ ఏడాది విత్తనాల ధరలు, సాగు వ్యయం కూలీల ఖర్చులు పెరగడం, మరోవైపు తీవ్ర వర్షాభావంతో నీటి ఖర్చు అధిక మైంది. ఇప్పటికి సాగు వ్యయం లక్షన్నర వరకు అ యిందని రైతులు చెబుతున్నారు. తెగుళ్లు, వర్షాభా వం, అధికవర్షాలకు పంట దెబ్బతినడంతో పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిరపసాగు జిల్లాల వారీగా..

జిల్లా		సాగు ఎకరాల్లో
పల్నాడు	:	1,25,881
బాపట్ల	:	25,337
గుంటూరు	:	38,550

పట్టించుకోని వ్యవసాయశాఖ

తెగుళ్ల నివారణకు నిర్దిష్ట పురుగు మందులు లేకపోవడంతో ఇతర పంటలకు వాడే వాటినే మి రపకు వాడుతున్నారు. పంట యాజమాన్య పద్ధతు లు, పురుగు మందులు వినియోగంపై రైతులకు అధికా రులు సూచించక పోవడంతో ప్రైవేట్ కంపె నీలు లాభాల కోసం అనేక రకాల పురుగు మం దులను సిఫార్సు చేస్తున్నాయి. పంట వేసిన మొ దట్లో ఆకు ముడత వైరస్ వాహకంగా ఉండే తెల్లదోమ, ఆ తదుపరి నల్ల తామర, వైరస్ వల్ల దిగుబడి గణ నీయంగా తగ్గుతోందని రైతులు ఆందోళ న చెందు తున్నారు. తెగుళ్ల నివారణకు ఎన్ని మం దులు వాడినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. వర్షాభావం నుంచి కాపాడుకున్న పంటను తెగుళ్లు మింగేస్తుం డటంతో రైతులు కన్నీటి పర్యంతమవుతు న్నారు. వాతావరణంలో మార్పులు వస్తే తెగుళ్ల ప్ర భావం తగ్గే అవకాశం ఉందని ఉద్యానశాఖ అధి కారులు చెబుతున్నారు.



పొలంలో ఏర్పాటు చేసిన బంక అట్టకు నల్లి పురుగులు



బల్లికురవ మండల వైసీపీ నాయకులతో మంగళవారం సమావేశమైన కృష్ణచైతన్య

బస్సుయాత్రకు.. భయమా?

నేటి సామాజిక యాత్ర వాయిదా

- అద్దంకిలో కొనసాగుతున్న పాలకపార్టీ సిగపట్లు
- గ్రూపుల నేపథ్యంలో స్పందన ఉండదనే కారణమా
- మండలాల వారీ సమావేశాల్లో బిజీగా మాజీ ఇన్‌చార్జి చైతన్య

బాపట్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పాలకపార్టీలో గ్రూపుల సెగ సామాజిక సాధికార బస్సుయాత్రపై పడింది. అద్దంకి నియోకవర్గంలో గురువారం బస్సుయాత్ర జరగనుందని వైసీపీ నేతలు నాలుగు రోజుల క్రితమే ప్రకటించి ఏర్పాట్లు చేశారు. అయితే యాత్ర వాయిదా పడిందని మంగళవారం ప్రకటించారు. పార్టీ చెబుతున్న కారణాలు ఏమైనప్పటికీ అద్దంకి వైసీపీలో రోజురోజుకు ముదురుతున్న గ్రూపుల వైషమ్యాలే కారణమని తెలుస్తోంది. పార్టీ రెండుగా చీలిపోయి కకావికలమైన ప్రస్తుత స్థితిలో బస్సుయాత్ర పెడితే అది విజయవంతం కాకపోగా చైతన్య వర్గం రచ్చచేసే అవకాశం ఉందనే అంచనాల నేపథ్యంలోనే తాత్కాలికంగా వాయిదా వేసుకున్నట్లు సమాచారం. అద్దంకిలో హనిమిరెడ్డిని ఇన్‌చార్జిని నియమించడంపై వైసీపీ అధిష్ఠానం పునరాలోచిస్తోందని అందుకే గురువారం జరగాల్సిన యాత్రను రద్దు చేసినట్లు చైతన్య అనుచరులు అంటున్నారు. పార్టీ పెద్దల రాకకోసం తేదీలు కుదరకనే యాత్ర వాయిదా పడిందని హనిమిరెడ్డి వర్గీయులు ప్రచారం చేస్తున్నారు. అద్దంకిలో పార్టీ పరిస్థితి ఎవరికి వారే యమునా తీరే అన్న చందాన ఉంది. మాజీ ఇన్‌చార్జి చైతన్యతో సంబంధం లేకుండా తాజా ఇన్‌చార్జిగా హనిమిరెడ్డి నియోజకవర్గంలో సమావేశాలతో పాటు, అసంతృప్త నేతలను పిలిచి మాట్లాడుతున్నారు. మరో వైపు చైతన్య మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ తన వర్గం ద్వితీయ శ్రేణి నేతలకు సీటు తనదేనని చెబుతున్నారు. పైగా ఈ నెల 21 వరకు ఓపిక పట్టాలని ఆ తర్వాత తనకు అనుకూలంగా నిర్ణయం వచ్చే అవకాశాలు ఉన్నాయని ధీమాగా చెబుతున్నారు.

బాలినేని, సుబ్బారెడ్డిల మద్దతుతో

సీఎం దగ్గరి బంధువు వైవీ సుబ్బారెడ్డి ఆశీస్సులతోనే హనిమిరెడ్డి అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జిగా వచ్చిన సంగతి తెలిసిందే. ఆ నియామకాన్ని వ్యతిరేకిస్తూ చైతన్యకు మద్దతుగా మాజీ మంత్రి బాలినేని పార్టీ పెద్దల దగ్గర తన గళం విప్పారనే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో బాలినేని సీట్ల తకరారులో అద్దంకి కూడా ఉందనే ప్రచారం జరుగుతోంది. మరో వైపు చైతన్యను పర్చూరుకు పంపే ఆలోచనలో వైసీపీ అధిష్ఠానం ఉన్నట్లు, అందుకు సంబంధించి అద్దంకి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కృష్ణచైతన్య ముందు ప్రతిపాదన పెట్టగా అందుకు ఆయన నిరాకరించినట్లు ప్రచారం జరుగుతోంది. హనిమిరెడ్డికి పూర్తి స్థాయిలో వైసీపీ శ్రేణుల నుంచి మద్దతు దొరకనందువల్ల ఈ సమయంలో బస్సుయాత్ర పెడితే అది విఫలమయ్యే అవకాశాలే ఎక్కువ ఉన్నాయని ఐప్యాక్ నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. అందుకనే సామాజిక సాధికార బస్సుయాత్రను అర్థంతరంగా రద్దు చేసుకున్నారనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.



అనంతవరంలో నాటికల ప్రదర్శనకు సిద్ధమైన కళావేదిక

నేటి నుంచి అనంతవరంలో ఎన్టీఆర్ కళాపరిషత్ నాటికల పోటీలు

యద్దనపూడి, (మార్టూరు) జనవరి 10: ఐదు రోజులపాటు కళాభిమానులకు, కళాపోషకులకు, నాటక ప్రియులకు, యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామంలో గురువారం రాత్రి ప్రారంభమయ్యే ఎన్టీఆర్ కళా పరిషత్ నాటిక పోటీలు కనువిందు చేయనున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాలనుంచి 15 నాటికల ప్రదర్శనలు సోమవారం రాత్రి వరకు ప్రదర్శించనున్నారు. నాటక రంగం మనుగడ ప్రశ్నార్థక మవుతున్న ప్రస్తుత పరిస్థితులలో అనంతవరం గ్రామంలో ఎన్టీఆర్ కళా పరిషత్ నాటికల పోటీలు ద్వారా రంగస్థల కళా కారులకు ప్రోత్సాహం, ఉత్సాహం తో పాటు నాటక రంగానికి ఊపిరిని అందించాలని తమ వంతు బాధ్యతగా కళా పరిషత్ వారు పోటీలను ఏర్పాటు చేయడం కళాకారులకు ఆనందంగా ఉంది. ఏప్రిల్ , మే నెలలో కళా పరిషత్‌లు పోటీలు ఏర్పాటు చేస్తాయి. అయితే అనంతవరం గ్రామంలోని ఎన్టీఆర్ కళా పరిషత్ సభ్యులు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈ పండుగకు ఇతర ప్రాంతాలలో నివసించే వారు తప్పని సరిగా వారి గ్రామాలకు వస్తారని, వారందరు నాటికలను తిలకించాలనే లక్ష్యంతో పోటీలను ఏర్పాటు చేశారు. అంతేగాకుండా ఏకంగా 5రోజులు నాటికల ప్రదర్శనను ఏర్పాటు చేయడం విశేషం.ఈ పోటీలలో ప్రదర్శించే ప్రతి నాటికకు పారితోషికంగా 20 వేల రూపాయలను అందజేస్తారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం మంచు, చలి ఉండటంతో రాత్రి సమయంలో నాటికలను తిలకించడానికి వచ్చే ప్రేక్షకులకు భోజన సౌకర్యంతో పాటు, ఇబ్బంది లేకుండా పై కప్పుగా షామియాలను ఏర్పాటు చేశారు. దాదాపుగా వెయ్యిమంది ప్రేక్షకులు నాటికలను తిలకించడానికి సభా ప్రాంగణం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కళా పరిషత్ అధ్యక్షులు గుదే పాండురంగారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతమైన అనంతవరం గ్రామంలో కళాపోషకులు, గ్రామ ప్రజలు, యువకులు సహకారంతో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు.



మహా ప్రస్థానాన్ని ప్రారంభిస్తున్న దగ్గుబాటి వెంకటేశ్వరరావు, కామినేని శ్రీనివాసరావు, కొమ్మి లక్ష్మయ్య నాయుడు

గ్రామాభివృద్ధిలో దాతల సహకారం అభినందనీయం

● మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు

కుంకలమర్రు(పర్చూరు), జనవరి 10: గ్రామాభివృద్ధిలో దాతల సహకారం అభినందనీయమని మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు అన్నారు. కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామంలో చెన్నకేశవ రూరల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రవాసాంధ్రుల ఆర్థిక సహకారంతో రూ.1.50 కోట్లతో రూపుదిద్దుకున్న మహాప్రస్థానం ప్రారంభోత్సవం బుధవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రులు కామినేని శ్రీనివాసరావు, దగ్గుబాటి వెంకటేశ్వరావు, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు హాజరయ్యారు. నూతనంగా నిర్మించిన మహా ప్రస్థానాన్ని ప్రవాసాంధ్రులు రావి భాస్కర్‌రావు నేతృత్వంలో రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ విదేశాల్లో ఉన్నత స్థానంలో ఉండి పుట్టిన గ్రామానికి మేలు చేకూర్చాలన్న సంకల్పంతో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం గర్వించ తగ్గ విషయం అన్నారు. గ్రామాల్లో ప్రభుత్వాలు చేయలేని పనులను సైతం కలసికట్టుగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం పలువురికి ఆదర్శమన్నారు. దగ్గుబాటి వెంకటేశ్వరావు మాట్లాడుతూ ప్రవాసాంధ్రులైన రావి భాస్కరరావు కుటుంబంతో తమకు మంచి స్నేహసంబంధాలు ఉన్నాయన్నారు. గ్రామానికి మేలు చేయాలన్న సంకల్పంతో అనేక సేవాకార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు, రావి శేషయ్య, వైదిన సంపత్, కొల్లా రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం హిందూ శ్మశాన వాటిక ప్రాంగణంలో మొక్కలు నాటారు.

లారీ ఢీ కొని ద్విచక్రవాహనదారుడు మృతి



మధుబాబు (ఫైల్)

మార్టూరు, జనవరి 10 : లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. ఈ ఘటన మార్టూరు నుంచి రాజుగారిపాలెం వెళ్లే రోడ్డులో ఎస్టీ కాలనీ సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. మండలంలోని రాజుగారిపాలెం గ్రామానికి చెందిన కొండపల్లి మధుబాబు (18)మార్టూరులోని ఒక పొగాకు కంపెనీలో సూపర్ వైజర్‌గా పని చేస్తున్నారు. సాయంత్రం పని ముగించుకొని రాత్రి సమయంలోద్విచక్రవాహనంపై రాజుగారిపాలెం వెళుతుండగా మార్టూరు నుంచి ద్రోణాదుల గ్రామానికి సిమెంటు లోడుతో వెళుతున్న లారీ ద్విచక్రవాహనదారుడిని ఢీ కొన్నది. ఈ ప్రమాదంలో బైక్ రోడ్డు పక్కన గుంతలోకి పడిపోగా మధుబాబు రోడ్డుపై పడగా అతని తలపై లారీ దూసుకుపోయింది. దాంతో మధు బాబు అక్కడికక్కడే మృతిచెందాడు. రాజుగారిపాలెంలోని కాశీలింగం, ధనలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు కాగా వారిలో పెద్దవాడు మధుబాబు. ఈ విషయంపై సమాచారం అందడంతో సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ప్రమాదానికి కారణమయిన లారీని అదుపులోకి తీసుకొని, మధుబాబు మృత దేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

రెండోరోజు సత్తాచాటిన యవన్‌ప్రాపర్టీస్, సౌత్‌జోన్‌జట్లు



రావినూతలలో రెండవరోజు పోటీలలో ఆడుతున్న సౌత్‌జోన్ చెన్నై , ఎస్ ఫైర్ లెవెన్ హైదరబాద్ జట్లు

మేదరమెట్ల , జనవరి 10: రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ భ్రమర సంక్రాంతి కప్ 2024 పోటీలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. బుధవారం రెండో ఉదయం జరిగిన పోటీలలో యవన్ ప్రాపర్టీస్ లెవెన్ హైదరాబాద్, సాయంత్రం జరిగిన పోటీలలో సౌత్ జోన్ సీసీ చెన్నై జట్లు విజయం సాధించాయి. ఉదయం యవన్ ప్రాపర్టీస్ లెవెన్ హైదరాబాద్, ఎంఆర్‌సీసీ లెవన్ చెన్నై జట్లు పోటీ పడ్డాయి. చెన్నై జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. యవన్ ప్రాపర్టీస్ లెవెన్ హైదరాబాద్ జట్టు నిర్ణిత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 117 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎంఆర్‌సీసీ లెవెన్‌చెన్నై జట్టు 16.4 ఓవర్లలోనే 10 వికెట్లు కోల్పోయి 80 పరుగులు సాధించింది. యవన్ ప్రాపర్టీస్ లెవన్‌జట్టు ఎంఆర్‌సీసీ లెవన్‌చెన్నైపై 37 పరుగులతో విజయం సాధించింది. యవన్ ప్రాపర్టీస్ లోని బౌలర్ వరుణ్ 3.4 ఓవర్లు బౌలింగ్ చేసి 8 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు తీశాడు. మరో బౌలర్ షణ్ముక్ 4 ఓవర్లు బౌలింగ్ చేసి 22 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీశాడు.

సాయంత్రం జరిగిన పోటీలలో సౌత్‌జోన్‌సీసీ చెన్నై , ఎస్ ఫైర్ లెవెన్‌హైదరాబాద్ జట్ల మధ్య పోటీ జరిగింది. ఎస్‌ఫైర్ లెవెన్ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన సౌత్‌జోన్ సీసీ చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 155 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌ఫైర్ లెవన్ హైదరాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులు మాత్రమే చేయగలిగింది. సౌత్ జోన్‌సీసీ చెన్నై జట్టు 22 పరుగులతో విజయం సాధించింది. బుధవారం ఉదయం, సాయంత్రం జరిగిన పోటీలలో టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న రెండు జట్లు ఓటమి పాలు అయ్యాయి. గురువారం ఉదయం సిక్కోలు సీతాస్ శ్రీకాకుళం, యువన్ ప్రాపర్టీస్ లెవెన్‌హైదరాబాద్ జట్ల మధ్య పోటీ జరుగుతుంది. సాయంత్రం సౌత్ జోన్ సీసీ చెన్నై , కోకా ఇన్‌ఫ్రా హైదరాబాద్ మధ్య పోటీలు జరుగుతాయని ఆర్ఎస్‌సీఏ చైర్మన్ కారుసాల నాగేశ్వరరావు(బాబు), కార్యదర్శి, కోశాధికారులు యడ్లపల్లి నరసింహారావు, కారుసాల ప్రతాప్‌లు తెలిపారు.



అద్దంకి సమీపంలోని శింగరకొండ వద్ద అర్ధంతరంగా నిలిచిపోయిన టిడ్కో ఇళ్లు

టిడ్కో ఇళ్ల పంపిణీ ఇక లేనట్టేనా..?

● ఐదేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే...

● లబ్ధిదారులకు ఎదురు చూపులే!

అద్దంకి, జనవరి10: టిడ్కో ఇళ్ల పనులు నిలిచిపోయి ఐదేళ్ళు కావస్తోంది. మధ్య మధ్యలో కొన్ని సార్లు పనులు పూర్తి చేయబోతున్నట్లు హడావుడి చేసినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో లబ్ధిదారులకు ఎదురు చూపులే మిగిలాయి. అద్దంకి పట్టణంలోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 960 మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు మంజూరు చేశారు. అయితే 97 ప్లాట్లు రద్దు కావటంతో 863 మందికే ప్లాట్లు కేటాయించారు. టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు తెలుగు దేశం ప్రభుత్వ హయాంలోనే దాదాపు 80 శాతం పూర్తయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నిర్మాణ పనులు పూర్తిగా నిలిపి వేశారు. అధికారులు పలుసార్లు లబ్ధిదారుల వివరాలు సేకరించి హడావుడి చేశారే కాని అసంపూర్తి పనులు మాత్రం పూర్తి చేయలేదు. వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణంపై చూపించిన శ్రద్ధ టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయటంపై చూపించలేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇలా ఐదు సంవత్సరాలు గడిచిపోయాయి.

ఇక రెండు, మూడు నెలలలో సార్వత్రిక ఎన్నికలు వస్తుండటంతో ఈ లోపు టిడ్కో ఇళ్ల అసంపూర్తి పనులు పూర్తి చేసే అవకాశం లేదు. ఎన్నికలు పూర్తయిన తరువాత కొత్తగా ఏర్పడే ప్రభుత్వంలో మాత్రమే టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. టిడ్కో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు జగనన్న కాలనీలలో ఇళ్లు మంజూరు చేయలేదు. దీంతో లబ్ధిదారులు నెలవారీ అద్దెలు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నారు.

కొండమంజులూరులో ఉత్కంఠభరితంగా క్రికెట్ పోటీలు

హైదరాబాద్‌పై గెలుపొందిన బళ్లారి జట్టు

పంగులూరు, జనవరి 10 : మండలంలోని కొండ మంజులూరులో కేసీసీ నిర్వహిస్తున్న జాతీయ స్థాయి టి- 20 క్రికెట్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. బుధవారం ఉదయం జార్ఖండ్ పై తలపడిన చైన్నై జట్టు టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 20 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 163 పరుగులు సాధించింది. అనంతరం 164 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన జార్ఖండ్ జట్టు విజయం సాధించేందుకు ఆఖరి బంతికి రెండు పరుగులు సాధించాల్సి ఉండగా 4 పరుగులు సాధించి 166 పరుగులతో లక్ష్యాన్ని అధిగమించి విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ జట్టులో యాష్‌యాదవ్ 53 పరుగులు సాధించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. సాయంత్రం మ్యాక్ క్రికెట్ క్లబ్ బళ్ళారిపై జడ్- 11 హైదరాబాద్ జట్టు టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకుని 18 ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 99 పరుగులు సాధించింది. అనంతరం 100 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన బళ్ళారి జట్టు 9.4. ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 100 పరుగులు సాధించి గెలుపును కైవసం చేసుకుంది.

నేడు తలపడనున్న జట్లు

గురువారం జరగనున్న పోటీలలో ఉదయం బెంగళూరుపై జార్ఖండ్ తలపడ నుండగా సాయంత్రం ఒంగోలు, బళ్లారి జట్ల మధ్య పోటీ జరుగుతుందని నిర్వాహకులు కరణం స్వామి తెలిపారు.



హైదరాబాద్ జట్టు బౌలింగ్‌ను ఛేదిస్తున్న బళ్లారి జట్టు బ్యాట్స్‌మన్

ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై అవగాహన అవసరం

అద్దంకిటౌన్, జనవరి 10: నూతన ఓటర్లు, వృద్ధులు, తెలియని వారందరు ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓటింగ్‌లో ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానాన్ని గురించి మాస్టర్ ట్రైనర్లు ఆర్. శ్రీనివాసరావు, బి. ప్రసాద్, కె. పోతురాజులు అవగాహన కల్పించారు, ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల దృష్ట్యా కొత్తగా ఓటు హక్కు పొందిన వారికి, వృద్ధులకు ఎలక్ట్రానిక్ ఈవీఎం ద్వారా వేటు వేయడం, వాటి పని విధానం గురించి తెలియజేయడంలో భాగంగా 2023 డిసెంబరు 30 నుంచి జనవరి 22వ తేదీ వరకు అ వగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. దానిలో భాగంగా బుధవారం అద్దంకి మండలంలోని గోపాలపురం, శింగరకొండపాలెం, కొత్తరెడ్డిపాలెం, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, తహసీల్దార్ కార్యాలయాల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరూ ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానాన్ని తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోలు బాషా, సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తాం

అద్దంకిటౌన్, జనవరి 10: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం నెల రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి కనిపించడం లేదని, మా న్యాయమైన డిమాండ్లను ఆమోదించకుంటే ఎన్ని రోజులైనా సమ్మెను కొనసాగిస్తామని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తేల్చిచెప్పారు. అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారానికి 30వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్ని 30 ఆకారంలో కూర్చొని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు డి. మనోలత, యం. రావమ్మ, ఎస్‌వీ లక్ష్మి, కె. రమాదేవి, లలిత, దుర్గ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్ వాడీల నిరసన

బల్లికురవ : బల్లికురవ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం అన్ని గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు సమ్మెలో పాల్గొన్నారు. కొండాయపాలెం అంగన్ వాడీ కేంద్రం హెల్పర్ కొణిదెన అంజమ్మ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందగా ఆమె మృతికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ నేతలు నాగమణి, సునంద, వెంకటరమణ, నిర్మలా, సరస్వతి, జ్యోతి చిన్నమ్మాయి. అరుణ తదితరులు పాల్గొన్నారు.

చీరాలలో

చీరాలటౌన్ : సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు 30వ రోజు చీరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వసంతరావు, ప్రమీల, సుజీవన, శిరీష, బ్యూలా, బుల్లెమ్మాయి, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంగులూరులో..

పంగులూరు : తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని అంగన్‌వాడీలు అన్నారు. పంగులూరులో రెవెన్యూ కార్యాలయం ఎదుట బుధవారం అంగన్‌వాడీలు తమ నిరసన కొనసాగించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మార్టూరులో

మార్టూరు : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించేవిధంగా సీఎం జగన్ మనసు మారాలంటూ బుధవారం మండల కాంప్లెక్స్ వద్ద అంగన్వాడీలు ప్రార్థనలు నిర్వహించారు. అంతేగాకుండా అంగన్వాడీలపై విధించిన ఎస్మా చట్టాన్ని ఉపసంహరించాలని వారు డిమాండు చేశారు. తమ సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు సమ్మెను కొనసాగిస్తామని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్యామల, రాణి, రాజేశ్వరి, అంజలి, బేబీ , రాజ్యం, లలిత పాల్గొన్నారు.



మార్టూరులో ప్రార్థనలు చేస్తున్న అంగన్‌వాడీలు

సంతమాగులూరులో షోకాజ్ నోటీసులు

సంతమాగులూరు : సంతమాగులూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని 134 మంది అంగన్‌వాడీ టీచర్లు, 130 మంది ఆయాలకు బుధవారం షోకాజ్ నోటీసులు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల ఇంటికి వెళ్ళి నోటీసులను అందించారు. గ్రామ సచివాలయాల సిబ్బంది, వలంటీర్ల సహకారంతో షోకాజ్ నోటీసులను అందజేసినట్లు ఐసీడీఎస్ సీడీపీవో డి. పద్మ తెలిపారు. నోటీసులు అందిన 10 రోజులులోగా సంజాయిషీ ఇవ్వాలని సీడీపీవో తెలిపారు.



చీరాల తహసీల్దార్ కార్యాలయం ముందు సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు



బల్లికురవలో సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కారంచేడులో

కారంచేడు(పర్చూరు) : అంగన్‌వాడీల సమ్మె బుధవారంతో 30వ రోజుకు చేరింది. కారంచేడు తహసీల్దార్ కార్యాలయం ముందు అంగన్‌వాడీలు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.అలాగే పర్చూరులోని సీడీపీవో కార్యాలయం ముందు అంగన్‌వాడీలు బైఠాయించి నిరసన చేపట్టారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

హెల్పర్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

అద్దంకిటౌన్, జనవరి 10: అంగన్‌వాడీ హెల్పర్ కొణిదెల అంజమ్మ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ బెదిరింపులతో ఆందోళనకు గురైన బల్లికురవ మండలం కొండాయపాలెం అంగన్‌వాడీ కేంద్రం హెల్పర్ అంజమ్మ తలలో నరాలు చిట్లి వైద్యశాలలో మృతి చెందిందన్నారు. ఆమె కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఉమ్మడి జిల్లా జూనియర్స్ కబడ్డీ జట్లకు ప్రాపబుల్స్ ఎంపిక

చినగంజాం, జనవరి 10 : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉమ్మడి ప్రకాశం జిల్లా జూనియర్స్ బాలబాలికల కబడ్డీ జట్లకు ప్రాపబుల్స్‌ను బుధవారం ఎంపిక చేసినట్లు ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరి సీహెచ్.పుల్లయ్య తెలిపారు. పాకల కరేడు, వేటపాలెం, చినగంజాం తదితర గ్రామాల నుంచి వచ్చిన 20 మంది బాలికలను జిల్లా జట్టుకు ప్రాపబుల్స్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. గిద్దలూరు, మార్కాపురం, చీరాల, పెద గంజాం, కొత్తపట్నం, చినగంజాం తదితర గ్రామాల నుంచి వచ్చిన 50 మంది బాలురలో 20 మందిని ప్రాపబుల్స్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికైన బాలికలకు పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, బాలుర జట్టుకు చినగంజాం జడ్పీ పాఠశాలలో గురువారం నుంచి 18వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణలో ప్రతిభ చూపిన బాలబాలికల జట్లలో 12 మందిని తుది జట్లకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. తుది జట్లకు ఎంపికైన జిల్లా బాలబాలికల కబడ్డీ జట్లు ఈ నెల 20వ తేదీ నుంచి 23వ తేదీ వరకు కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలబాలికల కబడ్డీ పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఎంపికైన బాలికల ప్రాపబుల్స్ జట్టు క్రీడాకారులను ఎంపీడీవో కే.స్వరూపరాణి, ఈవోపీఆర్డీ ఎన్.వేణుగోపాలకృష్ణమూర్తిలు పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి.రామచంద్రరావు, చినగంజాం, పాకల, వేటపాలెం, దుద్దుకూరు జడ్పీ పాఠశాలల పీడీలు గంటా అంకమ్మ, హజరత్తయ్య, జే.శ్రావణి, ముంగర సురేష్‌బాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీవో, ఈవోపీఆర్డీ

వెండి గద బహూకరణ



వెండి గదను అందజేస్తున్న హైకోర్టు జడ్జి వెంకట జ్యోతిర్మయి,శ్రీనివాసశర్మ దంపతులు

అద్దంకి, జనవరి10: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో వంగల శ్రీనివాసశర్మ, హైకోర్టు జడ్జి వెంకట జ్యోతిర్మయి దంపతులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనివాసశర్మ, వెంకట జ్యోతిర్మయి 2-048 కిలోల బరువు గల వెండి గదను బహూకరించారు. శ్రీనివాసశర్మ, వెంకటజ్యోతిర్మయి దంపతులను ఆశీర్వదించి సత్కరించారు. ఈవో సుభద్ర, వేదపండితులు వంగల హరిశంకరావధాని, ప్రధాన పూజారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేడు అరటి పండ్ల పూజ

అమావాస్య సందర్భంగా శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో గురువారం ఉదయం 8 గంటలకు అరటిపండ్ల పూజ జరుగుతుందని ఈవో సుభద్ర తెలిపారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



విద్యార్థినికి నగదు బహుమతిని అందజేస్తున్న దాత హుస్సేన్

బల్లికురవ. జనవరి 10 : ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులు ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించాలని ఎంఈవో రమేష్ కోరారు. బుధవారం బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పోటీ తత్వంతో చదవాలన్నారు. అనంతరం గత ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థికి దాత షేక్ హుస్సేన్ నగదు బహుమతిని అందించారు. అనంతరం ఆటపాటలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ స్లాబుల లారీ సీజ్



పోలీసులు సీజ్ చేసిన గ్రానైట్ స్లాబుల లారీ

బల్లికురవ. జనవరి 10 : ఎలాంటి బిల్లులు లేకుండా ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీ చెల్లించకుండా ఇతర రాష్ట్రానికి తరలిస్తున్న గ్రానైట్ స్లాబుల లారీని మంగళవారం అర్ధరాత్రి ఎస్ఐ వి. వేమన సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ కథనం మేరకు వేమవరం జంక్షన్ నుంచి మహారాష్ట్రకు తరలి వెళుతున్న స్లాబుల లారీని నిలిపి తనిఖీ చేయగా లారీకి ఎలాంటి పత్రాలు లేవని, జీఎస్టీ కూడా చెల్లించలేదని వెల్లడైంది. దీంతో వెంటనే మైనింగ్ అధికారులకు సమాచారం అందించి లారీని స్టేషన్‌కు తరలించిన్నట్లు తెలిపారు.

క్రీడలతో స్నేహపూర్వక పోటీ తత్వం



క్రికెట్ పోటీలను బ్యాటింగ్ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలరాం

చీరాల, జనవరి 10 : క్రీడలతో స్నేహపూర్వక పోటీతత్వం అలవడుతుందని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. స్థానిక ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన పోటీలలో పలువురు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్లో జరిగిన క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే కరణం బలరాం బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. అంతకుముందు నియోజకవర్గంలో జరిగిన పలు కార్యక్రమాల్లో సంబంధీకులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

చినగంజాం, జనవరి 10 : మండలంలోని సంతరావూరు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్ఐ కే.సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం సంతరావూరు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు బుధవారం తనకు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేసి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న శీలం అరుణ అనే మహిళను అదుపులోనికి తీసుకున్నట్లు తెలిపారు. ఆమె వద్ద ఉన్న పది క్వార్టర్ బాటిల్స్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

వెంకటేష్‌ను పరామర్శించిన మిజోరం గవర్నర్



వెంకటేష్‌ను పరామర్శిస్తున్న మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు

చీరాల, జనవరి 10 : కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న వైసీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌ను బుధవారం మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు పరామర్శించారు. వెంకటేష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

మేదరమెట్ల , జనవరి 10: మేదరమెట్ల బైపాస్‌లో ఈ నెల 6 వతేదీ జరిగిన మోటర్ బైక్ ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఒంగోలుకు చెందిన ఓలా గ్రీక్(26) ఒంగోలు నుంచి బైక్‌పై అద్దంకి వెళ్తూ మేదరమెట్ల బైపాస్‌లో ప్రమాదానికి గురయ్యాడు. అప్పటి నుంచి ఒంగోలులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ నాగశివారెడ్డి తెలిపారు.

పైలాన్‌కింద యాచకుడు మృతి

మేదరమెట్లలోని పైలాన్‌కింద గుర్తు తెలియని యాచకుడు మృతి చెందాడు. బుధవారం చలనం లేకుండా పడివున్న యాచకుడుని గమనించిన స్థానికులు మేదరమెట్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు యాచకుడిని పోస్టు మార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

14న మల్లాయపాలెంలో పొట్టేళ్ల పందెం

బల్లికురవ. జనవరి 9 : మండలంలోని మల్లాయపాలెంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా శ్రీ కృష్ణయాదవ్ యూత్ ఆధ్వర్యంలో 14 వ తేదీన పొట్టేళ్ల పందెం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ తెలిపింది. పోటీల్లో పాల్గొనే వారు ముందస్తుగా ఎంట్రీ ఫీజు రూ. 1,000 చెల్లించాని ఇతర వివరాలకు 63054 33005, 9701169525 నెంబర్లను సంప్రదించాలని నిర్వాహక కమిటీ తెలిపింది.

అందరినీ కలుపుకొని పోదాం



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలో టీడీపీ నియోజకవర్గ యువనేత గౌరీఅమర్‌నాథ్

చీరాల, జనవరి 10 : టీడీపీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో ప్రతి ఒక్కరిని కలుపుకు పోదాం. అదే మన విజయానికి సోపానం అవుతుందని టీడీపీ నియోజకర్గ ఇన్‌చార్జి ఎం.ఎం కొండయ్య తనయుడు గౌరీ అమర్‌నాథ్ అన్నారు. బుధవారం జాండ్రపేట దర్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు చినమల్లవరంలో గొట్టిపాటి సమీక్ష

పంగులూరు, జనవరి 10 : పంగులూరు మండలం చినమల్లవరం గ్రామ టీడీపీ శ్రేణులతో ఎంఎల్ఏ గొట్టిపాటి రవికుమార్ గురువారం ఉదయం 9.30 గంటలకు సమీక్ష నిర్వహించనున్నారు. మార్టూరు మండలం జొన్నతాళి క్యాంప్ కార్యాలయంలో జరిగే ఈ సమీక్షకు గ్రామానికి చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జిలు, బూత్ ఏజంట్లు, పేజీ నేస్తం సభ్యులు విధిగా హాజరు కావాలని క్యాంప్ కార్యాలయ ప్రతినిధి తెలిపారు.

ఏసీబీకి చిక్కిన వీఆర్వో, వీఆర్ఏ

భూమి ఆన్‌లైన్‌కు లంచం డబ్బులు తీసుకుంటూ పట్టుబడిన వారి స్నేహితుడు



లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన వీఆర్వో, వీఆర్ఏ, వారి స్నేహితుడు

ఎర్రగొండపాలెం, జనవరి 10 : భూమి ఆన్‌లైన్ కోసం రైతు నుంచి లంచం తీసుకుంటూ బుధవారం వీఆర్వో, వీఆర్ఏ ఏసీబీకి పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండల కేంద్రానికి చెందిన ఎన్.నాగిరెడ్డి అనే రైతు ఎర్రగొండపాలెం మండలం రామచంద్రాపురం రెవెన్యూలో తన తల్లి నుంచి సంక్రమించిన 1.49 ఎకరాల భూమిని ఆన్‌లైన్ చేయాలంటూ గంగపాలెం వీఆర్వో కుమార్ నాయక్‌ను సంప్రదించారు. అందుకు రూ.25వేల లంచం ఇవ్వాలని వీఆర్వో డిమాండ్ చేశారు. దీంతో రైతు నాగిరెడ్డి దీనిపై ఈనెల 1న ఒంగోలు ఏసీబీ డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఈనెల 6న వైపాలెం వచ్చి విచారించారు. వారి సూచన ప్రకారం బాధిత రైతు వీఆర్వో నాయక్‌ను కలిసి మాట్లాడగా రూ.20 వేలు లంచం ఇస్తే సరి అని ఒప్పుకున్నారు. దీంతో బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో వీఆర్వోకు రైతు నాగిరెడ్డి రూ.20వేలు ఇస్తుండగా పక్కనే ఉన్న గురిజేపల్లి వీఆర్ఏ జానీబాషాకు ఇవ్వాలని వీఆర్వో చెప్పారు. వీఆర్ఏ బాషా అక్కడే ఉన్న తన స్నేహితుడు చింతలచెర్వు వెంకటేశ్వరరెడ్డిని డబ్బులు తీసుకోవాలని సూచించారు. రూ.20వేలను వెంకటేశ్వరరెడ్డి తీసు కుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అది చూసిన వీఆర్వో, వీఆర్ఏలు అక్కడి నుంచి ఉడాయించేందుకు ప్రయ త్నించారు. గమనించిన ఏసీబీ సీఐ, సిబ్బంది వెంటాడి వారిని పట్టుకు న్నారు. ఆ ముగ్గురినీ తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లి విచారణ చేపట్టారు. త్రిపురాంతకం గ్రామ రైతు నాగిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసి నెల్లూరు ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ డీఎస్పీ వీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ దాడిలో ఏసీబీ సీఐలు ఎస్ఎస్ఎస్ అపర్ణ, శేషు, ఎస్ఐ జేఎస్ ప్రసాద్, సిబ్బం ది పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐ మారుతీకృష్ణ పర్యవేక్షణలో ఎస్ఐ రాజేష్ పహారా నిర్వహించారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల వినూత్న నిరసన

- దీక్షా శిబిరం వద్ద పొర్లుదండాలు పెడుతూ వేడుకోలు



పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 10: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉద్యోగ భద్రత తో పాటు హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని కోరారు రాష్ట్ర సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఫెడరేషన్(జేఏసి) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు 22వ రోజైన బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరవధిక దీక్షను కొనసాగించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పొర్లుదండాలు పెడుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ప్రభుత్వం మొండివైఖరిని విడనాడి వెంటనే సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిబాబు, కళ్యాణి తదితరులు ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ఇంకొల్లు, జనవరి 10 : ఇంకొల్లు మండలంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు, పేకాడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇంకొల్లు ఎస్సై నాయబ్‌రసూల్ హెచ్చరించారు. కోడిపందేలు ,జూదం, మట్కా నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. వీటిని అడ్డుకోవడానికి నిఘా ఉంచామన్నారు. గతంలో పందేలు నిర్వహించిన,ఆడిన వారిని బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. గ్రామాలలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే మహిళా పోలీసులకు లేదా పోలీసు సిబ్బందికి తెలియజేయాలన్నారు.

మేదరమెట్ల పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా

మేదరమెట్ల , జనవరి 10: దళిత యువకుడిని బెదిరించారని మేదరమెట్ల పోలీస్‌స్టేషన్ ఎదుట దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు ధర్నా చేశారు. బుధవారం సాయంత్రం ఎస్ఐ నాగశివారెడ్డిపై కేసు నమోదు చేయాలని, లేకపోతే న్యాయపోరాటం చేస్తామన్నారు. ఆయన వెంట దార్ల అంజయ్య, తానికొండ ఆనంద్, బొమ్మల రామాంజనేయులు, రంజిత్‌బ్రహ్మయ్య ఉన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

మార్టూరు, జనవరి 10: స్థానికంగా శ్రీనివాసా హైస్కూల్లో ముందస్తుగా విద్యార్థులతో సంక్రాంతి పండుగ వేడుకలను బుధవారం నిర్వహించారు. ఉపాధ్యాయులు చిన్నారులతో హరిదాసుల వేషధారణ వేయించి వారిచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా బాలికలు, మహిళా ఉపాధ్యాయులు నూతన వస్త్రాలు ధరించి పండుగ సంప్రదాయాలను పాటించారు.

క్రీడలపై ఆసక్తి పెంచేందుకే పోటీలు

బల్లికురవ. జనవరి 10 :గ్రామాలలో క్రీడల పట్ల ఆసక్తి పెంచేందుకు పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నామని వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం బల్లికురవ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆడుదాం ఆంధ్ర క్రీడలను హనిమిరెడ్డి ప్రారంభించారు. మండల ప్రత్యేకాధికారి బాలసుబ్రమణ్యం, ఎంపీడీవో బ్రహ్మయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, వైసీపీ నేతలు మంచాల శ్రీనివాసరెడ్డి, కల్లి ప్రసాదరెడ్డి, పావులూరి చందు, మాదాల శివన్నారాయణ వ్యాయామ ఉపాధ్యాయులు బొప్పూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కోలలపూడిలో కబడ్డీ పోటీలు

మార్టూరు, జనవరి 10: మండలంలోని కోలలపూడి జడ్పీ హైస్కూల్లో గురువారం గౌడ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి ప్రారంభయ్యే ఈ పోటీలలో విజేతలకు మొదటి, రెండవ, మూడవ బహుమతులుగా రూ. 20 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు అందజేస్తామని, ఆసక్తిగలిగిన వారు 9505900410 నంబరును సంప్రదించాలన్నారు.

మార్టూరులో ముగ్గుల పోటీలు

మార్టూరులో స్థానిక వివేకానంద నెక్ష్ జన్ స్కూల్లో గురువారం మధ్యాహ్నం ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు స్కూల్ డైరెక్టర్ డాక్టరు వేలూరి కృష్ణ మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్లు, సీనియర్లుగా బాలికలు పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులను అందజేస్తామన్నారు.

చీమకుర్తి బైపాస్‌పై టిప్పర్, కారు ఢీ

● మార్కాపురానికి చెందిన నలుగురికి గాయాలు

చీమకుర్తి, జనవరి 10 : చీమకుర్తి ఔటర్ బైపాస్ రహదారిపై బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మార్కాపురంనకు చెందిన నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. మార్కాపురంనకు చెందిన గుమ్మడి శ్రీనివాసరెడ్డి, నాసర్‌రెడ్డి, మంగమూరి శ్రీనివాసులు, గోపాలరెడ్డిలు కారులో ఒంగోలు వచ్చి తమ పనులు ముగించుకున్న తదుపరి తిరిగి బయలుదేరారు. చీమకుర్తి ఔటర్ బైపాస్ పెట్రోల్‌బంక్ సమీపంలో ముందు వాహనాన్ని క్రాస్ చేసే సమయంలో ప్రమాదవశాత్తు ఎదురుగా వస్తున్న గ్రానైట్ రాళ్లతో రామాయపట్నం వెళ్తున్న టిప్పర్‌ను ఢీకొనడంతో వాహనంలో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. వారిని మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ఆసుపత్రికి తరలించారు.

అవుట్..!

- మాగుంటకు నో టికెట్
- బాలినేనికి నో ఇంటర్వ్యూ
- అయోమయంలో వైసీపీ
- మాగుంటపై పుల్లను పెట్టి గెలిపిస్తానంటూ జగన్ వ్యాఖ్యలు
- ఒంగోలు అసెంబ్లీకి కొత్త పేర్లు పరిశీలన
- కందుకూరు బరి నుంచి బీసీని దించే ప్రయత్నం
- దర్శిలో శివప్రసాదరెడ్డికి లైన్‌క్లియర్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

తాజా పరిణామాల నేపథ్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని వైసీపీ శ్రేణులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. సీనియర్ నాయకులైన బాలినేని శ్రీనివాసరెడ్డి, మాగుంట శ్రీనివాసులరెడ్డిలను సీఎం జగన్ పక్కనపెట్టడం ఇతర కొన్ని నియోజకవర్గాల విషయంలో చోటుచేసుకుంటున్న అనూహ్య పరిణామాలు అందుకు కారణమయ్యాయి. ఒంగోలు లోక్‌సభ నుంచి తిరిగి పోటీ చేసేందుకు మాగుంటకు చాన్సే లేదని చెప్పిన సీఎం బాలినేనికి తనను కలిసే అవకాశం కూడా ఇవ్వలేదు. దీంతో ఆ ఇద్దరు నాయకులు భవిష్యత్తు కార్యాచరణపై ప్రత్యామ్నాయం ఆలోచిస్తున్నట్లు సంకేతాలిచ్చేశారు.



మాగుంట



బాలినేని

జిల్లాలో సీనియర్ రాజకీయ నాయకులుగా ఉన్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిలను సీఎం జగన్ పక్కన పెట్టేశారు. అనుకోని పరిణామాలు సంభవిస్తే తప్ప వారికి తిరిగి పార్టీలో ప్రాధాన్యమిచ్చే అవకాశాలు కనిపించటం లేదు. మాగుంటకు అయితే టికెట్ ఇచ్చే ప్రశ్నేలేదని జగన్ తేల్చిచెప్పారు. ఆయనను కలిసేందుకు వేచి ఉన్న బాలినేనికి ఇంటర్వ్యూ కూడా ఇవ్వలేదు. పైగా మాగుంటపై కొన్ని కీలక వ్యాఖ్యానాలు చేయటంతో ఆయన అనుచరులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. బాలినేని ఇక వేచి ఉండటం వేస్ట్ అంటూ విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లిపోవటమే గాక జిల్లాలో కొన్ని నియోజకవర్గాల పార్టీ సమావేశాలకు రావాలని సాయిరెడ్డి ఆహ్వానించగా నో చెప్పేశారు. దర్శి నుంచి పోటీకి శివప్రసాదరెడ్డికి లైన్‌క్లియర్ చేసిన జగన్, కందుకూరు నుంచి మహీధరరెడ్డిని పక్కన పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఆయన స్థానంలో యాదవ సామాజిక వర్గం వారికి అవకాశం ఇచ్చే పేరుతో కొత్త పేర్లు పరిశీలిస్తున్నారు. ఇక మిగిలిన స్థానాలపై ఇప్పటికీ ఒక స్పష్టత రాలేదని సమాచారం.

మాగుంటకు నో చాన్స్

ఒంగోలు ఎంపీ మాగుంటని పిలిచి మాట్లాడినందుకు ఎంపీ విజయసాయిరెడ్డి, ఐప్యాక్ ఇన్‌చార్జి రిషిసింగ్‌లపై సీఎం జగన్ తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. చంద్రబాబు, పవన్, లోకేష్‌లను తిట్టాలని, డబ్బులు డిపాజిట్ చేయాలని జగన్ విధించిన షరతును మాగుంట తిరస్కరించిన విషయం తెలిసిందే. నూహ్యంగా ఐప్యాక్ నుంచి మాగుంటను తాడేపల్లి వచ్చి కలవాలని పిలుపొచ్చింది. సోమవారం రాత్రి మాగుంట, ఆయన కుమారుడు రాఘవరెడ్డి ఆయనను కలవటం ఆయనకు విధించిన షరతులను వారు వెనక్కు తీసుకోవటం తెలిసిందే. అయితే బుధవారం మధ్యాహ్నం సాయిరెడ్డితోపాటు ఐప్యాక్ ప్రతినిధిని జగన్ పిలిచి మాగుంటతో ఎందుకు మాట్లాడారని తీవ్రంగా మందలించాడని తెలిసింది. అంతేగాక 'షరతులకు ఒప్పుకోని మాగుంట తన గడప తొక్కటానికి వీల్లేదని తీవ్ర ఆంక్ష విధించినట్లు సమాచారం. ఒక దశలో మాగుంట కాకపోతే పుల్లను పెట్టి గెలిపిస్తానని కూడా ఆయన వ్యాఖ్యానించినట్లు తెలిసింది. మాగుంటను పిలిచిన విషయంలో సాయి, రిషిసింగ్ ఒకరిపై ఒకరు చెప్పుకోగా చివరికి సాయిరెడ్డితో జగన్ మాగుంట గురించి పైవిధంగా వ్యాఖ్యానించటం విశేషం. ఈ విషయం తెలిసి మాగుంట మరింత అసంతృప్తికి లోనైనట్లు సమాచారం. 30ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ ఎదురుకాలేదంటూ ఆవేదన చెందుతున్నట్లు చెప్తున్నారు. అంతేగాక కుటుంబ రాజకీయ భవితవ్యంపై తీవ్రంగా ఆలోచిస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిసింది.

బాలినేనికి దక్కని ఇంటర్వ్యూ

సాయిరెడ్డి పిలుపుమేరకు సోమవారం సాయంత్రానికి విజయవాడ చేరిన బాలినేని బుధవారం మధ్యాహ్నం వరకు కూడా జగన్ ఇంటర్వ్యూ దొరకలేదు. సోమవారం సీఎంను కలవాలని సూచించగా తాను మంగళవారం కలుస్తానని బాలినేని చెప్పారు. కారణం ఏమైనా ఇక ఆ తర్వాత సీఎం ఇంటర్వ్యూ ఇవ్వలేదు. అంతేగాక ఆయన తిరిగి మాగుంటకు టికెట్ ఇవ్వాలని పట్టుబడుతుండగా అతను తన గడప తొక్కటానికి వీల్లేదంటూ జగన్ హెచ్చరించటం విశేషం. ఇక ఆ తర్వాత బాలినేని కూడా వేచి ఉండటం వేస్ట్ అన్న నిర్ణయానికి వచ్చి హైదరాబాద్ వెళ్లిపోయినట్లు తెలిసింది. ఆ దశలో సాయిరెడ్డి ఫోన్‌చేసి మాగుంట విషయంలో ఆగ్రహంగా ఉన్నది నిజమేకానీ నీ విషయంలో కాదు కదా అంటూ ఉండమని కోరినట్లు తెలిసింది. అంతేగాక కొండపి, ఎస్ఎన్‌పాడు నియోజకవర్గాలలో మిమ్మల్ని (బాలినేనిని) తీసుకెళ్లి సమావేశాలు పెట్టమని సీఎం సూచించారని, శుక్రవారం ఆ సమావేశాలు పెడదామని సూచించినట్లు తెలిసింది. నేను సీఎంను కలిసేది లేదు, ఒంగోలు దాటి ఇతర ప్రాంతాలకు రానని ఎప్పుడో చెప్పాను, ఇక మర్చిపోండి. నేను ఏ మీటింగులకు రానంటూ బాలినేని సీరియస్‌గానే చెప్పినట్లు సమాచారం.



అనుచరులతో సమాలోచనలు

రెండురోజులుగా తన రాజకీయ భవితవ్యంపై జిల్లాలోని తన అనుచరులు ప్రత్యేకించి ఒంగోలులోని ముఖ్య నాయకులు, శ్రేయోభిలాషులతో బాలినేని సమాలోచనలు చేసినట్లు తెలుస్తోంది. సోమ, మంగళవారాల్లో జిల్లాలోని పలు నియోజకవర్గాల్లోని తన అనుచరులను విజయవాడ పిలిపించుకుని చర్చలు జరిపినట్లు సమాచారం. మంగళవారం రాత్రి అయితే ఒంగోలులోని తన శ్రేయోభిలాషులకు ఫోన్లు చేసి సమాలోచనలు జరపటం రాజకీయ పరిస్థితులు తన భవిష్యత్తు పయనంపై వారి అభిప్రాయం తెలుసుకునేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. ఆయన హైదరాబాద్ వెళ్లారని తెలిశాక ఫోన్లు చేసిన అనుచరులకు హైదరాబాద్‌లో అందుబాటులో ఉంటానని చెప్పినట్లు తెలిసింది. ఇదే సమయంలో బుధవారం రాత్రి మాగుంట, బాలినేనిలు మాట్లాడుకున్నట్లు తెలుస్తోంది. ఎంపీ మాగుంట ఇప్పటికే ముఖ్యమైన ఒకరిద్దరు టీడీపీ నాయకులతో టచ్‌లో ఉన్నట్లు ప్రచారం ఉంది. మాగుంట, బాలినేని కలిసి పయనించాలని భావిస్తున్న నేపథ్యంలో ఎంతవరకు వారిద్దరు కలిసి పయనిస్తారన్నది చర్చనీయాంశమైంది.

ఒంగోలుకు పలు పేర్లు పరిశీలన

ఇదే సమయంలో ఒంగోలు లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేసే అభ్యర్థుల విషయంలో వైసీపీ అధిష్ఠానం పలు పేర్లను పరిశీలనలోకి తీసుకోవటం విశేషం. వైవీ సుబ్బారెడ్డిని రాజ్యసభకు పంపితే ఆయన కుమారుడు విక్రాంత్‌రెడ్డిని ఒంగోలు లోక్‌సభకు పోటీచేయించాలన్న ఆలోచనలో జగన్ ఉన్నట్లు తెలుస్తోంది. ఒంగోలు నుంచి పోటీకి శిద్దా ససేమిరా అనటంతో ఆయన పార్టీలో ఉంటే గిద్దలూరు పంపించి ఒంగోలు నుంచి చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను రంగంలో దింపితే ఎలా ఉంటుందని పరిశీలన చేస్తున్నట్లు సమాచారం. ఇలా కొత్త కొత్త ప్రయత్నాల్లో జగన్ ఉండటంతో వైసీపీ కేడర్‌లో అయోమయం నెలకొంది.

మహీధరరెడ్డికి ఝులక్?

ఉమ్మడి జిల్లాలో మరో సీనియరైన కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డిని తప్పించే యోచనలో జగన్ ఉన్నాడని సమాచారం. ఆయన కూడా ప్రతిపక్ష నాయకులను తిట్టాలన్న షరతును తిరస్కరించిన విషయం తెలిసిందే. దీంతో ఆయన స్థానంలో బలహీనవర్గాలకు చెందిన వ్యక్తిని రంగంలోకి తేవాలని ఆలోచిస్తున్నారు. తొలుత మాజీమంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌ను బుధవారం జగన్ పిలిచి మాట్లాడారు. ఆయన నెల్లూరు సిటీ నుంచే పోటీ చేస్తానని చెప్పటంతో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. అయితే కందుకూరులోని పార్టీశ్రేణుల నుంచి అనిల్‌కుమార్‌తోపాటు పీసీపల్లి మండలంలో డాక్టరుగా ఉన్న పెరుగు మురళీకృష్ణయాదవ్, టంగుటూరు మండలానికి చెందిన వైసీపీ బీసీ నాయకులు బొట్ల రామారావు, కందుకూరుకు చెందిన అప్పనబోయిన నరసింహం పేర్లపై కూడా కార్యకర్తల అభిప్రాయాలను సేకరించటం విశేషం.

మునిసిపల్ కార్మికుల మానవహారం

చీరాలటౌన్, జనవరి 10 : నిరంతరం ప్రజా క్షేమం కోసం పాటుపడే కార్మికుల సమస్యలు ప్రభుత్వం పట్టించుకోలేకపోవడం విచారకరమని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ నిర్వహిస్తున్న సమ్మె బుధవారం 16వ రోజుకు చేరింది. ఈసందర్భంగా ర్యాలీగా గడియార స్తంభం సెంటర్‌కు చేరుకుని మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.బాబురావు, రాజు, సింగయ్య, శంకర్, ఇమ్మానియేల్, కోటేశ్వరి, కుమారి, డొక్కా యోబు పాల్గొన్నారు.

16వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

అద్దంకిటౌన్, జనవరి 10: పని చేసే కార్మికులందరికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారానికి 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో మాకు వచ్చే వేతనాలతో కుటుంబాలు నడపడం కష్టంగా మారిందని, ప్రభుత్వం కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని మున్సిపల్ కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గాలి బీష్మ, బత్తుల కృష్ణ వీరయ్య సుబ్బయ్య, అంజమ్మ, ఆలివేలు తదితరులు పాల్గొన్నారు.



మానవహారం నిర్వహిస్తున్న మునిసిపల్ కార్మికులు

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

ఒంగోలు(క్రైం), జనవరి 10 : రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మధ్యాహ్నం కరవది రైల్వేస్టేషన్‌లో జరిగింది. సుమారు 35 ఏళ్ళ యువకుడు ఒంగోలు వైపు వెళ్లే రైలు కింద పడి బలవన్మరణం చెందాడు. ఎరుపు, బిస్కెట్ కలర్ నిండు చేతుల టీషర్ట్, బులుగురంగు జీన్స్‌ప్యాంటు ధరించి ఉన్నాడు. సుమారు 5.5 అడుగులు ఎత్తు, చామన ఛాయ రంగులో ఉన్న యువకుడు వివరాలు తెలిసిన వారు 9440627646, 7013915467, 9949761057 నంబరులో తెలియజేయాలని ఎస్సై కోరారు.

నిరాధార ఆరోపణలు చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

కొండపి, జనవరి 10 : తనతోపాటు వీఆర్వోపై నిరాధార ఆరోపణలు చేసిన కె.ఉప్పలపాడు గ్రామానికి చెందిన పాలవెళ్లి సంజీవరెడ్డిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శింగారావు బుధవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కె.ఉప్పలపాడు సర్వే నంబర్ 342/1లో 2.26 ఎకరాల పొలాన్ని పాలవెళ్లి నరసింహారెడ్డి కుమారుడైన వేణుగోపాల్‌రెడ్డికి వారసత్వంగా వచ్చినట్లు వీఆర్వో ఇచ్చిన రిపోర్టు మేరకు తాను మ్యూటేషన్ చేస్తే ఫోర్జరీ జరిగిందంటూ అటు వీఆర్వోపై, ఇటు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వరరెడ్డి

నిరుద్యోగులను నిండా ముంచిన జగన్

మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించాలి

యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు మీగడ వెంకటేశ్వరరెడ్డి

కనిగిరి, జనవరి 10 : సీఎం జగన్‌రెడ్డి నిరుద్యోగులను నిండా మోసం చేశాడని యూటీఎఫ్ రాష్ట్ర మీగడ వెంకటేశ్వరరెడ్డి విమర్శించారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీని విడుదల చేయాలని కోరుతూ బుధవారం కనిగిరిలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాక ముందు జగన్ మెగా డీఎస్సీని నిర్వహిస్తామని, ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను మరిచిపోయాడని విమర్శించారు. జగన్‌రెడ్డిని నమ్మిన నిరుద్యోగులు ఓట్లేసి పట్టం కడితే గద్దెనెక్కాక ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి వారి ఆశలపై నీళ్లు చల్లాడని చెప్పారు. ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే డీఎస్సీ నిర్వహించకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి నిరుద్యోగులు గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. అనంతరం ఆర్డీవో జాన్‌ఇర్విన్‌కు వినతిపత్రం అందజేశారు. 'డీవైఎఫ్ఐ నాయకులు నరేంద్ర, శ్రీను, నారాయణ, వలి, శివ, రమణయ్య, బాలకాశయ్య, డీఎస్సీ అభ్యర్థులు రవి, కళ్యాణ్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

గ్రేడ్ ఏదైనా రేటు ఒకటే

కర్ణాటకలో పొగాకు మార్కెట్ జోరు

కిలో రూ.250పైనే పలుకుతున్న ధర

ఇప్పటికే మూడొంతులు కొనుగోళ్లు పూర్తి

రూ.249 ఉన్న కిలో సగటు ధర

ఒంగోలు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక పొగాకు మార్కెట్ జోరు మీద ఉంది. రెండేళ్ల క్రితం ఆంధ్రా మార్కెట్లో ఉన్న పరిస్థితి ప్రస్తుతం అక్కడ కనిపిస్తోంది. పొగాకు నాణ్యతను నిర్ధారించే గ్రేడ్‌లతో సంబంధం లేకుండా గ్రేడ్ ఏదైనా ధర ఒక్కటే అన్న రీతిలో కొనుగోళ్లు జరుగుతున్నాయి. మేలు రకం, మీడియం, లోగ్రేడ్‌లుగా పొగాకు కొనుగోళ్లలో గ్రేడ్‌లు విభజన ఉంటుంది. అలాగే ఒక్కొక్క గ్రేడ్‌లోనూ రెండు నుంచి ఆరేడు రకాలు ఉంటాయి. మంచి మేలు రకం ధరకు, లోగ్రేడ్ ధరకు సాధారణంగా కిలోకు రూ.100పైనే తేడా ఉంటుంది. అలాంటిది ప్రస్తుతం కర్ణాటక మార్కెట్ లోగ్రేడ్ ఏదైనా కాస్తంత నాణ్యత ఉంటే ఇంచుమించు ఒకే ధర పలుకుతోంది. మేలు రకం పొగాకు కిలో గరిష్ఠ ధర ఇప్పటివరకు రూ.274 పలుకగా ఎక్కువ మేలురకం బేళ్లు కిలో రూ.260 నుంచి రూ.270 లోపు కొంటున్నారు. అదే సమయంలో మీడియం గ్రేడ్ కిలో రూ.255 నుంచి రూ.270 వరకు పలుకుతుండగా లోగ్రేడ్‌గా చూపే పొగాకులో నాణ్యత ఉండే బ్రౌన్ ఇతర రకాల ధరలు కూడా కిలో రూ.250పైనే పలుకుతున్నాయి. సాధారణంగా మేలురకం కిలో రూ.270 ఉంటే మీడియం ధర రూ220 అటుఇటుగా ఉంటుంది. లోగ్రేడ్‌లో బ్రౌన్ వంటివి కిలో రూ. 170 నుంచి రూ.190లోపు ఉంటాయి. అలాంటిది ప్రస్తుతం మేలురకం. మీడియం, లోగ్రేడ్ తేడా లేకుండా కిలో రూ.250 నుంచి రూ.270 వరకు ధరలు లభిస్తున్నాయి. బేళ్ల కోసం వ్యాపారులు పోటీపడి మరీ కొనుగోలు చేస్తున్నారు. పంట అనుమతించిన దాని కన్నా తక్కువ ఉత్పత్తి జరగడం, విదేశీ మార్కెట్ బాగా ఉండటంతోపాటు విదేశీ కంపెనీల ఆర్డర్లు సానుకూలంగా ఉండటంతో ఈ పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో 2023-24 సీజన్‌కు 100 మిలియన్లు పంట ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా 83 మిలియన్ కిలోలు ఉత్పత్తిగా అంచనా వేశారు. ఇప్పటివరకు సుమారు 60 మిలియన్లు కొనుగోళ్లు జరగ్గా కిలో సగటు ధర రూ.249 మేర లభించింది. గతేడాది (2022-23) 60 మిలియన్ల పంట విక్రయాలు జరగ్గా సగటున కిలోకు రూ.228 ధర లభించింది మరో నెలలో అక్కడ కొనుగోళ్లు పూర్తి కానుండగా గతంలో ఎన్నడూ లేనంత స్థాయిలో ధరలు పలుకుతున్నాయి. అక్కడి మార్కెట్ తీరును ఆంధ్ర ప్రాంత రైతులు నిశితంగా పరిశీలిస్తున్నారు.

అయినా తగ్గేదేలే!

కొనసాగుతున్న అంగన్‌వాడీల ఆందోళన

ఎస్మా అమలు దిశగా ప్రభుత్వం అడుగులు

కేంద్రాలకు నోటీసులు అతికిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



ఉరితాళ్లను తగిలించుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఒంగోలు నగరం,జనవరి 10 : డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం నాటికి 30వరోజుకు చేరింది. ఎస్మాను ప్రయోగిస్తామని బెదిరించినా ఏమాత్రం వెనకడుగు వేయకుండా సమ్మెను కొనసాగిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా కార్యకర్తలు, ఆయాలు ఎక్కడికక్కడ వినూత్న రీతిలో తమ ఆందోళనలను చేస్తున్నారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన 24గంటల దీక్షలు బుధవారం నాటికి 5వ రోజుకు చేరుకున్నాయి. కలెక్టరేట్ ఎదుట దీక్షలు చేస్తూనే అంగన్‌వాడీలు ఉరితాళ్లతో వినూత్న నిరసన తెలిపారు. జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల కేంద్రాల్లో కార్యకర్తలు చెవిలో పువ్వులు, ఒంటికాలిపై నిలబడటం, ఎస్మా ప్రతులను తగలబెట్టడం వంటి కార్యక్రమాలను చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ సేవలను అత్యవసర సేవల కిందచేర్చి రాష్ట్రప్రభుత్వం వారంరోజుల క్రితం అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించింది. ఈనెల 9వతేదీలోగా సమ్మెను విరమించి విధుల్లో చేరాలంటూ కోరింది. అయితే ఎస్మాను ప్రయోగించటాన్ని అంగన్‌వాడీల యూనియన్లు తీవ్రంగా ఖండించాయి. దీనిపై అందరూ భగ్గుమన్నారు. కాగా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు బుధవారం నుంచి నోటీసులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిస్తున్నారు. ఒంగోలు నగరంలో కేంద్రాలకు అంటిస్తున్నారు. వెంటనే విధుల్లో చేరాలని లేనిపక్షంలో కఠినచర్యలు తప్పవంటూ నోటీసుల్లో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో అంగన్‌వాడీలకు నోటీసులు ఇచ్చి వారు విధుల్లో చేరేలా చూడాలని ప్రభుత్వం నుంచి జిల్లా ఐసీడీఎస్ అధికారులకు ఆదేశాలు అందాయి. కొన్ని ప్రాజెక్టుల సీడీపీఓలు నోటీసులను అంగన్‌వాడీలకు పోస్టు ద్వారా పంపించే ఏర్పాట్లు చేస్తునట్లు సమాచారం. కాగా అంగన్‌వాడీల ఆందోళనకు రోజురోజుకీ మద్దతు పెరుగుతూనే ఉంది. బుధవారం కలెక్టరేట్ వద్ద దీక్షలను ఎస్‌డబ్ల్యుఎఫ్ రీజినల్ కార్యదర్శి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శేషయ్య, ఎంఎన్ఆర్‌యూ జిల్లా అధ్యక్షులు రంజీవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్, సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ జిల్లా కార్యదర్శి సుబ్బారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కొండారెడ్డి, ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ నాయకులు మారెళ్ళ సుబ్బారావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, జీవి.కల్పన, మహేష్ పాల్గొని మద్దతుగా ప్రసంగించారు. విద్యార్థి సంఘాల నాయకులు కూడా అంగన్‌వాడీలకు తమ మద్దతు ప్రకటించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రాజశేఖర్, విద్యార్థి జేఏసీ నాయకుడు ఆర్.జగదీష్ తమ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ, కెవి.సుబ్బమ్మ, ప్రశాంతి, హేమీమా, నిర్మల పాల్గొన్నారు.

సోమశిలలో 31.499 టీఎంసీల నిల్వ



అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 17 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలకుగాను 31.499 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,400, ఉత్తర కాలువకు 250, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు.

తెగని ఉత్కంఠ!



- కందుకూరు వైసీపీ అభ్యర్థిత్వంపై హైడ్రామా!?
- ఎమ్మెల్యే మానుగుంటకు ఈసారి రిక్తహస్తమే!
- చంద్రబాబు, లోకేష్, పవన్‌ను తిట్టకపోవడమే కారణం
- బీసీలను బరిలోకి దించాలని జగన్ యోచన
- ఉదయం నుంచి ఎమ్మెల్యే అనిల్ పేరు.. రాత్రికి కోట్ల రామారావు పేరు ప్రస్తావన
- జగన్ తీరుతో మహీధర్‌రెడ్డి కలత

నెల్లూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : కందుకూరులో వైసీపీ రాజకీయం రసకందాయంలో పడింది. వారం రోజులుగా హాట్‌టాపిక్‌గా ఉన్న రాజకీయ పరిణామాలు బుధవారం మరింత వేగం పుంజుకున్నాయి. టీడీపీ అగ్రనేతలు చంద్రబాబు, లోకేష్, జనసేనాని పవన్ కల్యాణ్‌లను తిట్టని నేరానికి ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డికి వైసీపీ అధిష్ఠానం ఈసారి రిక్తహస్తం చూపుతోంది. రానున్న ఎన్నికల్లో ఆయనకు టికెట్టు ఇవ్వకూడదని నిర్ణయించుకున్న వైసీపీ అధినేత జగన్ ఆ దిశగా పావులు కదిపారు. ఈ క్రమంలో బీసీ వర్గాలకు టికెట్టు ఇవ్వాలని జగన్ నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరిగింది. ఆ ప్రచారాన్ని బలపరిచేలా మంగళవారం రాత్రి నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్ కుమార్‌ను అమరావతికి పిలిపించుకున్నారు. ఆయన్ను కందుకూరు పంపడానికి ఒప్పించే ప్రయత్నం చేశారు.

● స్థానికులతో వాకాబు

దాదాపుగా అనిల్‌ను కందుకూరుకు పంపడం ఖాయమయ్యిందని జిల్లా వైసీపీ నాయకులకు సైతం సమాచారం అందింది. అయితే, తాను నగరం నుంచే పోటీ చేస్తానని అనిల్ పట్టుపట్టడంతో చేసేది లేక జగన్ సమ్మతించినట్లు తెలిసింది. ఆ తర్వాత సీఎం కార్యాలయం నుంచి కందుకూరులో వైసీపీ ముఖ్య నాయకులకు ఫోన్లు వచ్చాయి. కందుకూరుకు యాదవ్ సామాజికవర్గానికి చెందిన బొట్ల రామారావు, పెరుగు మురళీకృష్ణ, అప్పనబోయిన నరసింహులలో ఎవరు బలమైన అభ్యర్థి అవుతారని ఆరా తీశారు. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి బొట్ల రామారావు యాదవ్ పేరు బలంగా ప్రచారంలోకి వచ్చింది. రామారావు వ్యాపారవేత్త, యాదవ సామాజికవర్గంలో ముఖ్య నాయకుడిగా గుర్తింపు ఉన్న వ్యక్తి కావడంతో వైసీపీ అధిష్ఠానం ఆయన వైపే మొగ్గుచూపినట్లు చెబుతున్నారు.

● అవమానంగా భావిస్తూ..

మహీధర్‌రెడ్డి మాత్రం తనకు టికెట్టు ఇచ్చినా వైసీపీలో కొనసాగే ఆలోచనలో లేనట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ విషయాన్ని ఆయన ముఖ్య అనుచరులకు స్పష్టం చేసినట్లు తెలిసింది. తనకు మాటమాత్రం కూడా చెప్పకుండా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న



నియోజకవర్గంలో ఇతరులకు టికెట్లు ఇవ్వడం కోసం స్థానిక నాయకులను వాకాబు చేయడాన్ని ఆయన తీవ్ర అవమానంగా భావిస్తున్నట్లు చెబుతున్నారు. జగన్ తీరుకు తీవ్ర మనస్తాపానికి గురైన మహీధర్‌రెడ్డి ఇక వైసీపీలో కొనసాగడం మర్యాద కాదని భావిస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో టిక్కెట్టు ఇస్తామన్నా తీసుకొని వైసీపీ నుంచి పోటీ చేయడానికి మహీధర్‌రెడ్డి సిద్ధంగా లేరని అంటున్నారు.

● వీపీఆర్ పట్టు

అయితే నెల్లూరు ఎంపీ స్థానంనుంచి బరిలో ఉన్న రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాత్రం మహిధర్‌రెడ్డి కోసం గట్టిగా పట్టుబడుతున్నారు. ఒకవైపు మహీధర్‌రెడ్డికి సర్ది చెబుతూ, మరోవైపు ఆయన టికెట్టు విషయమై అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. అయితే వీపీఆర్ ప్రయత్నాలు ఎంత మాత్రం ఫలిస్తాయన్నది అనుమానమే. నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులను మార్పు చేయాలని వీపీఆర్ అధిష్ఠానాన్ని కోరారు. ఆ మార్పులేవి జరగకపోగా, తాను గట్టిగా కోరుకున్న మహీధర్‌రెడ్డిని పార్టీ నుంచి సాగనంపే ప్రయత్నాలు జరగడాన్ని వీపీఆర్ జీర్ణించుకోలేకపోతున్నారని సమాచారం. మొత్తమ్మీద కందుకూరు వైసీపీలో చోటు చేసుకున్న పరిణామాలు నెల్లూరు జిల్లా రాజకీయాల్లో సైతం మార్పులు తీసుకొచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. .



వేడుకగా పోలేరమ్మ గ్రామోత్సవం

అల్లూరు: అల్లూరులో జరుగుతున్న తిరునాళ్లలో భాగంగా మంగళవారం అర్ధరాత్రి తర్వాత పోలేరమ్మ అమ్మవారి గ్రామోత్సవం వేడుకగా జరిగింది. అశ్వ వాహనంపై కొలువుదీరిన అమ్మవారిని చూసేందుకు భక్తజనం పోటెత్తింది. ఈ సందర్భంగా గంగపెట్టె, వీర తాళ్లతోపాటు కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ సుకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఊరేగింపు బుధవారం సాయంత్రం వరకు కొనసాగింది. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వ్యాపారవేత్తలు కావ్య కృష్ణారెడ్డి, పసుపులేటి సుధాకర్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. మ్యూజికల్ నైట్‌లో బుల్లితెర నటులు బుల్లెట్ భాస్కర్, నరేష్ టీమ్‌తోపాటు పల్సర్ బైక్ గాయకుడు రమణ, నృత్య ప్రదర్శనల ఝాన్సీ, సినీ గాయకుడు ధనుంజయలతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

'షోకాజ్' అస్త్రం!

- 2,546 మంది అంగన్‌వాడీలకు నోటీసులు
- పది రోజుల్లో విధుల్లో చేరాలని ఆదేశం
- ససేమిరా అంటున్న ఆందోళనకారులు
- ఉధృతం కానున్న ఉద్యమం

నెల్లూరు (వైద్యం) జనవరి 10 : డిమాండ్ల సాధన కోసం రోడ్డెక్కిన అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం కన్నెర్ర జేసింది. వారి న్యాయమైన కోరికలను మన్నించకపోగా 'ఎస్మా' చట్టాన్ని ప్రయోగించింది. తాజాగా షోకాజ్ నోటీసులు ఇవ్వాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు 2546 మందికి షోకాజ్ నోటీసులు అందచేశారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై అంగన్వాడీలు భగ్గుమంటున్నారు.

● సమ్మె నెల రోజులకు..



కావలి ప్రాంతంలో అంగన్వాడీ కుటుంబ సభ్యులకు నోటీసులు ఇస్తున్న అధికారులు

అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె బుధవారం నాటికి నెల రోజులకు చేరుకుంది. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని తదితర డిమాండ్లతో నెల రోజులుగా వారు సమ్మె చేస్తున్నారు. అయితే, ప్రభుత్వం ఇప్పటికే మూడు సార్లు అంగన్‌వాడీ నేతలతో చర్చించినా కొలిక్కి మాత్రం రాలేదు. ఈ నెల 5వ తేదీలోపు విధుల్లో చేరాలని, లేకుంటే చర్యలు తప్పవంటూ ప్రభుత్వం కూడా హెచ్చరికలు జారీ చేసింది. ఈ హెచ్చరికలను ఏమాత్రం లెక్క చేయని అంగన్‌వాడీలు సమ్మెను కొనసాగించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణ బాధ్యత తను సచివాలయాలకు ప్రభుత్వం అప్పగించింది. అలాగే ఈ నెల 6వ తేదీన అంగన్‌వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగించింది. ఈ చట్టం అమలుపై అంగన్ వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమపట్ల నిరంకుశంగా వ్యవహ రిస్తోందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారులు అంగన్వాడీలకు ఐదు సెట్ల షోకాజ్ నోటీసులు అందజేసి, పది రోజుల్లో విధుల్లో చేరాలని, ప్రభుత్వ ఉత్తర్వులు తప్పక పాటించాలని హెచ్చ రిస్తున్నారు.

● 2,546 మందికి నోటీసులు

జిల్లాలో 2934 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ఇప్పటివరకు 2,546 మందికి షోకాజ్ నోటీసులు అందచేశారు. తహసీల్దార్లు, వీఆర్వోలు, సీడీపీవోలు అంగన్వాడీల ఇళ్లకు వెళ్లి వ్యక్తిగతంగా లేదా వారి ఇళ్లకు, పక్కింటి వారికి నోటీసులు అందిస్తున్నారు. పోస్టల్ ద్వారా 1670 మందికి నోటీసులు పంపించారు. అయితే చాలా మంది నోటీసులు తీసుకునేందుకు నిరాకరించడంతో వారి ఇళ్లకు, అంగన్‌వాడీ కేంద్రాలకు నోటీసులు అతికిస్తున్నారు.

నోటీసులు పంపిణీ చేస్తున్నాం



అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు పంపిణీ చేస్తున్నాం. కొందరు నిరాకరిస్తుండటంతో వారి ఇళ్లకు, అంగన్‌వాడీ కేంద్రాలకు నోటీసులు అంటిస్తున్నాం. 10 రోజుల్లో విధుల్లో చేరాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెల్లడించాం. 2780 మంది సమ్మెలో ఉన్నా పౌష్టికాహార పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సచివాలయాల ద్వారా పంపిణీ జరుగుతోంది.

- హేన సుజన్, ఐసీడీఎస్ పీడీ

తగ్గేదే లేదు!

● అంగన్‌వాడీ నేతల స్పష్టీకరణ

నెల్లూరు (వైద్యం) జనవరి 10 : ఎస్మా చట్టం, షోకాజ్ నోటీసులు వంటి ఎన్ని ప్రయోగాలు చేసినా తగ్గేదే లేదని అంగన్‌వాడీలు స్పష్టం చేస్తున్నారు. డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు చేస్తున్న సమ్మె బుధవారానికి 30వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భం కలెక్టరేట్ వద్ద జరుగుతున్న నిరాహార దీక్షలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెహనాబేగం మాట్లాడారు. అంగన్‌వాడీలను ఎన్ని రకాలుగా ఒత్తిడి చేసినా తమ డిమాండ్లు సాధించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ జగన్ ఇచ్చిన హామీ మేరకు సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ ప్రభుత్వం దిగివచ్చే వరకు సమ్మె విరమించబోమని వెల్లడించారు. ఈ దీక్షలో సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు, యూనియన్ నేతలు కామాక్షమ్మ, రజనీ, మల్లెమ్మ, రమాదేవి, సుమతి, ఉషా,కల్పన, నాగభూషణమ్మ, రత్నమ్మ, హారతి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు : కలెక్టరేట్ వద్ద దీక్షలో పాల్గొన్న అంగన్‌వాడీలు



'నెల్లూరు జిల్లాలో ఏం జరుగుతోంది!? మాకందిన ఫిర్యాదును బట్టి ఆస్థాయిలో క్వార్ట్జ్‌ను తవ్వేస్తుంటే మీరేం చేస్తున్నారు. అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు. కొల్లగొట్టిన ప్రకృతి సంపద ఎంత? ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి పది రోజుల్లో నివేదిక ఇవ్వండి.'

- రాష్ట్ర, జిల్లా అధికారులకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలివి

కొల్లగొట్టిన క్వార్ట్జ ఎంత!?

- వెంటనే విచారించి.. నివేదిక ఇవ్వండి!
- రాష్ట్ర అధికారులకు కేంద్రం ఆదేశం
- ప్రకృతి సంపద దోపిడీపై టీడీపీ నేత సోమిరెడ్డి ఫిర్యాదు
- ఆధారాలు సహా ప్రధాని, కేంద్రమంత్రికి లేఖ

రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశంగా మారిన క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిలకు చేసిన ఫిర్యాదుపై కేంద్ర అధికారులు కదిలారు. జీపీఎస్ ఫొటోలతో సహా సోమిరెడ్డి ఫిర్యాదు చేయడంతో దానిని పరిగణలోకి తీసుకున్నారు. సంబంధిత అధికారులు ఈ ఫిర్యాదును పరిశీలించిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. సదరు ఫిర్యాదుపై వెంటనే విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ ధీరజ్‌కుమార్ రాష్ట్ర గనుల శాఖ అదనపు చీఫ్ సెక్రటరీకి ఈ నెల 1వ తేదీన ఆదేశాలు పంపారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా తప్పనిసరి పరిస్థితుల్లో స్పందించాల్సి వచ్చింది. వెంటనే విచారించి నివేదిక ఇవ్వాలని డైరెక్టర్ ఆఫ్ మైన్స్‌ను రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది ఈ నెల 4వ తేదీన ఆదేశించారు. అదే విషయాన్ని సోమిరెడ్డికి కూడా తెలియజేశారు. దీంతో అక్రమ క్వార్ట్జ్ తవ్వకాలపై ఎట్టకేలకు కదలిక వచ్చింది.

● రాష్ట్రంలో ఒక్కరు స్పందిస్తే ఒట్టు!

అంతర్జాతీయ మార్కెట్లో రూ.2వేలు ఉన్న క్వార్ట్జ్ 30వేలకు చేరడంతో వైసీపీ నేతల కన్ను ఈ క్వార్ట్జ్‌పై పడింది. తొలుత జిల్లాలోని పెద్ద నాయకులే క్వార్ట్జ్‌ను అక్రమంగా తవ్వుకొని సొమ్ముచేసుకోవడం ప్రారంభించారు. ఆ తర్వాత ప్రభుత్వ పెద్దల దృష్టికి వెళ్లడంతో ఒక్కో మండలం ఒక్కొక్కరు తవ్వుకునేలా పంచాయితీ చేశారు. ప్రభుత్వ భూములే కాకుండా ప్రైవేటు మైన్లను కూడా వదలకుండా దౌర్జన్యంగా తవ్వుతున్నారు. దీనిపై జిల్లాలోని టీడీపీ ముఖ్య నేతలంతా పోరాటం చేయడం మొదలుపెట్టారు. తొలుత సైదాపురం వెళ్లి ఆందోళన చేయడంతో కొన్ని రోజులు తవ్వకాలు ఆపేసిన అక్రమార్కులు ఆ తర్వాత మళ్లీ మొదలుపెట్టారు. పొదలకూరు మండలం వరదాపురం సమీపంలోని రుస్తుం, భారత్ మైన్లలో తవ్వకాలపై హైకోర్టు స్టే ఇచ్చినా లెక్కచేయకుండా క్వార్ట్జ్‌ను తరలించారు. దీనిని గత నెలలో అడ్డుకున్న టీడీపీ నేత సోమిరెడ్డి సత్యాగ్రహ దీక్షకు కూర్చుకున్నారు. సుమారు 40 వాహనాలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడమేగాక ప్రమాదకరమైన జిలిటెన్ స్టిక్స్ వంటి భారీ పేలుడు పదార్థాలను గుర్తించారు. వీటన్నింటినీ జీపీఎస్ ఫొటోలతో సహా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీజీపీ, డైరెక్టర్ ఆఫ్ మైన్స్ (డీఎంజీ), కలెక్టర్, ఎస్పీలకు పంపి ఫిర్యాదు చేశారు. కానీ ఎవరూ స్పందించలేదు. మూడు రోజుల అనంతరం చివరకు అర్ధరాత్రిన సోమిరెడ్డి సత్యాగ్రహ దీక్షను భగ్నం చేసి, వాహనాలనూ వదిలేశారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

● అధికారుల తీరుపై ఫిర్యాదు

నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ప్రజా సంపదను కొల్లగొడుతున్నా రాష్ట్రంలో ఏ ఒక్క అధికారి స్పందించడం లేదని ప్రధానమంత్రి, కేంద్ర మంత్రికి చేసిన ఫిర్యాదులో సోమిరెడ్డి పేర్కొన్నారు. క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై జీపీఎస్ ఫొటోలతో సహా ఆధారాలు సమర్పించినా పట్టించుకోకుండా ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తున్నారని వివరించారు. అనుమతులు లేకుండా విలువైనక్వార్ట్జ్‌ను దేశం దాటిస్తుండటంతో కేంద్ర ప్రభుత్వానికి కూడా భారీ నష్టం కలుగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై పది రోజుల్లోనే కేంద్ర ప్రభుత్వం స్పందించి విచారణకు ఆదేశించడం గమనార్హం. అయితే అంతకముందు జిల్లా నుంచి రాష్ట్రం వరకు అనేక మంది అధికారులకు ఫిర్యాదు చేసినా ఏ ఒక్కరూ స్పందించలేదు. ఇప్పుడు కేంద్రం పట్టించుకోవడంతో రాష్ట్ర అధికారుల్లో చలనం వచ్చింది. అయితే సోమిరెడ్డి ఫిర్యాదుపై ఎటువంటి విచారణ జరుపుతారు..? కేంద్రానికి ఏమని నివేదిక ఇస్తారన్నది!? ఆసక్తిగా మారగా, సంబంధిత అధికారుల్లో మాత్రం వణుకు మొదలైంది.

పనులు చేయకనే... పైసలు నొక్కేసే యత్నం!



సంగంలోని ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయం

- 2021-22 ఎఫ్‌డీఆర్ కింద రూ. 1.5 కోట్లు కాజేసే పన్నాగం
- ఓ ప్రజాప్రతినిధి పీఏ, సంగంలోని కీలకనేత హస్తం
- చివరి నిమిషంలో వెలుగులోకి..
- ఉన్నతాధికారుల హెచ్చరిక
- ఆగిన బిల్లుల అప్‌లోడ్

సంగం, జనవరి 10: సంగం ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో 2021- 22 ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్స్ (ఎఫ్‌డీఆర్) కింద పనులు చేయకుండానే రూ. 1.5 కోట్లను కాజేసేందుకు బిల్లులు పెట్టే ప్రయత్నం చేశారు. గతనెల 31న చివరి నిమిషంలో విషయం తెలుసుకున్న ఇద్దరు నాయకులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నిధుల దోపిడీకి అడ్డుకట్ట పడింది. ఇందులో ఓ ప్రజా ప్రతినిధి పీఏతోపాటు ఆ ప్రజాప్రతినిధికి ముఖ్య అనుచరుడు సంగం గ్రామానికి చెందిన కీలకనేత హస్తం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

వివరాల్లోకి వెళితే... సంగం ఇరిగేషన్ సెక్షన్‌లో దువ్వూరు కాలువ, కనిగిరి ప్రధాన కాలువ పరిధిలోని బ్రాంచి కాలువలు, మండలంలోని ఇతర 10 చెరువుల పరిధిలో సుమారు 12 వేల ఎకరాల విస్తీర్ణం ఉంది. 2021- 22లో కురిసిన భారీ వర్షాలకు సోమశిల నుంచి వరద వచ్చింది. సుమారు 5 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం సంగం ఆనకట్టకు వచ్చింది. ఈ వరదతో పెన్నా బ్యారేజ్‌తోపాటు చెరువులు స్వల్పంగా దెబ్బతిన్నాయి. అప్పట్లో ఎఫ్‌డీఆర్ పనులకు ప్రతిపాదనలు పంపారు. 28 పనులకు రూ. 1.97 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయి. కానీ పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో స్థానిక నాయకుడు ఒకరు అప్పట్లో కావలికి చెందిన ఓ కాంట్రాక్టర్‌ను సంప్రదించారు. ఆయన ముందుకు రావడంతో నామినేషన్ మీద అగ్రిమెంట్ చేశారు. కానీ పనులు చేయలేదు. ఈ నేపథ్యంలో ఎన్నికలు ముంచుకొస్తుండడంతో అధికార పార్టీ ప్రజాప్రతినిధికి ముఖ్య అనుచరుడిగా ఉన్న సంగం గ్రామానికి చెందిన ఓ కీలకనేత, ఆ ప్రజాప్రతినిధి, ఎఫ్‌డీఆర్ పనులకు అప్పట్లో ఇన్‌చార్జిగా ఉన్న ఏఈతో కుమ్మక్కైయ్యారు. వచ్చేబిల్లులో కీలకనేతతోపాటు ప్రజాప్రతినిధి పీఏకు 60శాతం, దొంగ బిల్లులు చేసిన అధికారికి 40 శాతం ఇచ్చేటట్లు ఒప్పందం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆ మేరకు గత నెలాఖరులో బిల్లులు సిద్ధం చేశారని తెలిసింది. అయితే బిల్లులను ప్రస్తుతం సెక్షన్‌లో ఏఈగా ఉన్న అధికారి థంబ్ వేసి అప్‌లోడ్ చేయాలి. లేకపోతే గుట్టుచప్పుడు కాకుండా బిల్లులు అప్‌లోడ్ అయిపోయేవి. ఈ క్రమంలో ఎలాగో మండలంలోని ఓ ఇద్దరు వైసీపీ నేతలకు విషయం తెలిసింది. దీంతో వారు వెంటనే స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దాంతో విషయం బహిర్గతం కావడంతో బిల్లులు అప్‌లోడ్‌కు సాహసం చేయలేక పోయారు. . అయితే ఈ విషయం ఆ నోటా ఈ నోటా పడింది.

● బిల్లుల విషయమై కలకలం

ఈ నేపథ్యంలో మంగళవారం సంగంలో ఓ కల్యాణ మండపంలో వైసీపీ ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అక్రమ బిల్లుల విషయం చర్చకు రావడంతో కలకలం రేగింది. దీంతో సదరు నాయకుడు చీమకుట్టినట్లుగా వ్యవహరించినట్లు మిగతా నాయకులు గుసగుసలాడుకున్నారు. ఎట్టకేలకు రూ.1.5 కోట్ల ప్రభుత్వ సొమ్ము దోపిడీకి గురికాకుండా చేసుకున్నామని చెప్పుకుంటున్నారు.

● అంతా పుకార్లే...

ఈ విషయంపై ఏఈఈ బీవీ కృష్ణను వివరణ కోరగా అంతా పుకార్లేనని కొట్టి పారేశారు. నన్ను కూడా చాలా మంది అడిగారు. అదేమి లేదని చెప్పా. ఎవరైనా బిల్లులు రికార్డ్ చేసినా నేను థంబ్ వేసి అప్‌లోడ్ చేయాలి. పనులు చేయకుండా నేనెలా చేస్తాను. అలాంటిదేమి జరగలేదన్నారు.

నేటి నుంచి విధుల్లోకి పారిశుధ్య సిబ్బంది

- మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ
- స్థానిక సమస్యలపై నేడు కమిషనర్‌తో భేటీ

నెల్లూరు (సిటీ) : సమాన పనికి సమాన వేతనం, ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలన్న డిమాండ్లతో సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు గురువారం నుంచి విధుల్లోకి రానున్నారు. బుధవారం యూనియన్ నేతలు, రాష్ట్ర ప్రభు త్వం మధ్య జరిగిన చర్యలు సఫలం కావడంతో సమ్మె విరమిస్తున్నట్లు సంఘా ల నాయకులు ప్రకటించారు. నెల్లూరులోనూ బుధవారం అర్ధరాత్రి నుంచే విధుల్లోకి వస్తారని సీఐటీయూ నాయకులు ప్రకటించారు. కాగా సమ్మె కాలంలో కార్మికులపై పెట్టిన కేసులు, స్థానికంగా కార్పొరేషన్ నుంచి అం దాల్సిన ప్రయోజనాలు తదితర అంశాలపై గురువారం మధ్యా హ్నం 12 గంటలకు కమిషనర్ వికాస్‌మర్మత్‌తో కార్మిక సంఘాల నాయకులు భేటీ అవుతారని సీఐటీయూ నేత కత్తి శ్రీనివాసులు తెలిపారు.



● కాగా బుధ వారం పారిశుధ్య కార్మికులు నెల్లూరు గాంధీబొమ్మ కూడలి నుంచి నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కత్తి శ్రీనివాసులు, పద్మ, కొండమ్మ, భాగ్యమ్మ, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికితీతకే 'ఆడుదాం ఆంధ్రా' : ఎమ్మెల్యే



కావలి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



ఆత్మకూరు: ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ కేతా

కావలి, జనవరి 10: పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి తెలిపారు. మండల స్థాయి పోటీలను బుధవారం కావలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలతో కలిసి క్రికెట్ ఆడారు. ఈ కార్యక్రమంలో కావలి తహసీల్దార్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట: బోగోలు మండలంలో ఎంపీడీవో వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో మండలస్థాయి ఆడదాం ఆంధ్రా ఆటల పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కావలి ఆర్డీవో శీనానాయక్ బిట్రగుంట రైల్వే క్రీడామైదానంలో క్రికెట్ పోటీలను మండల ప్రత్యేక అధికారి పరిమళతో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తాసీల్దారు హేమంత్ కుమార్, ఎంఈవో నరసింహారావు, తదితరులు ఉన్నారు. ఆర్ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల్లో ప్రారంభమైన వాలీబాల్ పోటీలకు 16 జట్లు పాల్గొనట్లు క్రీడా ఉపాధ్యాయులు షేక్.ఖాదర్, సులోచన తెలిపారు. విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల్లో ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు.

లింగసముద్రం: లింగసముద్రం, పెదపవని గ్రామాల్లోని హైస్కూళ్లలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభమయ్యాయి. క్రికెట్, కబడ్డీ పోటీలను సర్పంచులు పులి రాఘవులు, దామా సీతారామయ్య, ఎంపీడీఓ యు శేషబాబు, తహసీల్దారు టీ ప్రసాద్‌లు ప్రారంభించారు. మాలకొండరాయునిపాలెం జట్టుపై చినపవని జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు ఆ గ్రామ సర్పంచు దామా సీతారామయ్య రూ.5000 అందజేశారు.

వలేటివారిపాలెంలో మొక్కుబడిగా....

వలేటివారిపాలెం: వలేటివారిపాలెం హైస్కూల్‌లో జరిగిన ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి పోటీలకు స్పందన కరువై మొక్కుబడిగా జరిగాయి. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావల్సిన పోటీలు మధ్యాహ్నం 12 గంటలు దాటినా ప్రారంభం కాలేదు. అధికారులు మైదానాలు సిద్ధం చేసి క్రీడాకారుల కోసం ఎదురుచూశారు. మండలంలోని 15 గ్రామ సచివాలయాలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఆటల పోటీలకు సుమారు 90 టీంలను ఎంపిక చేశారు. అయితే క్రీడాకారులు రాకపోవడంతో మైదానాలు వెలవెలబోయాయి. మధ్యాహ్నం 12 గంటల తరువాత ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కుబడిగా పోటీలు ప్రారంభించి మమా అనిపించారు.

ఆత్మకూరు: ఆడుదాం ఆంధ్రా రెండవ విడత మండల స్థాయి క్రీడా పోటీలను మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో పలు సచివాలయాల జట్ల మధ్య పోటీలు హోరాహోరీగా సాగాయి. ఎస్ఆర్‌జెడీ క్రీడా ప్రాంగణంలో జరిగిన క్రికెట్ పోటీల్లో కరటంపాడు జట్టు విజయం సాధించింది. ఈ పోటీలు రెండు రోజుల పాటు కొనసాగుతాయని ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. వ్యాఖ్యాతగా మహిమలూరు పంచాయతీ కార్యదర్శి పి భాస్కర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ కాలువ నరసింహులు, పీడీలు పి తిరుపతయ్య, షరీఫ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సంగం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎంపీడీవో గోపీ ప్రారంభించారు. వాలీబాల్ పోటీలు నిర్వహించారు.

ఉదయగిరి: గ్రామీణ ప్రాంత యువతీ, యువకుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలని జడ్పీ కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్ అన్నారు. బుధవారం ఉదయగిరిలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి వెంకటయ్య, సర్పంచ్ సామ్రాజ్యం, ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఎంఈవో శ్రీనివాసులు, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, వార్డెన్ బాషుసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారులు వెంకటయ్య, ఆజాద్, ఎంపీడీవో సాయిప్రసాద్, తహసీల్దారు రామ్మోహన్, నాయకులు ఎల్‌పీ మాలకొండారెడ్డి, జయసింహారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు : స్థానిక క్రీడా మైదానంలో బుధవారం ఎంపీడీవో శ్రీదేవి ఆధ్వర్యంలో మండలస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించారు. తొలుత కబడ్డీ పోటీలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలను ఇన్‌చార్జ్ ఎంపీడీవో భార్గవి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. మండలంలో సీతారామపురం, అయ్యవారిపల్లిలో ఏర్పాటు చేసిన క్రీడామైదానాలలో వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల జెసిఎస్ కన్వీనర్ మాబయ్య, మాజీ ఎంపీటీసీ రామిశెట్టి తిరుపతయ్య, మండల వైసీపీ ప్రధాన కార్యదర్శి పిడతల ఓబులేసు, అయ్యవారిపల్లి సర్పంచ్ దుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ రమేష్, పీఈటీ ప్రసాద్, గుర్రం సుబ్బయ్య, ముతు పాల్గొన్నారు.

నాణ్యమైన పొగాకు పండించాలి



పొగాకు పంటను పరిశీలిస్తున్న బోర్డు చైర్మన్

మర్రిపాడు, జనవరి 10: డీసీపల్లి పొగాకు బోర్డును బుధవారం చైర్మన్ యశ్వంత్‌కుమార్ సందర్శించారు. రైతులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన పొగాకు పండించాలని, రైతు సంక్షేమానికి బోర్డు అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం డీసీపల్లి, గుండెమడకల గ్రామాల్లో పొగాకు పంటలను పరిశీలించారు. ఆయన వెంట వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్, రైతుసంఘం నాయకులు నరసపనాయుడు ఉన్నారు.

వంద రోజుల్లో వైసీపీ పతనం

ఉదయగిరి రూరల్, జనవరి 10: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వంద రోజుల్లో పతనం కాబోతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచల బాబుయాదవ్ పేర్కొన్నారు. బుధవారం తన నివాసంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో పేదల జీవనం దుర్భరంగా మారిందన్నారు. వైసీపీని శాశ్వితంగా ఇంటికి పంపేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జరగనున్న ఎన్నికల్లో టీడీపీ 160 సీట్లు కైవసం చేసుకొని చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సురేష్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో యాప్ ప్రాంతీయ కార్యాలయం ప్రారంభం

ఆత్మకూరు, జనవరి 10 : యాదవ ఎంప్లాయీస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (యాప్) రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం ఆత్మకూరు పట్టణంలో ప్రాంతీయ కార్యాలాయాన్ని వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మాదాల వెంకటేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం, డాక్టర్ పిట్టి మల్లికార్జునరావు, యాప్ జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్ల కొండయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మాదాల వెంటరాజేష్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చెవుల రామచంద్రయ్య, గౌరవ సలహాదారులు గంగుల మధుసూధన్‌రావు, యాదవ భవన్ ట్రస్ట్ చైర్మన్ బొమ్మి నాగకిషోర్, ఆనంగి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

సీతారామపురం, జనవరి 10 : సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని బసినేనిపల్లి గ్రామంలో ఎంఆర్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ట్రస్ట్ అధినేత బీజేపీ నాయకుడు ముడమాల రమేష్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. మొదటి బహుమతి రూ.15వేలు, రెండవ బహుమతి రూ.8వేలు అందించడం జరుగుతుందని, మండలంలోని క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

యర్రబల్లికి బస్సు నడపండి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 10: నెల్లూరు ఆర్టీసీ 1వ డిపో మేనేజర్ మురళీకృష్ణ బుధవారం చేపట్టిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ఇద్దరు ప్రయాణికులు ఫోన్ చేసి వారి సమస్యలు తెలిపారు. చేజర్ల మండలం యర్రబల్లి గ్రామానికి నాలుగేళ్లుగా బస్సు సౌకర్యం లేదని, కనీసం రోజుకు రెండు ట్రిప్పులైనా బస్సు నడపాలని గ్రామస్తుడు కుమార్ కోరారు. స్పందించిన డీఎం సాధ్యాసాధ్యాలు పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నెల్లూరు నుంచి రాపూరుకు రాత్రి 10 గంటలకు నడిపే సూపర్ లగ్జరీ బస్సు స్థానంలో ఎక్స్‌ప్రెస్ సర్వీసు నడపాలని పొదలకూరుకు చెందిన పీ జిలానీ ఖాన్ కోరారు. ఈ సమస్య రాపూరు డిపోకు సంబంధించినది కనుక వారి దృష్టికి తీసుకువెళతానని మురళీకృష్ణ సమాధానమిచ్చారు.

శబరిమలకు తరలిన అయ్యప్పలు

ఉదయగిరి, జనవరి 10: స్థానిక శివాలయంలో బుధవారం అయ్యప్పస్వాముల ఇరుముడి కార్యక్రమం జరిగింది. అనంతరం ఊరేగింపుగా శబరిమలైకు బయలుదేరారు.

రాక్షస పాలన సాగిస్తున్న వైసీపీని సాగనంపుదాం



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు

ఉదయగిరి రూరల్, జనవరి 10: రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని శాశ్వతంగా సాగనంపుదామని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయగిరి పట్టణం యాదవవీధిలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పి చెంచలబాబుయాదవ్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు వికాస్‌హరికృష్ణలతో కలిసి బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ప్రజాదీవెన యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బొజ్జా శ్రీనివాసులు(ఘన) ఆధ్వర్యంలో వైసీపీ నాయకుడు ఉప్పుటూరి వెంకటయ్య, మత్స్యకారులు వారి అనుచరులతో కలిసి 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి బొల్లినేని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే తొలుత ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంతోపాటు పట్టణంలో సమస్యలు పరిష్కరిస్తానన్నారు. 2024లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఓబులరెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, గడ్డం శ్రీనివాసులు సందానీ, సజిల్, మాబాషా, గూడూరు వెంకటేశ్వరరావు, ఖాన్‌షా తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరంధామిరెడ్డి

వరికుంటపాడు, జనవరి 10: కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలు చేయాల్సిన అధికారులు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి గైర్హాజరవడంపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆంధ్రా పరంధామిరెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి రోజు బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి కూడా పలు శాఖల అధికారులు నిర్లక్ష్యవైఖరి అవలంభించడం ఎంతవరకు సమంజసమన్నారు. అలాంటి వారిపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. అనంతరం క్యాలెండర్లు, ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులు, ఉజ్వల గ్యాస్ సిలిండర్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వైనారూత్, సీనియర్ అసిస్టెంట్ సీతారామాంజనేయులు, సీహెచ్‌వో రాజశేఖర్‌రాజు, బ్యాంకు మేనేజర్ శోభన్‌బాబు, పశు వైద్యాధికారి రాఘవేంద్ర, నారాయణరెడ్డి, గ్యాస్ నిర్వాహకులు ఓబయ్య, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలువాయి : మండలంలోని బాలాజీరావుపేటలో బుధవారం వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు పాల్గొని ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రసాద్, ఎంపీడీవో గోవర్ధన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రక్తదాతలు స్ఫూర్తి ప్రదాతలు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో మధులత

ఆత్మకూరు, జనవరి 10 : రక్తదాతలు స్ఫూర్తిప్రదాతలుగా నిలిచి పలువురికి ప్రాణదానం చేస్తున్నారని ఆర్డీవో కె మధులత, జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె శేషారత్నం అన్నారు. సామాజిక న్యాయ మహాశిల్పం కార్యక్రమంలో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో బుధవారం జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. మాట్లాడుతు రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం రమేష్‌బాబు, ప్రోగామ్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్‌బాబు, డాక్టర్ అస్మా, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చంద్రా వెంకటసుబ్బానాయుడు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ సాదిక్‌హుస్సేన్, పలువురు రెడ్‌క్రాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల నియామకానికి ఇంటర్వ్యూలు

వరికుంటపాడు, జనవరి 10: మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టులకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీదేవి ఇంటర్వ్యూలు నిర్వహించారు. పెద్దిరెడ్డిపల్లి, కాంచెరువు, వరికుంటపాడు, గణేశ్వరాపురం, విరువూరు, నార్త్‌కృష్ణంరాజుపల్లి, తిమ్మారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఖాళీగా ఉన్న 25 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఉదయగిరి : ఉదయగిరి ఆర్టీసీ డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎం శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ప్రయాణికులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 9959225095 నెంబర్ ద్వారా సూచనలు, సలహాలు, ఇబ్బందులను తెలియచేయాలని ఆయన కోరారు

ఆత్మకూరు : పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శనివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కరీమున్నీసా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారుల బృందం పాల్గొంటారని, ఆత్మకూరు ప్రాంత ప్రజలు, ప్రయాణికులు సలహాలు, సూచనలు, ఫిర్యాదులను 9959225645 ఫోన్‌చేసి తెలియజేయాలని కోరారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

మంచినీటి పైపులైన్ పగిలిందా?

● రోడ్డుపై మురుగు నీరు నిల్వ ● ప్రమాదాల బారిన ప్రజలు



విద్యుత్ సబ్‌స్టేషన్ బజారులో రోడ్డుపై నీరు

కావలి, జనవరి 10: కావలి పట్టణం వెంగళరావునగర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ పక్క వీధిలో రోడ్డుపై నీరు పారుతుండటంతో రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. అక్కడ రోడ్డుపైకి నీరు ఎక్కడ నుంచి వస్తుందో అర్థంకావడంలేదని స్థానికులు చెబుతున్నారు. మంచినీటి సరఫరా సమయంలో నీరు ఎక్కువగా రోడ్డుపై పారుతుండటం నీటి సరఫరా ఆగిన తర్వాత ఆగిపోతుండటంతో మంచినీటి పైపులైన్ పగిలి ఆ నీరు మురుగు నీటిలో కలిసి రోడ్డుపైకి వస్తుందనే అనుమానాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. నీటి సరఫరా ఆగిపోయిన తర్వాత ఆ మురుగు నీరంతా పైపులైన్‌లోకి వెళ్లి మంచినీరు కలిషితగా వస్తుందని స్థానికులు చెబుతున్నారు. రోడ్డుపైకి వస్తున్న నీరు నిల్వ చేరి రోడ్డుపై పాచి పట్టి అక్కడ రాకపోకలకు వాహనచోదకులతోపాటు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా వారు అక్కడకు వచ్చి చూచి పోతున్నారే కానీ ఆ నీరు ఎలా వస్తుంది.. ఎక్కడ నుంచి వస్తుందో నిర్ధారించలేక పోతున్నారు. అక్కడ డ్రైనేజీ నిర్మాణం కోసం కంకర తోలారు. దాని నిర్మాణం త్వరగా చేపడితే మురుగు నీటిలో పైపులైన్ నీరు ఎక్కడ కలుస్తోందో అర్థమవుతోంది. లేదంటే ఆ ప్రాంతంలో ఉన్న ప్రధాన పైపులైన్ తవ్వి లీకేజీని గుర్తించి దానిని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నైపుణ్యాలే విద్యార్థి భవితకు మార్గదర్శకం

కందుకూరు, జనవరి 10: ఇంజనీరింగ్ విద్యార్థులు సాఫ్ట్‌వేర్ లాంగ్వేజెస్‌లో కనీస నైపుణ్యాలు సాధిస్తే ఉద్యోగాలకు కొదువలేదని మైక్రాన్ కంపెనీ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సందీప్ వెల్లడించారు. ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో వారం రోజులుగా డీకోడ్ సాఫ్ట్ సొల్యూషన్స్ సంస్థ ఆధ్వర్యంలో 3వ సంవత్సరం ఈసీఈ, ఈఈఈ విద్యార్థులకు జరుగుతున్న వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో బుధవారం ముఖ్య విశ్లేషకుడిగా సందీప్ పాల్గొని సందేశమిచ్చారు. కార్యక్రమంలో కాలేజీ టెక్నికల్ డైరెక్టర్ కె.విజయ్ శ్రీనివాస్, కళాశాల అకడమిక్ ఇన్‌చార్జి ఎస్ఎం మీరావలి పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

వలేటివారిపాలెం, జనవరి 10 : మండలంలోని అంకభూపాలపురంలో సర్పంచు ప్రగడ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. గ్రామంలోని వీధుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. అంతేగాకుండా సైడు కాలువలలో పూడిక తీయించి మురుగు నీరు నిల్వ లేకుండా చేపట్టారు. మురుగుకుంటలలో బ్లీచింగ్ చల్లించారు.

వీధిలైట్లకు మరమ్మతులు

వలేటివారిపాలెం, జనవరి 10 : మండలంలోని అంకభూపాలపురం, నేకునాంపురం గ్రామాలలో వీధిలైట్లు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని సర్పంచులు ప్రగడ ఆదిలక్ష్మి, కొల్లూరి లక్ష్మమ్మలు బుధవారం వీధిలైట్లకు మరమ్మతులు చేయించారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

దగదర్తి(బిట్రగుంట), జనవరి 10: దగదర్తి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జాతీయ ఉపాధి హామీ పథకం 2022-23లో జరిగిన పనులపై బుధవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో వెంకటరమణమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ద్వామా పీడీ వెంకట్రావు, ఎంపీపీ తాళ్లూరి వెంకటకృష్ణప్రసాద్ నాయుడు, ఏపీడీవో మృదుల పాల్గొన్నారు. ఏడాది కాలంలో జరిగిన పనులపై తనిఖీ బృందం ఇచ్చిన నివేదిపై చర్చించారు. కార్యక్రమంలో విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ అధికారి వేణుగోపాల్, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలకు భారీ ఏర్పాట్లు

అల్లూరు, జనవరి 10 : రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు స్వగ్రామం ఇస్కపల్లిలో ప్రతి ఏటా నిర్వహించే సంక్రాంతి సంబరాలను ఈ ఏడాది కూడా నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. ఎప్పటిలాగే సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసేందుకు భారీ ఏర్పాట్లు చేపట్టినట్లు బీఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి మురళి తెలిపారు. యువతను అలరించేందుకు సినీ ప్రముఖులతో మ్యూజికల్ నైట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా బుధవారం యువతకు క్రికెట్ పోటీలు నిర్వహించారు.

అగ్ని బాధితులకు పరామర్శ

కొండాపురం, జనవరి 10: సాయిపేట పంచాయతీ ఇస్కపాలెంలో అగ్నిప్రమాదంలో తగలబడిన గడ్డివాముల బాధితులు గణిపనేని కొండబాబు, గణిపనేని మధులను ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు బుధవారం పరామర్శించారు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్‌తో మాట్లాడి నష్టం వివరాలను జిల్లా కలెక్టరుకు నివేదించాలని కోరారు. కలెక్టరుతో మాట్లాడి బాధిత రైతులను ఆదుకునేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం, క్రిష్ణయ్య, రైతు కార్యదర్శి పోలినేని రమేష్, గుడవళ్లూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు కుంకు మోహనరావు, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు వల్లూరు వెంకటేశ్వర్లు, నాయకులు చెరుకూరు వెంకటాద్రి, నర్రా చెంచునాయుడు

పోలేరమ్మకు చల్ది సమర్పించిన భక్తులు

కావలిటౌన్ : పాతూరులో నడివీధి పోలేరమ్మ జాతరలో భాగంగా బుధవారం భక్తులు చల్ది, పొంగళ్లు నైవైద్యంగా సమర్పించారు. మహిళా భక్తులు సాంప్రదాయబద్ధంగా చల్ది, పొంగళ్ల కుండలతో అక్కమ్మ బావి సెంటర్ నుంచి ఊరేగింపుగా పోలేరమ్మ అరుగు వద్దకు చేరుకుని అమ్మవారికి చల్ది సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారిని ఊరేగింపుగా పాపిరెడ్డి చెరువుకు సాగనంపారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆచారపు కర్తలు, కార్యనిర్వాహకులు కేతిరెడ్డి రామకోటారెడ్డి, జనిగర్ల మహేంద్ర యాదవ్, ఈతముక్కలు బాలమురళీరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులు భిక్షమెత్తుకోవాల్సిందేనా?



భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కావలిటౌన్, జనవరి 10: ప్రభుత్వ మొండి వైఖరితో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు భిక్షమెత్తుకోవాల్సిందేనా అని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌కిషోర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు తలపెట్టిన సమ్మెలో భాగంగా బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు ట్రంకురోడ్డులో భిక్షాటన చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లి అంకయ్య, గుంజి కిషోర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నాగరాజు, యూనియన్ నాయకులు ఆదినారాయణ, తన్నీరు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం 16 రోజుకు చేరింది. కార్మికులు 16 అంకె ఆకారంలో కూర్చుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు పెంచలయ్య, కృష్ణమోహన్, యూనియ న్ నేతలు తురకా శీనయ్య, బీ రమేష్, ఓ.రమేష్, పర్సు జేమ్స్ అనురాధ, చిన్నమ్మ, రాజేశ్వరి, వెంకమ్మ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కందుకూరు : మున్సిపల్ కార్మికులు 8వ రోజు నిరసన భాగంగా బుధవారం కందుకూరులో పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో కోలాటం ప్రదర్శనతో వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కోలాటంతో పోస్టాఫీసు సెంటర్, ఎన్టీఆర్ విగ్రహం సెంటర్ల మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

ఆత్మకూరు : మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మెలో భాగంగా బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు, ఏఐటీయూసీ మున్సిపల్ యూనియన్ నాయకులు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దిగివచ్చేవరకు అంగన్వాడీల పోరాటం



కందుకూరు సబ్‌కలెక్టరు కార్యాలయం వద్ద..



ఆత్మకూరు : మాట్లాడుతున్న లక్ష్మీపతి



అనంతసాగరం : ఒంటికాలిపై నిరసన

కందుకూరు, జనవరి 10: ఎస్మా లాంటి చట్టాలు ఎన్ని ప్రయోగించినా అంగన్వాడీల పోరాటపటిమకు ఈ ప్ర భుత్వం దిగిరాక తప్పదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు పేర్కొ న్నారు. అంగన్వాడీల సమ్మె 30వ రోజుకు చేరిన సందర్భంగా ఉలవపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం మండలాల కు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు బుధవారం కందుకూరు సబ్‌క లెక్టరు కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. కందుకూరు అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని కందుకూరు పట్టణం, రూరల్, వలేటివారిపాలెం మండ లాల కార్యకర్తలు, అయాలు స్థానిక ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో జీవీబీ కుమార్, ప్రాజెక్టు లీడర్ సీహెచ్ ఇంద్రావతి, ఎస్కే పద్మజ, బి.మార్తమ్మ, సీహెచ్ పద్మజ, ఎం.పద్మ, డి.రమాదేవి, బి.మార్తమ్మ, కామాక్షి, ప్రసన్న, ఎస్కే అమీరు న్నీషా తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : సమస్యలు పరిష్కరిం చాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మెలో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏర్పా టు చేసిన ప్రత్యేక శిబిరంలో బైఠాయిం చారు. సీపీఎం, సీఐటీయు నాయ కులు జి లక్ష్మీపతి, ఆత్మకూరు నాగయ్య, శిబి రానికి విచ్చేసి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి.రాధ, పలువురు సెక్టార్ లీడర్లు కె రమణమ్మ, కామేశ్వరి, జమీల, విజయలక్ష్మి, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

అనంతసాగరం : స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదా లు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అన్వర్‌బాష, ఆవాజ్ నాయకులు రంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి : స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు బుధవారం ఒంటికాలిపై నిలబడి నిరసనను వ్యక్తం చేశారు. తమ సమస్య లను వెంటనే పరిష్కరించాలని, ఎస్మాను తొలగించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, ప్రమీలా, మహాలక్ష్మమ్మ, సుబ్బ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు షోకాజ్ నోటీసులు

లింగసముద్రం, జనవరి 10 : రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తహసీల్దారు టీ ప్రసాద్ మండలంలోని 45 అంగన్‌వాడీ కేంద్రాల వర్కర్లకు, ఆయాలకు బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను వీఆర్వోలు, సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రాల గోడలకు అంటించారు. ఈ నోటీసులలో ప్రభుత్వం గత నెల 12వ తేదీ నుంచి అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు విధులకు హాజరు కావడం లేదని, దీని వలన సేవలలో అంతరాయం ఏర్పడిందని, అందువలన మిమ్ములను ఎస్మా పరిధిలోకి తెస్తూ, మీకు సమ్మె చేసే హక్కు లేదని, మిమ్ములను ఎందకు తొలగించకూడదో ఈ నోటీసు అందిన 10 రోజుల్లో వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు.

ఉలవపాడు : మండలంలోని 148 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు షోకాజ్ నోటీసులు అందచేసినట్లు ఉలవపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో విజయకుమారి తెలిపారు. స్థానిక రెవెన్యూ అధికారుల ద్వారా నోటీసులు అంగన్‌వాడీ సెంటర్ల వద్ద అంటించి, మరొక కాపీ అందుబాటులో ఉన్న సిబ్బంది చేతికి ఇచ్చామన్నారు. షోకాజ్ నోటీసులు తీసుకోవడానికి ఇష్టపడని అంగన్‌వాడీలు తిరస్కరించడంతో నోటీసులను వారి ఇళ్ల గోడలకు అంటించారన్నారు. 10 రోజుల్లో వివరణ ఇచ్చి విధుల్లో చేరాలని లేని పక్షంలో ప్రభుత్వం తీసుకునే చర్యలకు బాధ్యులు అవుతారని సంబంధిత అధికారులు హెచ్చరించారు.

బిట్రగుంట : బోగోలు మండలం 30 రోజులుగా సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీ వర్కర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తునట్లు సీడీపీవో సౌజన్య తెలిపారు. మండలంలో 79 అంగన్వాడీలు ఉన్నారన్నారు. ఆమె వెంట సూపర్‌వైజర్లు కోటేశ్వరి, సుభాషిణి, సుప్రజ పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్ : మండలంలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బందిచే షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు తహసీల్దారు సానా శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కార్యాలయంలో వీఆర్వోలు, సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మెచేస్తున్న వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నామని, నోటీసులు తిరస్కరించిన కార్యకర్తలు నిర్ణీత సమయంలోపు వివరణ ఇవ్వాల్సి ఉందన్నారు. మండలంలో ఇప్పటివరకు 43 మందికి నోటీసులు జారీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తేజస్విని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ'



కరపత్రాలు పంచుతున్న ఇంటూరి, తదితరులు

కందుకూరు, జనవరి 10: పట్టణంలోని మందలపువారి కొష్టాలు, చల్లావారి కొష్టాలు, బిలాల్‌నగర్, బాలాజీనగర్ ప్రాంతాల్లో బుధవారం టీడీపీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముచ్చు శ్రీను, గట్టమనేని సుబ్బారావు, చల్లా సురేష్, మండలపు గోపి, బోయపాటి శ్రీనివాసరావు, సవిడిబోయిన వెంకటకృష్ణ, చల్లా సురేష్, కొత్తపల్లి సురేష్, చల్లా రమేష్, ఉన్నం మాల్యాద్రి, మున్వర్, పామర్తి సాయి, అమ్మనబోయిన వేణు తదితరులు పాల్గొన్నారు.

జన్ భగీదారీలో భాగంగా రక్తదానం



రక్తదానం చేస్తున్న సబ్‌కలెక్టర్ విద్యాధరి

కందుకూరు, జనవరి 10: అంబేడ్కర్ స్మృతి కార్యక్రమం సందర్భంగా నిర్వహిస్తున్న జన్ భగీదారీలో భాగంగా కందుకూరులో సబ్ కలెక్టరు జి.విద్యాధరి ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు రక్తదానం చేసేందుకు ముందుకు రాగా సబ్ కలెక్టరు విద్యాధరి సైతం రక్తదానం చేసి స్ఫూర్తిని నింపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధి చెన్నా రామాంజనేయులు, తహసీల్దారు ఆర్.బ్రహ్మయ్య, డీఎల్‌డీఓ పద్మజ, ఎంపీడీఓ విజయశేఖర్, సీఐ హఫీజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.